

22న సీఎం రాక



విశాఖపట్నం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈనెల 22వ తేదీన నగరానికి రానున్నారు. నోవాటెల్ హోటల్‌లో జరగనున్న ఈ-గవర్నెన్స్ జాతీయ సదస్సులో ఆయన పాల్గొంటారు. వివిధ రాష్ట్రాల ఐటీ మంత్రులు, ఉన్నతాధికారులతో పాటు ఐటీ, ఎలక్ట్రానిక్స్ నిపుణులు హాజరుకానున్నారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి ఇంకా అధికారికంగా షెడ్యూల్ విడుదల కావలసి ఉంది.

ఆక్రమణలకు అడ్డుకట్ట

రోడ్డు మార్జిన్లు, ఫుట్‌పాత్‌లు ఆక్రమించి ఏర్పాటు చేసిన దుకాణాల తొలగింపునకు నడుం బిగించిన జీవీఎంసీ

- ఇప్పటికే పూర్తయిన సర్వే
- ప్రతి వార్డులో కనీసం ఒక హాకర్ జోన్ ఏర్పాటు
- 98 వార్డుల్లో 112 జోన్లు
- వ్యాపారులను అక్కడకు తరలించాలని నిర్ణయం
- ఆపరేషన్ లంగ్స్ పేరుతో ఆక్రమణల తొలగింపు
- ఇకపై నిరంతరం కొనసాగనున్న స్పెషల్‌డ్రైవ్



రైల్వే న్యూకాలనీ ఆర్చ్ వద్ద రోడ్డుపైనే టిఫిన్ బండి...దాని ఎదురుగా వాహనాల పార్కింగ్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

నగరంలో పలు రహదారులతో పాటు ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు పెరిగిపోయాయి. ఎక్కడికక్కడ దుకాణాలు వెలిశాయి. వీటి కారణంగా వాహనాల రాకపోకలకు ఆటంకం కలిగి, తరచూ ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఈ సమస్యను అధిగమించేందుకు హాకర్స్ జోన్‌లు ఏర్పాటు చేయాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ నిర్ణయించారు. ప్రస్తుతం రోడ్లు ఆక్రమించి వ్యాపారులు చేసుకుంటున్న వారిని అక్కడకు తరలించనున్నారు. దీనికోసం కార్యాచరణ ప్రారంభించారు.

ఉపాధి కోసం పేదలు రోడ్డుపక్కన దుకాణం పెట్టుకుంటారు. అయితే కొందరు కార్పొరేటర్లు, రాజకీయ నేతలు సొంతంగా రోడ్డుపక్కన దుకాణాలు ఏర్పాటుచేసి వాటిని ఇతరులకు అద్దెకు ఇచ్చి జేబులు నింపుకుంటున్నారు. ఒకరిని చూసి ఒకరు అన్నట్టు నగరమంతా ఇదే ట్రెండ్ కొనసాగడంతో ప్రధాన రోడ్లు, కూడళ్లు ఆక్రమణలతో బక్కచిక్కిపోయాయి. ద్వారకా నగర్, జగదాంబ కూడలి, డైమండ్ పార్కు, మద్దిలపాలెం వంటి ప్రాంతాల్లో జీవీఎంసీ నిర్మించిన ఫుట్‌పాత్‌లను కూడా ఆక్రమించి వ్యాపారాలు సాగిస్తున్నారు. ఆక్రమణల వల్ల పాదచారులు, వాహన చోదకులు ఎదుర్కొంటున్న అవస్థలను ... మిగతా 6వ పేజీలో



నరసింహనగర్ రైతుబజార్ వద్ద ఆక్రమణలు తొలగిస్తున్న పోలీసులు, జీవీఎంసీ సిబ్బంది

పేదల ఆకలి తీరుస్తున్న అన్న క్యాంటీన్లు

ఏడాది కిందట నగరంలో 25 చోట్ల ఏర్పాటు

- సంవత్సర కాలంలో 74.62 లక్షల మందికి ఆహారం
- రుచిగా, శుచిగా ఉండడంతో పెరిగిన ఆదరణ

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

నగరంలో అన్న క్యాంటీన్లకు విశేష ఆదరణ లభిస్తోంది. నగరాలు, పట్టణ ప్రాంతాల్లో నిరుపేదలు, నిరాశ్రయులు, వివిధ పనులపై ఇతర ప్రాంతాల నుంచి వచ్చేవారి ఆకలి తీర్చడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం సరిగ్గా ఏడాది కిందట అన్న క్యాంటీన్లను ప్రారంభించింది. ఈ ఏడాది కాలంలో నగరంలోని 25 అన్న క్యాంటీన్లలో సగటున రోజుకు 23,843 మంది భోజనం చేస్తున్నారు.



ప్రాంతీయ కంటి ఆస్పత్రి వద్ద గల అన్న క్యాంటీన్‌లో గురువారం రాత్రి వడ్డన



నిరుపేదలకు నామమాత్రపు ధరకు నాణ్యమైన ఆహారం అందించేందుకు 2018లో ముఖ్య మంత్రిగా ఉన్న నారా చంద్రబాబునాయుడు అన్న క్యాంటీన్‌లను ప్రారంభించారు. అయితే 2019 లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం అన్న క్యాంటీన్‌లను మూసివేయించింది. 2024లో తిరిగి సీఎంగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబునాయుడు అన్న క్యాంటీన్లను ప్రారంభించాలని నిర్ణయించారు. గత ఏడాది సెప్టెంబరు 19న జీవీఎంసీ పరిధిలో 25 అన్న క్యాంటీన్లను ప్రారంభించారు. ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, రాత్రి భోజనం రూ.5కు అందుబాటులో ఉంచారు. జీవీఎంసీ పరిధిలో తగరపువలస, భీమిలి, మారికవలస, వాంబే కాలనీ, విమ్స్ ఎదురుగా సంజీవగాంధీ నగర్, ఆరిలోవ, ఎంవీపీ రైతుబజార్, పెదవాల్తేరులోని ప్రభుత్వ ఛాతీ, శ్వాసకోశ వ్యాధుల ఆస్పత్రి ... మిగతా 6వ పేజీలో

జీవీఎంసీలో మొత్తం అన్న క్యాంటీన్లు	25
అల్పాహారం తీసుకున్నవారు	28,76,030 (సగటున రోజుకు 9,189)
మధ్యాహ్న భోజనం	29,22,631 (సగటున రోజుకు 9,337)
రాత్రి భోజనం	16,64,163 (సగటున రోజుకు 5,317)
మూడుపూటలా ఆహారం తీసుకున్నవారి సంఖ్య మొత్తం	74,62,824
రోజుకు సగటున	23,843

విశ్వనాథ్ స్పోర్ట్స్ క్లబ్‌కు పోర్టు నోటీసు

- స్విమ్మింగ్‌పూల్‌లో బాలుడి మృతి నేపథ్యంలో నిర్వహణలో నిబంధనలు పాటించాలని యాజమాన్యం ఆదేశం
- అందుకు విరుద్ధంగా వ్యవహరించడంతో ఒప్పందం ఎందుకు రద్దు చేయకూడదో తెలియజేయాలంటూ నోటీస్
- న్యాయస్థానాన్ని ఆశ్రయించిన క్లబ్ నిర్వాహకులు



విశాఖపట్నం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పోర్టు స్టేడియాన్ని లీజుకు తీసుకున్న విశ్వనాథ్ స్పోర్ట్స్ క్లబ్‌కు పోర్టు యాజమాన్యం నోటీస్ ఇచ్చినట్టు విశ్వసనీయంగా తెలిసింది. స్టేడియాన్ని స్పోర్ట్స్ కోసం ఉపయోగించుకుంటామని బి.కాశీవిశ్వనాథ్ దీర్ఘకాలిక లీజుకు తీసుకున్న సంగతి తెలిసిందే. అయితే ఐదు నెలల క్రితం స్విమ్మింగ్‌పూల్‌లో ఒక బాలుడు మునిగి చనిపోవడంతో పోర్టు యాజమాన్యం స్పందించింది. అక్కడ నిర్వహిస్తున్న క్రీడలకు ఎటువంటి నియమాలు పాటించాలో నివేదించాలని థర్డ్ పార్టీని కోరింది. దీనిపై ఆ కమిటీ నెల రోజులు అధ్యయనం చేసి నివేదిక సమర్పించింది. అవన్నీ అమలు చేయాలని లీజుదారుడిని యాజమాన్యం కోరింది. ఆ తరువాత వాటిని పరిశీలించింది. అయితే కొన్ని నిబంధనల ప్రకారం లేవని, ఒప్పందం ఎందుకు రద్దు చేయకూడదో సమాధానం ఇవ్వాలంటూ నోటీస్ జారీచేసింది. దీనిపై లీజుదారుడు కోర్టును ఆశ్రయించినట్టు సమాచారం. స్టేడియాన్ని దీర్ఘకాలిక లీజుకు ఇవ్వడం వల్ల తాను పెద్దమొత్తంలో పెట్టుబడి పెట్టి అనేక పర్యాటక ప్రాజెక్టులు చేపట్టానని, ఇప్పుడు ఒప్పందం రద్దు చేస్తే నష్టపోతానని పేర్కొన్నట్టు తెలిసింది. నిబంధనలన్నీ అమలు చేస్తామని, కొనసాగేందుకు ఆదేశాలు ఇవ్వాలని కోర్టును కోరినట్టు తెలిసింది. ఈ విషయాన్ని పోర్టు అధికారుల వద్ద ప్రస్తావించగా, నోటీసు ఇచ్చిన మాట వాస్తవమేనని ధ్రువీకరించారు.

ప్రైవేటు సేవలో క్లాప్ వాహనాలు

ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరణపై నిర్లక్ష్యం

- ఫంక్షన్లలో చెత్త సేకరణకు ప్రాధాన్యం
- నిర్వాహకులతో ఒప్పందం
- అదనపు ఆదాయం కోసం సిబ్బంది కక్కుర్తి
- నగరంలో పారిశుధ్యంపై ప్రభావం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

నగరంలో కొంతమంది క్లాప్ (క్లీన్ ఆంధ్రప్రదేశ్) వాహనాల సిబ్బంది తమకు కేటాయించిన వార్డులో వదిలేసి, డబ్బుల కోసం ప్రైవేటు ఫంక్షన్ల నుంచి చెత్తను యార్డుకు తరలించడానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇది పారిశుధ్య నిర్వహణపై ప్రభావం చూపుతోంది. ఇటీవల జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ గాజువాక ప్రాంతంలో పర్యటించినప్పుడు ఈ తరహా వ్యవహారం బయటపడడంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు.



క్లాప్ వాహనాలను పరిశీలిస్తున్న కమిషనర్ కేతన్‌గార్గ్

జీవీఎంసీ పరిధిలోని 574 వార్డు సచివాలయాల పరిధిలో ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరించేందుకు ఒక్కో క్లాప్ వాహనాన్ని నగర పాలక సంస్థ సమకూర్చింది. క్లాప్ వాహనం డ్రైవర్, లోడర్ కలిసి ఇంటింటికీ వెళ్లి తడి-పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలి. వాహనం ఫుల్ అయిన తర్వాత దానిని సమీపంలో ఎంఎస్‌ఎఫ్ (యార్డు)కు తరలించాలి. ఇలా వార్డు సచివాలయ పరిధిలోని అన్ని ఇళ్లను కవర్ చేసేలా ప్రతిరోజూ మూడు ట్రిప్పులు తిరగాల్సి ఉంటుంది. ఇలాచేయడం వల్ల రోడ్లపై చెత్త కనిపించకుండా నగరం పరిశుభ్రంగా ఉంటుందనేది అధికారుల భావన. అయితే కొంతమంది క్లాప్ వాహనాల సిబ్బంది ఎక్కడైనా ఫంక్షన్లు, ప్రైవేటు కార్యక్రమాలు జరిగితే అక్కడి చెత్తను బయటకు తరలించేందుకు ఒప్పందం కుదుర్చుకుంటున్నారు. ఈ క్రమంలో తమ సాధారణ విధులను పక్కనపెట్టేస్తున్నారు. క్లాప్ వాహనాల సిబ్బంది ఇలా చేయడం వల్ల ఆ సచివాలయ పరిధిలోని ఇళ్లలో చెత్త సేకరణ నిలిచిపోతోంది. దీంతో వారంతా చెత్తను రోడ్డుపైకి తెచ్చి పడేస్తున్నారు. దీనివల్ల రోడ్లతోపాటు గెడ్డలు చెత్తమయంగా తయారవుతున్నాయి.

ప్రైవేటు ఫంక్షన్‌లో చెత్తవాహనం చూసి అవాక్కయిన కమిషనర్

జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ క్షేత్రస్థాయి పర్యటనల్లో భాగంగా ఇటీవల గాజువాక వెళ్లారు. అధికారులతో కలిసి నడుచుకుంటూ వెళుతున్న కమిషనర్‌కు ఒక ప్రైవేటు ఫంక్షన్ జరిగినచోట క్లాప్ వాహనం కనిపించడంతో ఆగి పరిశీలించారు. ముందురోజు రాత్రి జరిగిన ఫంక్షన్‌లో పోగైన చెత్తను క్లాప్ వాహనం సిబ్బంది ఏరి వాహనంలో వేస్తున్నట్టు గుర్తించి ... మిగతా 6వ పేజీలో

టీటీడీ లోకల్ అడ్వయిజరీ కమిటీ అధ్యక్షునిగా పట్టాభి



చోడే వెంకట పట్టాభి

విశాఖపట్నం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ)కు లోకల్ అడ్వయిజరీ కమిటీ (విశాఖపట్నం) అధ్యక్షునిగా తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు చోడే వెంకట పట్టాభి నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం గురువారం అధికారికంగా ప్రకటన చేసింది. ఉత్తరాంధ్ర ప్రాంతంలో టీటీడీ దేవాలయాలు, కల్యాణ మండపాల్లో జరిగే కార్యకలాపాల పర్యవేక్షణ పట్టాభి చూడాల్సి ఉంటుంది. టీటీడీ బోర్డు సభ్యునికి ఉండే అధికారాలు, సదుపాయాలు లోకల్ అడ్వయిజరీ బోర్డు అధ్యక్షునికి ఉంటాయి. ఈ సందర్భంగా పట్టాభి 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధితో మాట్లాడుతూ వెంకటేశ్వరస్వామికి సేవ చేసుకునే భాగ్యం కలిగిందన్నారు. ఉత్తరాంధ్రలో టీటీడీ దేవాలయాలు, కల్యాణ మండపాలు అభివృద్ధి చేస్తానన్నారు. ప్రజల్లో భక్తిభావం పెంపొందించేలా టీటీడీ తరఫున కార్యక్రమాలు నిర్వహించేందుకు కృషిచేస్తానన్నారు. ఎంవీపీ కాలనీలో టీటీడీ కల్యాణ మండపాన్ని 2009లో అప్పటి పాలకులు ప్రైవేటుపరం చేయడానికి టెండర్లు ఆహ్వానిస్తే ధర్నా చేసిన విషయాన్ని ... మిగతా 6వ పేజీలో

లాటరీ ద్వారా 11 బార్‌లు కేటాయింపు

విశాఖపట్నం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 11 బార్‌ల కేటాయింపునకు గురువారం లాటరీ నిర్వహించారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జాయింట్ కలెక్టర్ మయూర్‌అశోక్ స్వయంగా లాటరీ తీసి ఎంపికైన వారికి బార్‌లను కేటాయించారు. జిల్లాలో 121 బార్‌లు ఉండగా గత నెల 30న నోటిఫికేషన్ ఇచ్చారు. అయితే 58 బార్లకు మాత్రమే నాలుగేసి దరఖాస్తులు రావడంతో వాటికి లాటరీ నిర్వహించి కేటాయింపులు పూర్తిచేశారు. మిగిలిన 63 బార్‌లకు రెండో దశలో నోటిఫికేషన్ జారీచేయగా 11 బార్లకు మాత్రమే నాలుగేసి దరఖాస్తులు వచ్చాయి. వాటిని గురువారం లాటరీ ద్వారా కేటాయించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ డీసీ రామచంద్రమూర్తి, సూపరింటెండెంట్ ఆర్‌ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



లాటరీ తీస్తున్న జాయింట్ కలెక్టర్ మయూర్‌అశోక్

స్టీల్ ప్లాంటుకు ఢిల్లీ అధికారులు

ప్లాంటు మొత్తం పరిశీలించిన మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ

- నేడు సెక్రటరీ రాక
- ఉద్యోగ వర్గాలతో భేటీ



విశాఖపట్నం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంటుకు ఢిల్లీ అధికారులు వచ్చారు. కేంద్రం ఆర్థిక సాయం చేసిన తరువాత ప్రతి మూడు లేదా ఆరు నెలలకు ఒకసారి వచ్చి సమీక్షిస్తామని స్టీల్ మంత్రిత్వ శాఖ అప్పుడే ప్రకటించింది. అందులో భాగంగా స్టీల్ జాయింట్ సెక్రటరీ సంజయ్ గురువారం ప్లాంటుకు వచ్చి స్టీల్ మెల్టింగ్‌షాప్, సింటర్ ప్లాంటు, బ్లాస్ట్ ఫర్నేస్, తదితర విభాగాలను పరిశీలించారు. సెక్రటరీ సందీప్ పౌండ్రిక్ శుక్రవారం ఉదయం విశాఖపట్నం వస్తున్నారు. వీరిద్దరూ కలిసి ప్లాంటు పనితీరును సమీక్షిస్తారు. అదే విధంగా అధికార, ఉద్యోగ వర్గాల నుంచి ఎంపిక చేసిన బృందాలతో ప్రత్యేక సమావేశం నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. తొలుత 25 మందితో ఒక బృందాన్ని భేటీకి ఆహ్వానించారు. ఆ తరువాత మరో 225 మందిని రెండో విడత సమావేశానికి ఆహ్వానించారు. ఎటువంటి సూచనలు చేస్తారోనని ఉద్యోగ వర్గాలు ఆసక్తిగా ఉన్నాయి. ముడి పదార్థాల కొరత, ఆర్‌ఎంహెచ్‌పీ నిర్వహణలో ఇబ్బందులను ఇక్కడి ఉద్యోగ వర్గాలు ఢిల్లీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లే అవకాశం ఉందని సమాచారం. తొలగించిన కాంట్రాక్టు కార్మికులలో నిర్వాసితులకు మళ్లీ ఉపాధి కల్పించాలని కోరనున్నట్టు తెలిసింది.

రబీ సీజన్‌లో రూ.340 కోట్ల రుణాలు

'ఆంధ్రజ్యోతి'తో డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జి కోన తాతారావు

- ఖరీఫ్‌లో ఇప్పటివరకూ రూ.272 కోట్లు
- క్రాప్ లోన్ ఒక్కొక్కరికీ రూ.3 లక్షలు, 4 శాతం వడ్డీ
- సకాలంలో రుణం చెల్లిస్తే వడ్డీ మాఫీ
- సొంత అవసరాలకు రూ.ఆరు లక్షల వరకూ రుణం
- ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.3 వేల కోట్ల వ్యాపార లక్ష్యం
- స్వయంశక్తి సంఘాలకు కూడా రుణాలు



కోన తాతారావు

విశాఖపట్నం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి):

వచ్చే నెల నుంచి ప్రారంభం కానున్న రబీ సీజన్‌లో రైతులకు రూ.340 కోట్లు పంట రుణాలుగా ఇచ్చేందుకు నిర్ణయించినట్టు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జి కోన తాతారావు తెలిపారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటివరకూ రూ.272 కోట్లు అందజేశామన్నారు. ఆయన గురువారం తన ఛాంబర్‌లో 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధితో మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలో గల 98 సొసైటీల పరిధిలో 4.56 లక్షల మంది రైతులు ఉన్నారని, పంట రుణం కింద ఒక రైతుకు రూ.మూడు లక్షల వరకూ మంజూరుచేస్తామన్నారు.

రుణాల మంజూరుకు గత ప్రభుత్వంలో ఉన్న షరతులు ప్రస్తుతం సడలించినట్టు తాతారావు తెలిపారు. రైతులు ఏ పంట సాగు చేసినా రుణాలు మంజూరుచేస్తున్నామన్నారు. ఏజెన్సీలో పసుపు, కాఫీ, చింత, ఇతర ఉద్యానవన పంటలకు రుణాలు ఇస్తున్నామని ... మిగతా 6వ పేజీలో

దస్తావేజు లేఖరుల పెన్ డౌన్

ఆనందపురం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రిజిస్ట్రేషన్ శాఖలో నూతనంగా ప్రవేశపెట్టిన కొన్ని విధానాలను వ్యతిరేకిస్తూ మండల దస్తావేజు లేఖరులు రెండు రోజుల పెన్ డౌన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు మండల దస్తావేజుల సంఘ సభ్యులు తెలిపారు. ఆధార్ ఓటీపీ, స్థానిక సంస్థల డేటా బేస్ ఆధారంగా ఇంటి ఆస్తుల రిజిస్ట్రేషన్లు, రిజిస్ట్రేషన్ శాఖకు సంబంధించిన కార్డు ప్రైమ్ సాఫ్ట్‌వేర్‌లోని సాంకేతిక లోపాల వల్ల దస్తావేజు తయారీ అనేది జటిలమవుతూ తీవ్ర జాప్యానికి గురవుతున్నందున అటు ప్రజలు, ఇటు దస్తావేజు లేఖరులు చాలాఇబ్బందులు పడుతున్నారన్నారు. పై విధానాల్లో మార్పు కోరుతూ ప్రభుత్వానికి నివేదిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా 19, 20 తేదీల్లో పెన్‌డౌన్ చేసి నిరసన తెలియజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రతీ ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలు

భీమునిపట్నం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కృష్ణా కాలనీలో గల 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో నిర్వహణ పనులు చేపడుతున్న నేపథ్యంలో ఈ నెల 20 న కొన్ని ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్టు విశాఖ జిల్లా ఈపీడీసీఎల్ ఆపరేషన్స్ జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ తెలిపారు. శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటలవరకూ భీమిలి, నేరెళ్లవలస, జేవీ అగ్రహారం, కొత్తవలస, నిడిగట్టు, కుమ్మరిపాలెం, స్మిత్ వీధి, అప్పికొండ వీధి, బ్యాంక్ కోలనీ, మూలకుద్దు, మామిడిపాలెం, రేఖవానిపాలెం, రాయపాలెం, మహాలక్ష్మీపురం, పాలిటెక్నిక్ కాలేజి పరిసర ప్రాంతాలకు కరెంటు సరఫరా ఉండదని భీమిలి సబ్‌స్టేషన్ ఏఈఈ యరకయ్య తెలిపారు. వినియోగదారులు గమనించాలని కోరారు.

చైతన్య యువజన సేవా సంఘం అధ్యక్షుడు అప్పలనాయుడు మృతి



ఆనందపురం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆనందపురం గ్రామానికి చెందిన సమాజ సేవకుడు, చైతన్య యువజన సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు మీసాల అప్పలనాయుడు (56) గురువారం మధ్యాహ్నం గుండెపోటుతో మరణించారు. ఉదయం అస్వస్థతకు గురవడంతో ఆయనను కుటుంబ సభ్యులు తగరపువలసలోని ఒక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఈ క్రమంలో ఆయన చికిత్స పొందుతూ మృతి చెందారు. గతంలో అప్పలనాయుడు సీఐటీయూ, సీపీఎంలో కీలక పాత్ర పోషించారు. అతడికి భార్య శ్రీదేవితో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. పలువురు అప్పలనాయుడి భౌతిక కాయాన్ని సందర్శించి సంతాపం తెలియజేసి నివాళులు అర్పించారు.

రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలివే

సింహాచలం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): అత్యవసర నిర్వహణ పనుల నిమిత్తం ఈ నెల 20న పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ జోన్-3 కార్యనిర్వాహక ఇంజినీర్ బి.సింహాచలం నాయుడు తెలిపారు. శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ధారపాలెం, పాతగోశాల, వెంకటాపురం 11 కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందన్నారు. కుమ్మరివీధి, పాతఅడివివరం కూడలి, ధారపాలెం, ప్రహ్లాదపురం, శ్రీనివాసనగర్, బాలాజీనగర్, వెంకటాపురం, ఆర్ఆర్ వెంకటాపురం, ఎస్సీ, బీసీ కాలనీ, అజంతా పార్కు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

జోడుగుళ్లపాలెంలో జోన్-2 జెడ్సీ పర్యటన

విశాలాక్షినగర్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 9వ వార్డు పరిధిలోని జోడుగుళ్లపాలెంలో గురువారం జోన్-2 కమిషనరు కనకమహాలక్ష్మి పర్యటించారు. గ్రామంలో పారిశుధ్య నిర్వహణతో సిబ్బంది ఇంటింటా చెత్త సేకరిస్తున్న తీరును పరిశీలించారు. మంచినీటి క్లోరినేషన్ పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిన్నాజీరావు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

వైభవంగా సిరి సంపెంగల అర్చన

సింహాచలం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): సింహాచల నారసింహునికి సిరి సంపెంగలతో వైభవంగా అర్చనలు జరిపారు. ఆర్జిత సేవల్లో భాగంగా గురువారం వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని, ఉభయ దేవేరులను సకలాభరణాలతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. ఆలయ పద్మనిధి నుంచి సిరి సంపెంగలను తీసి బేడామండప ప్రదక్షిణ చేశారు. షోడశోపచారాలు సమర్పించిన అనంతరం నారసింహ అష్టోత్తర శతనామావళి పఠిస్తూ సిరి సంపెంగలతో అర్చన జరిపారు. స్వామికి మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు. అనంతరం అదే వేదికపై ఆర్జిత నిత్యకల్యాణం పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో ఘనంగా నిర్వహించారు.

200 మందికి వైద్యపరీక్షలు

సాగర్‌నగర్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): సాగర్‌నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వస్థ నారీ సశక్త పరివార్ అభియాన్‌లో భాగంగా గురువారం ప్రత్యేక వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యురాలు పూజ 200 మందిని పరీక్షించి మందులు అందజేశారు. గర్భిణులకు, మహిళలకు రక్తహీనత పరీక్ష, టీబీ స్క్రీనింగ్ టెస్టులు నిర్వహించారు.

దుకాణాల తొలగింపు

- వై జంక్షన్ నుంచి సర్వీసు రోడ్డులో బంగ్లామెట్ట వరకూ ఖాళీ చేయించిన అధికారులు
- ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చర్యలు



ఫుట్‌పాత్‌లపై ఉన్న తోపుడుబండ్లను తొలగించమని ఆదేశిస్తున్న జడ్సీ అయ్యప్పనాయుడు. ఏసీపీ రామకృష్ణ



లారీపై తరలిస్తున్న దృశ్యం

తగరపువలస, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : తగరపువలసలో ప్రజా సౌకర్యానికి అవరోధంగా, ట్రాఫిక్‌కు ఇబ్బందిగా ఉన్న చిరు వ్యాపారుల దుకాణాలను జీవీఎంసీ అధికారులు తొలగించారు. గురువారం భీమిలి జోనల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు, అసిస్టెంట్ సిటీ ప్లానర్ యు.రామకృష్ణల ఆధ్వర్యంలో వై జంక్షన్ పై ఓవర్ బ్రిడ్జి నుంచి సర్వీసు రోడ్డులో బంగ్లామెట్ట వరకూ రహదారి ఒడ్డున వెలసిన చిరువ్యాపారుల దుకాణాలను అధికారులు తొలగింపునకు చర్యలు తీసుకున్నారు. తాత్కాలిక తోపుడు బండ్లు, ఉడెన్ బడ్డీలను లాండ్ ఆర్డర్, ట్రాఫిక్ పోలీసుల బందోబస్తు మధ్య అధికారులు వేరే ప్రాంతానికి తరలించారు. అసలే సర్వీసు రోడ్డులో వాహనరాకపోకలతో ఇరుకిరుకుగా ఉంటుందని, దీనికి తోడు ఈ బడ్డీలు, తోపుడు బండ్లు రహదారికి సగం వరకూ ఆక్రమించడంతో ట్రాఫిక్ సమస్య జటిలంగా మారుతోందని అధికారులు ఆగ్రహించారు. ప్రతి నిత్యం ట్రాఫిక్ స్తంభించడం, క్లియర్ చేయడానికి ఎక్కువ సమయం పడుతుండడంతో తప్పని పరిస్థితుల్లో ఆక్రమిత దుకాణాలన్నింటిని అధికారులు తొలగించారు. అకస్మికంగా జరిగిన ఈ చర్యతో చిరువ్యాపారులు ఆందోళన చెందారు. పలువురు దుకాణదారులు తమ బడ్డీలను ఎక్సకవేటర్‌తో తొలగించవద్దని, పాడైపోతాయని వారే భద్రంగా వేరే ప్రాంతానికి తరలించుకుపోయారు. యజమానులు లేని బడ్డీలను ఎక్సకవేటర్‌తో జీవీఎంసీ ట్రాక్టర్‌పై ఎక్కించి వేరే ప్రాంతానికి తరలించారు. ఫుట్‌పాత్‌లపైనా, సర్వీసు రోడ్డలోనూ ఉడెన్ బడ్డీలు, తోపుడు బండ్లు పెట్టి ప్రజల రాకపోకలకు అడ్డంకిగా ఉండడం, ట్రాపిక్‌కు అవరోధం కల్పిస్తే సహించేది లేదని జడ్సీ అయ్యప్పనాయుడు స్పష్టం చేశారు. కార్యక్రమంలో సచివాలయాల సిబ్బంది, ప్రజారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్య సంరక్షణపై శ్రద్ధ వహించాలి

- ఎంపీపీ శారదాప్రియాంక



శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ శారదా ప్రియాంక

ఆనందపురం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మహిళలు ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంపీపీ మజ్జి శారదాప్రియాంక పేర్కొన్నారు. గురువారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వస్థ నారీ-సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని ప్రారంభించిన అనంతరం ఆమె మాట్లాడుతూ స్త్రీలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థికంగా వెనుకబడిన వారికి ఇలాంటి శిబిరాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఎంపీడీవో డాక్టర్ జానకి మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లో అక్టోబరు 2వ తేదీ వరకు వైద్య శిబిరాలు నిర్వహిస్తారని, వీటిని వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కోరాడ రాజబాబు, సర్పంచ్ లొడగల రాజేశ్వరి రమణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అనంతపద్మనాభుడి ఆలయ హుండీ ఆదాయం రూ.2.44 లక్షలు



పద్మనాభం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : పద్మనాభంలోని అనంతపద్మనాభుడి దేవస్థానంలో గురువారం హుండీ ఆదాయం లెక్కించారు. 2024, డిసెంబరు 2 నుంచి సెప్టెంబరు 18 వరకు హుండీలో భక్తులు వేసిన కానుకలను లెక్కించగా రూ.2.44 లక్షల ఆదాయం వచ్చినట్టు ఆలయ ఈవో ఎస్.నానాజీబాబు వెల్లడించారు. అనంతపద్మనాభస్వామి కొండపై ఉన్న ఆలయంతో పాటు కుంతీమాధవస్వామి ఆలయం హుండీలనూ లెక్కించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కె.రమణ, సీనియర్ నాయకులు ఎర్నాయుడు, పైల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బీచ్ క్లీన్ చేసిన సెడార్ స్కూలు విద్యార్థులు

భీమునిపట్నం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : భీమిలి బీచ్, కొబ్బరితోట పార్కులలో గొల్లలపాలెం సెడార్ స్కూల్ ఐసీఎస్ఈ విద్యార్థులు గురువారం చెత్తాచెదారాలు, ప్లాస్టిక్ వ్యర్థాలను ఏరివేసి శుభ్రపరిచారు.ఈ కార్యక్రమాన్ని ఉదయం జీవీఎంసీ భీమిలి జోనల్ జడ్సీ అయ్యప్పనాయుడు ప్రారంభించారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో కూడా విద్యార్థులు భాగస్వాములు కావాలని ఆయన కోరారు. కాగా, సోషియలీ యూజ్‌ఫుల్ ప్రొడక్టివ్ వర్క్ ఎస్‌యూపీడబ్ల్యూలో భాగంగా విద్యార్థులు బీచ్‌ను పరిశుభ్రపరిచారు. తొలుత ఆ పాఠశాల ప్రిన్సిపాల్ స్వర్ణకుమారి ఆధ్వర్యంలోబీచ్ రోడ్‌లో క్లీన్ సిటీ, నో ప్లాస్టిక్ ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలనే దృక్పథం అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, టీచర్లు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ

ఆనందపురం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గొట్టిపల్లిలో పోస్టల్ డిపార్ట్‌మెంట్ నార్త్ సబ్ డివిజన్ అధికారి జగదీశ్వరరావు ఆధ్వర్యంలో గొట్టిపల్లి బ్రాంచి కార్యాలయం సౌజన్యంతో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నుక్కడ్ నాటక్ అనే కార్యక్రమాన్ని నిర్వహించి గ్రామ ప్రజలు, జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, పోస్టల్ సిబ్బంది గ్రామంలో ర్యాలీ నిర్వహించి పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ చేపట్టారు.

ఈ సందర్భంగా సబ్ డివిజన్ అధికారి జగదీశ్వరరావు గ్రామస్థులు, విద్యార్థులకు పోస్టల్ ద్వారా అందిస్తున్న సేవలను వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ కోరాడ వెంకట నరసింహనాయుడు, ఇన్‌చార్జ్ హెచ్ఎం వి.శ్రీనివాసరావు, శ్రీసత్యసాయి ఆదర్శ గ్రామం కో-ఆర్డినేటర్ డబ్బీరు విజయకుమార్, బీపీఎం ఎం.నూర్జహాన్, పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

దుకాణాల తొలగింపుతో ఉద్రిక్తత



మిథిలాపురి కాలనీలో ఆక్రమణలు తొలగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది



జీవీఎంసీ సిబ్బంది తీరుకు నిరసనగా రోడ్డుపై బైఠాయించిన దుకాణదారులు



వుడాకాలనీలో రోడ్డుకిరువైపులా దుకాణాలు తొలగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

మధురవాడ, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 7వ వార్డు పరిధిలోని మిథిలాపురి వుడాకాలనీ వంద అడుగుల రహదారిలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న దుకాణాలను జీవీఎంసీ అధికారులు గురువారం తొలగించడం కలకలం రేపింది. సుమారు రెండుకిలోమీటర్లు పొడవునా కొందరు దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. తోపుడు బండ్ల వ్యాపారులు వివిధ వస్తువులు విక్రయిస్తూ జీవిస్తున్నారు. ఈ దుకాణాల వల్ల తరచూ ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయని గుర్తించిన జీవీఎంసీ అధికారులు, సిబ్బంది వుడాకాలనీకి చేరుకొని దుకాణాల తొలగింపునకు శ్రీకారం చుట్టడంతో కొందరు అడ్డుకున్నారు. దుకాణాల యజమానులు, జీవీఎంసీ అధికారులతో వాగ్వాదానికి దిగారు. అకస్మాత్తుగా దుకాణాలు తొలగిస్తే కుటుంబాలతో వీధినపడతామని వేడుకున్నారు. అయినా తొలగింపు పనులు నిలిపివేయకపోవడంతో సీఐటీయూ ఆధ్వర్యంలో రోడ్డుపై బైఠాయించారు. ట్రాఫిక్ నిలిచిపోవడంతో పీఎంపాలెం పోలీసులు ఇరువర్గాలకు నచ్చచెప్పడంతో కొంతసేపటికి గొడవ సద్దుమణిగింది. వుడాకాలనీలో హాకర్స్ జోన్ ఏర్పాటు చేస్తే వ్యాపారులంతా అక్కడికి వెళతారని, అలా చేయకుండా దుకాణాలు తొలగించడం అన్యాయమని సీఐటీయూ నాయకుడు రాజకుమార్ పేర్కొన్నారు. అధికారుల నిర్వాకంతో సామాన్లు దెబ్బతిన్న చిరువ్యాపారులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. దుకాణాల తొలగింపు అన్యాయమని బీజేపీ నాయకులు ఖండించారు. మాట మాత్రం చెప్పకుండా బడ్డీలు ధ్వంసం చేసి, విద్యుత్ కనెక్షన్‌లు తొలగించారని బీజేపీ నాయకులు ప్రదీప్, సుబ్బరాజు తదితరులు ఆరోపించారు. శుక్రవారం జీవీఎంసీ కమిషనర్‌ను కలుస్తామన్నారు. రాత్రి వరకు బడ్డీల తొలగింపు కొనసాగడంతో పీఎం పాలెం పోలీసులు పికెట్ ఏర్పాటు చేశారు. బాధితులు కొందరు పొక్లయినర్ పైకెక్కి నిరసన వ్యక్తం చేయడంతో పోలీసులు వారించి కిందకు దింపారు. గతంలో చాలాసార్లు దుకాణదారులందరికీ స్వచ్ఛందంగా తొలగించాలని తెలిపినా పట్టించుకోకపోవడంతో తామే తొలగించవలసి వచ్చిందని జోన్-2 జడ్సీ కనకమహలక్ష్మీ తెలిపారు.

ఎండాడ డబుల్ రోడ్డులో..

ఎండాడ, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 8వ వార్డు పరిధిలోని ఎండాడ-రుషికొండ డబుల్ రోడ్డులో దుకాణదారులు రహదారులపైకి వస్తుండటంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్న నేపథ్యంలో జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ సిబ్బంది రహదారులపైకి వచ్చి వ్యాపారాలు చేస్తున్న వారిని గుర్తించి దుకాణాల వద్ద ఉన్న పరదాలను, షెడ్డులను గురువారం తొలగించారు. జీవీఎంసీ కమిషనరు ఆదేశాలకు అనుగుణంగా, క్లీన్ సిటీలో భాగంగా దుకాణాలను తొలగిస్తున్నట్లు టౌన్ ప్లానింగ్ అధికారులు పేర్కొన్నారు.

ఏటీఎల్‌తో విద్యార్థుల్లో సృజనాత్మకత బయటపడుతుంది



విద్యార్థులతో మాట్లాడుతున్న సుదర్శన్

సింహాచలం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): అటల్ టింకరింగ్ లాబ్ ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత బయటపడుతుందని యూనిసెఫ్ కన్సల్టెంట్ సుదర్శన్ అన్నారు. ఏటీఎల్ ద్వారా జరుగుతున్న ఆవిష్కరణలు పరిశీలించేందుకు గురువారం సింహాచలంలోని మహాత్మా జ్యోతి బాపూలే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాలను ఆయన సందర్శించారు.

ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన కొన్ని నమూనాలను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్‌లో విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు ఈ లాబ్‌లు దోహదపడతాయన్నారు.

గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రమామోహిని, వైస్‌ప్రిన్సిపాల్ భానుమతి తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్‌ల ప్రతిభ



జాతీయ స్థాయిలో ప్రతిభ చాటిన గీతం ఎన్‌సీసీ కేడెట్లు

సాగర్‌నగర్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఎన్‌సీసీ క్యాడెట్‌లు జాతీయ స్థాయిలో భారత నౌకాదళం నిర్వహించిన పలు పోటీలలో ప్రతిభ చాటారు. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ ఈసీఈ తృతీయ సంవత్సరం విద్యార్థి చెల్లాశివశంకర్, జాతీయ స్థాయిలో లోనావాలాలో ఇటీవల జరిగిన నౌ సైనిక్ శిబిరంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎన్‌సీసీ డైరక్టరేట్‌లకు ప్రాతినిధ్యం వహించారు. 17 డైరక్టరేట్‌ల నుంచి హాజరైన కేడెట్‌లతో పోటీ పడి బోట్ పుల్లింగ్, సీమాఫోర్, డ్రిల్, సర్వీస్ విభాగాలలో విజేతగా నిలిచి ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలకు గర్వకారణంగా నిలిచాడు. ఒడిశాలోని భారత నౌకాదళ స్థావరం ఐఎన్ఎస్ చిల్కా లక్ష జరిగిన అఖిల భారత యాటింగ్ రెగెట్టా పోటీలలోనూ గీతం కేడెట్‌లు ప్రతిభ చాటారు. స్కూల్ ఆఫ్ సైన్స్ బీసీఏ తృతీయ సంవత్సరం విద్యార్థిని విశాఖ సింగ్ ప్రథమ స్థానాన్ని, సీఎస్ఈ తృతీయ సంవత్సరం విద్యార్థి ఆడబాల దీపక్ తృతీయ స్థానం సాధించారు. ఇటీవలే గీతం ఎన్‌సీసీ విద్యార్థి వినీల్ దీక్షిత్ ప్రతిభను గుర్తిస్తూ సర్వీసెస్ సెలక్షన్ బోర్డు (ఎస్ఎస్‌బీ) ఈ ఏడాది ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ కింద ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమిలో శిక్షణకు ఎంపిక చేసింది. శిక్షణ అనంతరం భారత రక్షణ దళాలలో ఆఫీసర్ కేడర్‌లో పనిచేసే అవకాశం వినీల్ దీక్షత్‌కు దక్కనుంది. విద్యార్థుల ప్రతిభను గీతం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఎరోల్ డిసౌజా, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్, గీతం ఎన్‌సీసీ అధికారులు అభినందించారు.

టీటీడీ లోకల్ అడ్వయిజరీ కమిటీ అధ్యక్షునిగా పట్టాభి

... 5వ పేజీ తరువాయి

గుర్తుచేశారు. అలాగే కైలాసగిరిపై వెంటేశ్వర స్వామి దేవాలయం నిర్మించాలని సీఎం చంద్రబాబునాయుడును అప్పట్లో కోరగా, రుషికొండలో దేవాలయం నిర్మాణానికిభూమి కేటాయించారన్నారు. తనకు లోకల్ అడ్వైజరీ విశాఖపట్నం అధ్యక్షునిగా నియమించిన సీఎంకు పట్టాభి ధన్యవాదాలు తెలిపారు. కగా, ఆయన గతంలో జీవీఎంసీ కార్పొరేటర్‌గా, టీడీపీజిల్లా ప్రధాన కార్యదర్శిగా సేవలు అందించారు.

రబీ సీజన్‌లో రూ.340 కోట్ల రుణాలు

... 5వ పేజీ తరువాయి

వివరించారు. పాయకరావుపేట ప్రాంతంలో తమలపాకు సాగుచేసే రైతులకు ఎకరాకు రూ.లక్ష రుణం అందజేస్తున్నామని వెల్లడించారు. కేవలం నాలుగు శాతం వడ్డీతో ఇచ్చే పంట రుణాలను సకాలంలో చెల్లిస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మొత్తం వడ్డీ మాఫీ చేస్తున్నాయని పేర్కొన్నారు. రైతులకు వ్యవసాయం, సొంత అవసరాల కోసం ఇచ్చే స్వల్పకాలిక రుణాల పరిమితి రూ.ఐదు లక్షల నుంచి రూ.ఆరు లక్షలకు పెంచామన్నారు. దీనిని రూ.10 లక్షలకు పెంచాలని ప్రతిపాదించామని తాతారావు చెప్పారు.

బ్యాంకు వ్యాపార అభివృద్ధిలో భాగంగా బంగారంపై ఇచ్చే రుణాలకు ఆదరణ లభిస్తున్నదన్నారు. తొమ్మిది శాతం వడ్డీకి గ్రాము బంగారంపై రూ.6,500 రుణం మంజూరుచేస్తున్నామన్నారు. బ్యాంకు బ్రాంచిలతోపాటు దాదాపు పది సొసైటీలు బంగారంపై రుణాలు మంజూరుచేస్తున్నాయన్నారు. సొసైటీల్లో మౌలిక వసతుల కల్పనకు రూ.కోటి మంజూరుచేశామని తాతారావు తెలిపారు. జిల్లాలో సొసైటీలకు సొంత భవనాలు లేని గ్రామాల్లో రైతుసేవా కేంద్రాలు కేటాయించాలని కలెక్టర్లను కోరామన్నారు. రైతు సేవా కేంద్రాలు లేనిచోట సొంత భవనాలు నిర్మించేందుకు డీసీసీబీ సాయం చేస్తుందన్నారు.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.మూడు వేల కోట్ల వ్యాపార లక్ష్యం కాగా ఇంతవరకూ రూ.2,700 కోట్లు చేశామన్నారు. స్వయంశక్తి సంఘాలకు రుణాలు ఇవ్వడానికి బ్యాంకు సిద్ధంగా ఉందన్నారు. వాణిజ్య బ్యాంకుల కంటే తక్కువకు అంటే ఏడు శాతం వడ్డీకి డీసీసీబీ రుణాలు అందజేస్తోందన్నారు. ఇంకా రుణానికి సంబంధించి ప్రాసెసింగ్ ఫీజు రూ.4,000 చెల్లించనవసరం లేదన్నారు. అలాగే ఇళ్ల రుణాల పరిమితి పెంచామని, నిర్మాణ వ్యాపారాలకు రుణాలు ఇస్తామన్నారు. రైతులకు ప్రమాద బీమా మొత్తాన్ని పెంచాలనే ప్రతిపాదన బ్యాంకు పరిశీలిస్తోందన్నారు. ప్రస్తుతం ప్రమాదవశాత్తూ రైతు మరణిస్తే రూ.రెండు లక్షలు, సహజ మరణానికి 58 ఏళ్ల కంటే తక్కువ ఉంటే రూ.30 వేలు, పైబడితే రూ.15 వేలు సాయం ఇస్తున్నామన్నారు. అయితే ఏళ్ల తరబడి సొసైటీతో కలిసి ప్రయాణించే రైతు మరణిస్తే తగిన సాయం అందించాలన్న యోచనతో రైతు, సొసైటీ, బ్యాంకు, ఆప్కాబ్ కలిసి ప్రీమియం చెల్లించేలా ఒక ప్రతిపాదన రూపొందించామని తాతారావు చెప్పారు.

ప్రైవేటు సేవలో క్లాప్ వాహనాలు

... 5వ పేజీ తరువాయి

అక్కడకు వెళ్లారు. సిబ్బందిని పిలిచి ఏ వార్డు సచివాలయ పరిధిలో తిరిగే వాహనమని ప్రశ్నించారు. ఇళ్లకు వెళ్లి చెత్త సేకరించడం మానేసి, ప్రైవేటు ఫంక్షన్‌లో చెత్తను తరలించాల్సిన అవసరం ఏమొచ్చిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. క్లాప్ వాహనాల సిబ్బంది కొందరు ఇలా చేస్తున్నారని ఆయన వెంట ఉన్న అధికారి ఒకరు చెప్పడంతో ఇకపై పర్యవేక్షించే బాధ్యతను వార్డు శానిటేషన్ కార్యదర్శులకు అప్పగించాలని అధికారులను ఆదేశించారు.

శానిటేషన్ సెక్రటరీలకు వాహనాల పర్యవేక్షణ బాధ్యత
- జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్

కొందరు క్లాప్ వాహనాల సిబ్బంది సరిగా విధులు నిర్వర్తించకపోవడంతో పర్యవేక్షణ బాధ్యతను వార్డు శానిటేషన్ కార్యదర్శులకు అప్పగించాం. ప్రతీరోజూ ఉదయం ఆరు గంటలకు వార్డు సచివాలయానికి వెళ్లి కార్యదర్శులు హాజరువేసుకోవాలి. తర్వాత ఏదో ఒక వాహనం వెంట వెళ్లి ఇంటింటికీ చెత్త సేకరణ ఎలా జరుగుతుందనేని స్వయంగా పరిశీలించాలి. దీనికి సంబంధించిన ఫొటోలను కూడా అధికారుల గ్రూపులో అప్‌లోడ్ చేయాలని ఆదేశించాం. దీనివల్ల నగరంలో క్లాప్ వాహనాలు పక్కాగా చెత్త సేకరణ జరుపుతాయి. తద్వారా నగరంలో పారిశుధ్యం మెరుగుపడుతుంది.

ఆక్రమణలకు అడ్డుకట్ట

... 5వ పేజీ తరువాయి

జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ క్షేత్రస్థాయి పర్యటనలకు వెళ్లినప్పుడు గమనించారు. నగరంలో ఎక్కడికక్కడ వెండింగ్ జోన్స్ ఏర్పాటుచేసి, వ్యాపారులను అక్కడకు తరలించడం వల్ల సమస్యను పరిష్కరించవచ్చునని గుర్తించారు. నగరంలో రోడ్లు, ఫుట్‌పాత్‌లు ఆక్రమించి వ్యాపారాలు చేసుకుంటున్న వారిని గుర్తించే బాధ్యతను టౌన్‌ప్లానింగ్ విభాగంలో పనిచేసే వార్డు ప్లానింగ్ సెక్రటరీలకు అప్పగించారు. సర్వే దాదాపు చివరి దశకు చేరుకున్నట్టు సమాచారం. ఆక్రమణలను తొలగించినా వారి జీవనోపాధికి ఇబ్బంది లేకుండా ఉండేందుకు వెండింగ్‌జోన్‌లు ఏర్పాటుకు అనువైన స్థలాలను గుర్తించే పనిలో జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు ఉన్నారు. ప్రస్తుతానికి 98 వార్డుల పరిధిలో 112 చోట్ల వెండింగ్ జోన్‌ల ఏర్పాటుకు స్థలాలను గుర్తించారు. ఆయా చోట్లకు ఆక్రమణదారులను తరలిస్తే రోడ్లన్నీ విశాలంగా మారి వాహనాల రాకపోకలు సజావుగా సాగడంతోపాటు ప్రమాదాలకు అడ్డుకట్టపడుతుందన్నది కమిషనర్ భావన. దీనికోసం పోలీస్ అధికారులతో పలుమార్లు సమావేశమై ఆక్రమణల తొలగింపునకు సహకరించాలనికోరడంతో సీపీ శంఖబ్రతబాగ్చి అంగీకరించారు.

ఆక్రమణల తొలగింపునకు శ్రీకారం

నగరంలో రోడ్లు, ఫుట్‌పాత్‌ల ఆక్రమణలపై జీవీఎంసీ అధికారులు 'ఆపరేషన్ లంగ్స్' పేరుతో గురువారం స్పెషల్‌డ్రైవ్ నిర్వహించారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)తో పాటు ప్రతి శుక్రవారం నిర్వహించే టౌన్‌ప్లానింగ్ గ్రీవెన్స్ కార్యక్రమానికి రోడ్లు, ఫుట్‌పాత్‌లు, పార్కుల ఆక్రమణలకు సంబంధించిన ఫిర్యాదులు అధికంగా వస్తుండడంతో వాటిపై చర్యలకు కమిషనర్ కేతన్‌గార్గ్ టౌన్‌ప్లానింగ్ అధికారులకు ఆదేశాలు జారీచేశారు. ఇకపై నిరంతరం ఆక్రమణల తొలగింపు కొనసాగేలా కార్యాచరణ రూపొందించి గురువారం నుంచి అమలు చేయాలని ఆదేశించారు. అందులో భాగంగా పోలీసుల సహకారంతో జీవీఎంసీ పరిధిలోని ఎనిమిది జోన్లలో రోడ్లు, ఫుట్‌పాత్‌లు, పార్కుల్లో 524 ఆక్రమణలను తొలగించారు. తగరపువలస మెయిన్‌రోడ్డులో 20, తగరపువలస-భీమిలి రోడ్డులో 20, మధురవాడ వుడా మిథిలాపురి కాలనీలో 52, గురుద్వారా జంక్షన్‌లో 42, డైమండ్ పార్కు నుంచి శాంతిపురం జంక్షన్‌కు వెళ్లే రహదారిలో 42, సిరిపురం జంక్షన్ నుంచి జగదాంబ జంక్షన్‌కు వెళ్లే మార్గంలో 60, నరసింహనగర్ జంక్షన్ నుంచి డీఎల్‌బీ గ్రౌండ్ వరకు 46, పాతగాజువాక మెయిన్‌రోడ్డులో 53, ఎన్ఏడీ కొత్తరోడ్డు నుంచి గోపాలపట్నం పెట్రోల్‌బంకు వరకు 45, విమాన్‌నగర్ జంక్షన్‌లో 22, అనకాపల్లి నెహ్రూచౌక్ వద్ద 42, వంటిల్లు జంక్షన్‌లో 33 ఆక్రమణలను తొలగించారు.

పేదల ఆకలి తీరుస్తున్న అన్న క్యాంటీన్లు

... 5వ పేజీ తరువాయి

ప్రాంతీయ కంటి ఆస్పత్రి, టర్నర్‌చౌల్ట్రీ, కేజీహెచ్ ఓపీ గేటు పక్కన, వన్‌టౌన్‌లోని జనతాబజార్, తాటిచెట్లపాలెం వైఎస్ఆర్ నగర్, మద్రిపాలెం, నక్కవానిపాలెం ఆర్టీసీ డిపో, శ్రీహరిపురం కోరమాండల్ గేట్, ఆటోనగర్, గాజువాక వంటిల్లు జంక్షన్, నమ్మిదొడ్డి, అనకాపల్లి ఎన్‌టీఆర్ ఆస్పత్రి, భీమునిగుమ్మం రైల్వేస్టేషన్, బాజీ జంక్షన్, పెందుర్తి, వేపగుంట, గోపాలపట్నం రైతుబజార్ పాంతాల్లో అన్న క్యాంటీన్లను ప్రారంభించారు. క్యాంటీన్‌లకు ఆహారం తయారు చేయడంతోపాటు సరఫరాచేసే బాధ్యతను అక్షయప్రాతకు అప్పగించింది. కంచరపాలెంలోని హరేకృష్ణ మూవ్‌మెంట్ ఛారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అక్షయపాత్ర సెంట్రల్ కిచెన్‌లో వంటకాలను తయారుచేసి వాహనాల్లో అన్న క్యాంటీన్లకు సరఫరా చేస్తున్నారు. మంచి రుచి, నాణ్యత కలిగి వుండడంతో నిరుపేదలు, కూలీలే కాకుండా ఆటోడ్రైవర్లు, చిరువ్యాపారులు కూడా భోజనం కోసం వీటినే ఆశ్రయిస్తున్నారు. దీంతో క్యాంటీన్లకు రోజురోజుకీ ఆదరణ పెరుగుతోంది.

అల్పాహారం కింద ప్రతిరోజూ మూడు ఇడ్లీలు, 150 మిల్లీలీటర్ల సాంబార్, 150 గ్రాములు చట్నీ ఇస్తున్నారు. ప్రత్యామ్నాయంగా సోమవారం, గురువారాల్లో మూడు పూరీ, వంద గ్రాముల కర్రీ, మంగళ, శుక్రవారాల్లో 250 గ్రాముల ఉప్మా, మిక్చర్, సాంబార్, బుధ, శనివారాల్లో హాట్ పొంగల్, సాంబార్, మిక్చర్‌ను అందుబాటులో ఉంచుతున్నారు. మధ్యాహ్నం, రాత్రిపూట భోజనం కింద సోమవారం నుంచి శనివారం వరకూ 400 గ్రాముల అన్నం, 120 గ్రాముల పప్పు లేదా సాంబార్, 100 గ్రాముల కూర, 75 గ్రాముల పెరుగు, పచ్చడి అందజేస్తున్నారు. అన్న క్యాంటీన్‌లకు ఆదివారం సెలవు. మిగిలిన రోజుల్లో ఉదయం ఏడున్నర నుంచి పది గంటల వరకూ అల్పాహారం, మధ్యాహ్నం 12.30 నుంచి మూడు గంటల వరకూ భోజనం, రాత్రి ఏడున్నర నుంచి తొమ్మిది గంటల వరకూ భోజనం అందుబాటులో ఉంచుతున్నారు. గత ఏడాదికాలంలో ప్రతీరోజూ సగటున 23,843 మంది చొప్పున ఏడాదిలో మొత్తం 74,62,824 మంది అన్న క్యాంటీన్‌లలో ఆకలి తీర్చుకున్నారు. 28,76,030 మంది అల్పాహారం, 29,22,631 మంది మధ్యాహ్న భోజనం, 16,64,163 మంది రాత్రివేళ భోజనం చేసినట్టు యూసీడీ పీడీ సత్యవేణి తెలిపారు.



పైపు వేసిన చోట పాడైన యూజీడీ

నాణ్యత లేని యూజీడీ పనులు

ఆరిలోవ సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 11, 12, 13 వార్డుల్లో సుమారు రెండు కిలో మీటర్ల మేర నాలుగు కోట్ల రూపాయలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను రెండేళ్ల క్రితం చేపట్టారు. ఇందుకోసం తవ్వకాలు చేపట్టి అవసరమైన చోట పైపులను వేశారు. వాటిని క్రషర్ బూడిద వేసి సిమెంట్ కాంక్రీట్‌తో కప్పివేశారు. అయితే నాణ్యతాలోపం కారణంగా అవి విరిగిపోతున్నాయి.దీంతో పైపులుపైకి కనిపిస్తున్నాయి.

ప్రధానంగా పెదగదిలి శివాలయం నుంచి పెదగదిలి జంక్షన్ వైపు వెళ్లే మార్గంలో అక్కడక్కడ సిమెంట్ కాంక్రీట్ వేసి చోట పగిలి పోయి పెద్ద గోతులుగా ఏర్పడ్డాయి. దీనివల్ల వాహన చోదకులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. కార్ల టైర్లు ఈ గోతుల్లో దిగపడి పోతుండడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతోంది. కాబట్టి ఈ పైపులను కనిపించకుండా పూడ్చాలని వాహనదారులు కోరుతున్నారు.


రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ కాలనీ, వెంకోజీపాలెం తదితర ప్రాంతాల్లో శనివారం విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలగనుంది. ఈ విషయాన్ని ఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పోలాకి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. చెట్ల కొమ్మలు తొలగించడం, 33 కేవీ ఎంవీపీ ఫీడర్ నిర్వహణ కారణంగా ఆ రోజు ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు. ఎంవీపీ కాలనీ 1, 2, 3 సెక్టర్లలో కొన్ని ప్రాంతాలు, వెంకోజీపాలెం పెట్రోలు బంకు నుంచి కేఎఫ్‌సీ వరకూ, కరాచీ బేకరీ నుంచి మహాత్మాగాంధీ క్యాన్సర్ ఆస్పత్రి వరకూ ఉన్న ప్రాంతాల్లో సరఫరా నిలిపివేయనున్నామని, వినియోగదారులు సహకరించాలని ఈఈ కోరారు.

సచివాలయాల్లో కానరాని సిబ్బంది

» సర్వేల పేరుతో విధులకు డుమ్మా » అందని పౌర సేవలు » సక్రమంగా సేవలు అందక ప్రజల అసంతృప్తి

మద్దిలపాలెం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు అన్ని రకాల పౌర సేవలు అందించాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన సచివాలయాల వ్యవస్థ పని తీరు మరుగున పడుతోంది. సేవలు మాట అటుంచితే అసలు ఉద్యోగులే విధులకు హాజరు కావడం లేదు. సేవలకు వచ్చే ప్రజలకు ఖాళీ కుర్చీలే దర్శనమిస్తున్నాయి. స్థానిక 22, 23 వార్డుల్లో సచివాలయాల పరిస్థితిది. ఆయా వార్డుల్లో సచివాలయాల్లో సిబ్బంది కనిపించడమే గగనమైంది. ఉదయం 9 గంటలకు తెరవాల్సిన సచివాలయాలు 10 గంటలు దాటిన తెరుచుకోవడం లేదు. సాయంత్రం 5గంటల వరకు సేవలందించాల్సిన ఉద్యోగులు మధ్యాహ్నం తర్వాత కానరావడం లేదు. ఫలితంగా స్థానికులకు ప్రభుత్వ పరమైన సేవలు అందడంలో ఆలస్యమవుతోంది.



సిబ్బంది లేక ఖాళీగా ఉన్న సచివాలయం

సర్వేల పేరుతో డుమ్మా...

ప్రస్తుతం ప్రభుత్వం అనేక సర్వేలు నిర్వహిస్తోంది. ఈ సర్వేల పేరుతో సచివాలయాల విధులకు డుమ్మా కొడుతున్నారు. ఉదయం డ్యూటీ రిజిస్టర్‌లో సంతకం చేసి బయటకు వెళ్లిపోతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పిఠాపురం కాలనీలో ఒకే ఇంటిలో మూడు సచివాలయాలు ఉన్నాయి. అక్కడ ఒకరిద్దరు సిబ్బంది మాత్రమే అందుబాటులో ఉంటున్నారు. వివిధ పనుల నిమిత్తం సచివాలయాలకు వచ్చే స్థానికులకు సిబ్బంది ఫీల్డ్ వర్క్‌కు వెళ్లిపోయారని సమాధానం చెబుతున్నారు. దీంతో ప్రజలు అసహనానికి గురవుతున్నారు. కాగా ప్రభుత్వం దసరాకు వాహనమిత్ర పథకం అమలు చేసింది. అర్హులైన ఆటో, క్యాబ్ డ్రైవర్లు దరఖాస్తులు చేసుకోవడానికి సచివాలయాలకు వెళ్తున్నారు. సచివాయాల్లో సిబ్బంది లేకపోవడంతో వారికి ఏం చేయాలో తెలియడం లేదు. అంతేకాకుండా స్మార్ట్ రేషన్‌కార్డులు అందని వారు సచివాలయాల్లో తనిఖీ చేయించుకోవడం వెళ్లి సిబ్బందిలేక నిరాశతో వెనుదిరుగుతున్నారు. ముఖ్యంగా సచివాలయాలపై పర్యవేక్షణ కొరవడడంతో సిబ్బంది ఇష్టారాజ్యంగా విధులు నిర్వహిస్తున్నారు. ఇలా అయితే తమ సమస్యలు ఏ విధంగా పరిష్కారమతాయని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి మెరుగైన సేవలందేలాచర్యలుతీసుకోవాలనికోరుతున్నారు.

నేడు చలో పాడేరు మెడికల్ కాలేజీ



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న కేకే రాజు, వైసీపీ ఇతర నేతలు

మద్దిలపాలెం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ శుక్రవారం నిర్వహించనున్న చలో పాడేరు మెడికల్ కాలేజి కార్యక్రమం విజయవంతం చేయాలని వైసీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు పిలుపునిచ్చారు. మద్దిలపాలెం వైసీపీ కార్యాలయంలో గురువారం ఆయన ఈ కార్యక్రమానికి సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా 17 మెడికల్ కళాశాలలతో పాటు జనరల్ ఆస్పత్రుల్లో వైద్యం, విద్య అందుబాటులోకి తీసుకుని వచ్చారన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించేందుకు కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేస్తోందని ఆరోపించారు. మెడికల్ కాలేజీల స్థలాలు కొట్టేసే కుట్రలో భాగంగానే పీపీపీ పద్ధతి ద్వారా బడా సంస్థలకు అప్పగిస్తున్నారని ఆరోపించారు. వైసీపీ ఈ ప్రైవేటీకరణను అడ్డుకుంటుందని చెప్పారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు మొల్లి అప్పారావు, రాజబాబు, అంబటి శైలేష్, పేడాడ రమణకుమారి తదితరులు పాల్గొన్నారు.

తీరు మార్చుకోకుంటే చర్యలు తప్పవు

» పిఠాపురం కాలనీ యూపీహెచ్‌సీ సిబ్బందిపై డీఎంహెచ్‌వో ఆగ్రహం

మద్దిలపాలెం,సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : సిబ్బంది తీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవని జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారి జగదీశ్వరరావు హెచ్చరించారు. స్వస్థ్య నారీ సశక్త్ పరివార్ అభియాన్ వైద్య శిబిరాల పరిశీలనలో భాగంగా గురువారం ఆయన పిఠాపురం కాలనీ యూపీహెచ్‌సీని సందర్శించారు. ఆ సమయంలో యూపీహెచ్‌సీలో సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి రోజూ తప్పనిసరిగా విధులకు హాజరు కావాలని, లేదంటే చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. ప్రజలకు ముఖ్యంగా మహిళలకు క్యాన్సర్, ఎన్‌సీడీ 4.0 స్క్రీనింగ్, వ్యాధి నిరోధక టీకాలు, సికిల్ సెల్ అనీమియా, పోషణ గురించి అవగాహన కల్పించాలని సూచించారు. వచ్చే నెల 2వ వరకు ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించడమే కాకుండా మాతా శిశు, గర్భిణీ సేవలు అందరికీ అందుబాటులో ఉండాలన్నారు. ఈ క్యాంపుల్లో అభ (రోగి) ఐడీగుర్తించి, ఈహెచ్ఆర్ కూడా నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా నోడల్ అధికారి డాక్టర్ బి.ఉమాపతి, ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.



యూపీహెచ్‌సీ పరిశీలిస్తున్న జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారి జగదీశ్వరరావు

హిడెన్‌స్ప్రౌట్స్ పాఠశాలకు నిత్యావసర సరుకుల వితరణ

పెదవాల్తేరు సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : పెదవాల్తేరులోని హిడెన్‌స్ప్రౌట్స్ మానసిక దివ్యాంగుల పాఠశాలకు గురువారం ఆంధ్ర యూనివర్శిటీ ఇంజనీరింగ్ కళాశాలలో 1969-74 సంవత్సరం బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు నిత్యావసర సరుకులు అందజేశారు. సమాజ సేవలో భాగంగా మానసిక విద్యార్థులకు అండగా ఉండడం తమకు ఆనందకరమని చెరుకు శ్రీరామమూర్తి, ఎం.శ్రీరామచంద్రమూర్తి, పీఎల్ఎన్ శర్మ, బీ వీఎస్ రావు పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల నిర్వాహకులు కండిపిల్లి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



నిత్యావసర సరకులు అందజేస్తున్న ఏయూ ఇంజనీరింగ్ కళాశాలలో 1969-74 బ్యాచ్ విద్యార్థులు

'మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి'



ఆదర్శనగర్ పీహెచ్‌సిలో స్వస్థ్ నారి సశక్తి కార్యక్రమం ప్రారంభిస్తున్న వెంకటేశ్వరరావు

ఆరిలోవ, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మహిళ లు ఆరోగ్యంగా ఉంటే కుటుంబమంతా ఆనందంగా ఉంటుందని విశాఖపట్నం మెడికల్ సెల్ కన్వీనర్ కె.వెంకటేశ్వరావు అన్నారు. ఆయన గురువారం 10 వ వార్డులో గల ఆదర్శ నగర్ పీహెచ్‌సీలో స్వస్థ్ నారీ సశక్తి పరివార్ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మహిళలు ఆరోగ్య విషయంలో శ్రద్ధ కనబరచాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ రాజా మురళీమోహన్, బీజేపీ సీనియర్ నాయకులు కేవీ రమణ. బీజేపీ మండల అధ్యక్షుడు పొదిలాపు శ్రీనివాసరావు, నేతలు దొంతలరమణ, సువ్వాడ అప్పలనాయడు, మండల అప్పారావు. చింతలపూడి సన్యాసిరావు. బలివాడ శ్రీనివాస్, పలువురు టీడీపీ, జనసేన నాయకులు పేర్కొన్నారు.

సినిమా గైడ్

- **మిరాయి** : జగదాంబ, మెలోడి, శరత్, కామేశ్వరి, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం) అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **కిష్కిందపురి** : లీలామహల్, సంగం, శ్రీరామా, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), మినీ మోహిని (గాజువాక),
- **అర్జున్ చక్రవర్తి** : రమాదేవి,
- **మదరాసి** : శ్రీకన్య
- **ఘాటీ** : కిన్నెర, వెంకటేశ్వర-2, గోకుల్, ముక్తాస్, మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక) లిఖిత (శ్రీహరిపురం)
- **పరదా** : , శ్రీకన్య-2 (గాజువాక)
- **కూలీ** :వెంకటేశ్వర-1, అరుణ (పెదగంట్యాడ),
- **మహావతార్ నరసింహ** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా),

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 12, టమాటా 25, వంకాయలు (తెలుపు) 38, వంకాయలు (నలుపు) 42, బెండకాయలు 24, పచ్చిమిర్చి 38, కాకరకాయలు 34, బీరకాయలు 36, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 18, క్యారెట్ 44, దొండకాయలు 34, బంగాళ దుంపలు 19, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 40, అల్లం (పాతది) 70, బరబాటి 32, ముల్లంగి 36, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 50, దోస కాయలు 26, వెల్లుల్లి (పెద్దవి) 70, కొబ్బరికాయ (పెద్దది) 35, బీన్స్ (పెన్సిల్) 54, కీరదోస 32, కాప్సికమ్ 58, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 30, చిలగడదుంపలు 34, కంద 40, దేముడు చిక్కుడు 66, గోరు చిక్కుడు 30, కూర పెండలం 26, బ్రకోలి 45, పనస పొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాలకూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 80, బూడిద గుమ్మడి కాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	130
లైవ్ ధర	150
విత్ స్కిన్	270
స్కిన్‌లెస్	280

కాలువపై ప్రమాదకర స్థితిలో పలకలు



కాలువపై విరిగిపోయి ఉన్న పలకలు

ఆరిలోవ, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఆరిలోవ హెల్త్‌సిటీలో గల ప్రధాన కాలువలపై ఉన్న పలకలు కొన్ని విరిగిపోయి ఉన్నాయి. దీంతో ఆస్పత్రికి వస్తున్న రోగులు ఇది గుర్తించకుండా దానిపై కాలు వేసి పడిపోతున్నారు. పలువురు గాయాలకు గురవుతున్నారు. ఈ సమస్య ఎప్పటి నుంచో ఉన్నప్పటికీ పరిష్కారానికి నోచుకోవడం లేదని రోగులతో వచ్చే వారు, స్థానికులు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలువలపై కొత్త పలకలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

డీఎస్సీకి ఎంపికైన అభ్యర్థుల గుంటూరు పర్యటన వాయిదా

» ఇంటి ముఖం పట్టిన అభ్యర్థులు

గాజువాక, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల కారణంగా గుంటూరులో శుక్రవారం జరగవలసిన మెగా డీఎస్సీ నియామక పత్రాల పంపిణీ కార్యక్రమం వాయిదా పడింది. డీఎస్సీకి ఎంపికైన ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన అభ్యర్థులందరూ గురువారం ఉదయం స్టీల్ ప్లాంట్ వీవీవీ స్కూల్‌కు చేరుకున్నారు. ఉదయం ఆరు గంటల నుంచే ఇక్కడ రిజిస్ట్రేషన్ ప్రక్రియను అధికారులు ప్రారంభించారు. అభ్యర్థులతో పాటు వారి సహాయకులు ఇక్కడకు రావడంతో సందడి వాతావరణం నెలకొంది. వీరిని గుంటూరు తీసుకువెళ్లేందుకు 75 ఆర్టీసీ బస్సులను కూడా సిద్ధం చేశారు. అయితే ఉదయం 11 గంటల సమయంలో గుంటూరులో భారీ వర్షాలు కురుస్తున్నందున డీఎస్సీ అభ్యర్థులకు పట్టాల పంపిణీని వాయిదా వేసినట్టు సమాచారం అందింది. దీంతో అభ్యర్థులందరూ తమ ఇళ్లకు వెళ్లిపోయారు.



గుంటూరు వెళ్లేందుకు వీవీవీ స్కూల్‌కు చేరుకున్న డీఎస్సీకి ఎంపికైన అభ్యర్థులు

అసంపూర్తిగా కాలువల నిర్మాణం

» 15వ వార్డులో రహదారికి పైకి మురుగు నీరు

వెంకోజీపాలెం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 15వ వార్డులో కాలువలు లేకపోవడంతో పలు చోట్ల మురుగునీరు రోడ్డు పైకి వచ్చేస్తోంది. 15వ వార్డు చివరిలోనున్న ఉమానగర్ ప్రాంతంలో కాలువ నిర్మాణం చేపట్టలేదు. ఈ ప్రాంతమంతా నివాసులుండే చోట కాలువ ఉంది. అయితే ఆ కాలువ సగం వరకే ఉండడంతో అక్కడి వరకు వెళుతున్న మురుగునీరు ఆ తర్వాత రోడ్డుపైకి ప్రవహిస్తోంది. దీనివల్ల స్థానికులు, వాహన చోదకులు, ఈ పక్కనే ఉన్న జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలకు వెళ్లే విద్యార్థులు మురుగునీటిని దాటి వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. దీనిపై సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కంటితుడుపుగా కాలువ ఉన్న చోట పారిశుధ్య కార్మికులు చెత్తను తొలగిస్తున్నారు. తప్ప తమకు శాశ్వత పరిష్కారం మాత్రం లభించడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరుతున్నారు.



కాలువలు లేకపోవడంతో ఉమానగర్ ప్రాంతంలో రోడ్డుపైకి చేరుతున్న మురుగు నీరు

తెప్ప, వలల ధ్వంసంపై ఫిర్యాదు

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : చేపల వేటకు వినియోగించే తనకు చెందిన తెప్ప, వలను ధ్వంసం చేశారని ఎండాడకు చెందిన ఓ వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు విచారణ చేస్తున్నారు. ఎంవీపీ కాలనీకి చెందిన ఈదల రాము తన తెప్ప, వలను సముద్రంలో లంగరు వేసి ఉంచాడు. బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత పెదజాలారిపేటకు చెందిన కొందరు వ్యక్తులు తన బోటు, వలను ఊరి దగ్గర సముద్రంలోని రాళ్లలో వలను, తెప్పను ముక్కలుముక్కలుగా ధ్వంసం చేసి పాడు చేశారని ముగ్గురు వ్యక్తులపై అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.పోలీసులు కేసు నమోదు చేశారు.

ఉక్కు పోరాట కమిటీ కన్వీనర్ కేఎస్ఎన్ రావు రాజీనామా

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీల్ ప్లాంట్ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ కన్వీనర్ కెఎస్ఎన్.రావు తమ పదవికి గురువారం రాజీనామా చేశారు. ఈ మేరకు పోరాట కమిటీ ఛైర్మన్‌లకు లేఖ అందజేశారు. పోరాట కమిటీ ఏర్పడిన తరువాత కన్వీనర్‌గా గుర్తింపు యూనియన్ అధ్యక్షుడు కన్వీనర్‌గా వ్యవహరిస్తున్నారు. గతంలో సీఐటీయూ గుర్తింపు యూనియన్ ఉండగ అయోధ్యరాం కన్వీనర్‌గా బాధ్యతలు నిర్వహించారు. తరువాత ప్లాంట్‌లో జరిగిన గుర్తింపు యూనియన్ ఎన్నికల్లో ఏఐటీయూసీ విజయం సాధించడంతో ఆ యూనియన్ అధ్యక్షుడుగా ఉన్న కెఎస్ఎన్‌రావు కన్వీనర్‌గా వ్యవహరిస్తున్నారు. కొంతమంది ప్లాంటులో పదవీ విరమణ చేసిన సభ్యులు తమపై అవమానకర వాఖ్యలు చేయడం, సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిగత వ్యక్తిత్వాన్ని మసకబార్చే ప్రయత్నాలు చేస్తున్నారని, ఈ కారణంవల్లే పదవికి రాజీనామా చేస్తున్నానని ప్రకటించారు.

అంగీకార్-2025 బ్రోచర్ ఆవిష్కరణ



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్, ఏడీసీ ఎస్ఎస్ వర్మ, యూసీడీ ప్రాజెక్టు డైరెక్టర్ సత్యవేణి, అధికారులు

ఫోటో: 18ఎఎస్‌పీ01: వెంకోజీపాలెం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రధానమంత్రి ఆవాస్ యోజన-అర్బన్ 2.0 ప్రయోజనాలపై లబ్ధిదారులు అవగాహన కలిగి ఉండాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ పేర్కొన్నారు. గురువారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయం సమావేశ మందిరంలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన-అర్బన్ 2.0 ప్రచార అవగాహన బ్రోచర్‌ను జీవీఎంసీ అదనపు కమిషనర్ ఎస్ఎస్‌వర్మ, యూసీడీ ప్రాజెక్టు డైరెక్టర్ సత్యవేణితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జీవీఎంసీ కమిషనర్ మాట్లాడుతూ ప్రధానమంత్రి ఆవాస్ యోజన-అర్బన్ 2.0 పథకం ప్రారంభమై ఏడాది పూర్తి కావడంతో పీఎంఈవై ఆవాస్ దివస్‌నుఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. సెప్టెంబరు నుంచి అక్టోబరు 31 వరకు అంగీకార్-2025 కార్యక్రమం జరుగుతుందని, పీఎంఏవై 2.0 పథకం వివరాలను లబ్ధిదారులకు తెలియజేయడం, పీఎంఏవై 2.0 పతకంలో సొంత స్థలం కలిగి ఉండి ఇల్లు నిర్మించుకునే లబ్దిదారులకు కేంద్రం రూ.1.50 లక్షలు రాష్ట్ర ప్రభుత్వం రూ.లక్ష కలిపి మొత్తం రూ.2.50 లక్షలు ఉచితంగా ఇవ్వడం జరుగుతుందన్నారు ఇల్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు పీఎం సూర్య ఘర్ ముఫ్తి మలియోగ ఉచిత విద్యుత్ పథకం, కేంద్ర ప్రభుత్వం అమలు చేసే ఇతర పథకాలు లబ్ధిదారులకు అందుతాయన్నారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించేలా కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో హౌసింగ్ కార్పొరేషన్ ప్రాజెక్టు డైరెక్టర్ కె.సూరిబాబు, టిడ్కో పర్యవేక్షక ఇంజనీరు డి.నరసింహమూర్తి, టిడ్కో కార్యనిర్వాహక ఇంజనీర్ సుధాకర్, హౌసింగ్ కార్పొరేషన్ కార్యనిర్వాహక ఇంజనీరు సుబ్రహ్మణ్యం, జీవీఎంసీ యూసీడీ సిబ్బంది, ఏహెచ్‌పీ అండ్ బీ ఎల్ సీ, సీఎల్‌టీసీలు తదితరులు పాల్గొన్నారు.

లాడ్జి యజమానులతో పోలీసుల సమావేశం



లాడ్జి యజమానులకు సూచనలిస్తున్న సీఐ ప్రసాద్

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు లాడ్జీలు, హోటళ్ల నిర్వాహకులతో సీఐ ప్రసాద్ గురువారం స్టేషన్ ఆవరణలోనే సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. గదులు అద్దెకిచ్చేటప్పుడు నిబంధనలు పాటించాలని, గుర్తింపు కార్డు లేకుండా ఎవరికీ గదులు ఇవ్వకూడదని స్పష్టం చేశారు. ఎలాంటి అనుమానస్పద పరిస్థితులు ఉన్నా తమకు సమాచారంఅందించాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలు చేసేవారికి గదులు అద్దెకిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

బ్యాంకు ఖాతాల మార్పును వ్యతిరేకించండి

జీవీఎంసీ కార్మికులకు సీఐటీయూ గౌరవాధ్యక్షుడు పి.వెంకటరెడ్డి పిలుపు

విశాఖపట్నం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ వివిధ విభాగాల్లో పని చేస్తున్న శాశ్వత, అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు కార్మికుల జీతాల బ్యాంకు ఖాతాను ప్రైవేటు బ్యాంక్‌కు మార్చడాన్ని కార్మికులంతా వ్యతిరేకించాలని సీఐటీయూ గౌరవ అధ్యక్షుడు పి.వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. కార్మికుల బ్యాంక్ ఖాతాలు మార్పు కోసం జీవీఎంసీ అధికారులు అన్ని యూనియన్ల నేతలతో గురువారం సమావేశం నిర్వహించారని వెంకటరెడ్డి తెలిపారు. ప్రస్తుతం కార్మికులకు జాతీయ ప్రభుత్వ రంగ సంస్థ అయిన స్టేట్‌బ్యాంక్‌లో ఉండగా, ఇప్పుడు ప్రైవేటు రంగంలోని యాక్సిస్ బ్యాంక్‌కు మార్చాలని అధికారులు ప్రయత్నిస్తున్నారన్నారు. దీనివల్ల కార్మికుల భవిష్యత్తులో ఇబ్బందులు ఎదురవడంతో పాటు హక్కులు, ప్రయోజనాలను కోల్పోవాల్సి ఉంటుందని, కాబట్టి దీన్ని కార్మికులంతా వ్యతిరేకించాలని కోరారు.

ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏయూ వీసీ రాజశేఖర్, తదితరులు

విశాఖపట్నం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రా యూనివర్సిటీ ఫార్మసీ కళాశాల, ఇండియన్ ఫార్మాస్యూటికల్ అసోసియేషన్ విశాఖ శాఖ ఆధ్వర్యంలో నవంబరు 28న ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ జరగనున్నది. ఇన్నోవేటివ్, ఇంటిగ్రేట్, ఇండివిడ్యువలైజ్ క్లినికల్ ఫార్మకాలజీ అండ్ క్లినికల్ ఫార్మసీ ఫర్ నెక్స్ట్ జనరేషన్ అనే అంశంపై ఈ కాన్ఫరెన్స్‌ను నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను గురువారం ఏకూ వీసీ ఆచార్య జీపీ రాజశేఖర్ తన కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య గిరిజాశంకర్, ఆచార్య ఈశ్వర్‌కుమార్, ఆచార్య వి.గిరిజాశాస్త్రి, తదితరులు పాల్గొన్నారు.

ఏయూ శతాబ్ది ఉత్సవాలపై వెబ్‌నార్

ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాల సందర్భంగా హ్యూమన్ జెనిటిక్స్ విభాగంలో ఇంపార్టెన్స్ ఆఫ్ మైటోకాండ్రియా ఇన్ హెల్త్ అండ్ డిసీజ్ అనే అంశపై జాతీయ వెబ్‌నార్ జరిగింది. భట్నాగర్ గౌరవఫెలోషిప్ గ్రహీత, సెంటర్ ఫర్ డీఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్ అండ్ డయాగ్నోస్టిక్స్ మాజీ డైరెక్టర్ డాక్టర్ మంగరాజ్, చీఫ్ డేటా ఆఫీసర్ డాక్టర్ వినోద్ స్కారియా, మీనాక్షి అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చి డాక్టర్ పవిత్ర అమృతకుమార్, వీసీ జీపీ రాజశేఖర్, హ్యూమన్ జెనిటిక్స్ విభాగాధిపతి ఆచార్య వి.లక్ష్మి తదితరులు మాట్లాడారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ మాసోత్సవాలు

భీమునిపట్నం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : భీమిలి మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు పరిధిలో ఉన్న అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈనెల 17 నుంచి అక్టోబరు 16 వరకూ పోషణ్ అభియాన్-మిషన్ పోషణ్ 2.0-8వ రాష్ట్రీయ పోషణ మాసోత్సవాలు- 2025 కార్యక్రమం నిర్వహించనున్నట్టు భీమిలి ఐసీడీఎస్ సీడీపీవో ఎం.శ్రీదేవి తెలిపారు. ఈ మేరకు పత్రికా ప్రకటన విడుదల చేశారు. అన్ని శాఖల సమన్వయంతో నిర్వహించే ఈ కార్యక్రమంలో ప్రధానంగా పోషకాహార ఫలితాలను మెరుగుపరచడానికి సోషియల్, బిహేవియర్ ఛేంజ్ కమ్యూనికేషన్, కమ్యూనిటీ మొబిలైజేషన్‌పై ఎక్కువ దృష్టి సారించడం జరుగుతుందన్నారు. ప్రతి ఏడాది నిర్వహించే పోషణ మాసోత్సవాలు, పోషణ్ పక్వాడా అవగాహన కల్పనలో ప్రాధాన్యం ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో ప్రధానంగా అధిక బరువు నివారణకు చక్కెర, నూనె వినియోగం తగ్గించడ, బాల్య సంరక్షణ, విద్య (పోషణ్ బీ పడాయి బీ), పర్యావరణ స్థిరత్వం, పోషకాహార తోటల పెంపకం, ఒకే షెడ్ మా కే నామ్, శిశు, చిన్నారుల ఆహారపు పద్ధతులు, పోషణ, సంరక్షణలో పురుషుల పాలు పంచుకోవడం తదితర అంశాలపై నిర్వహిస్తారన్నారు.

22 నుంచి శరన్నవరాత్రి మహోత్సవాలు

అక్కయ్యపాలెం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మధుసూదన్‌నగర్‌లో వేంచేసిన లక్ష్మీగణపతి సహిత కనకదుర్గ అమ్మవారి ఆలయంలో శరన్నవరాత్రి మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు మధుసూదన్‌నగర్ గ్రామ అధ్యక్షుడు కలిమి రెడ్డి అప్పారావు, ఆలయ కమిటీ ఛైర్మన్ శ్రీరంశెట్టి శంకర్ తెలిపారు. ఈ నెల 22 నుంచి అక్టోబరు 2 వరకు వేడుకలు జరుగుతాయన్నారు. అమ్మవారు 11 రోజులు 11 దివ్య అలంకారాల్లో దర్శనం ఇస్తారన్నారు.

కనకదుర్గమ్మ ఆలయం వద్ద రాటోత్సవం

సీతంపేట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): సీతంపేట రాజేంద్రనగర్ బీటీఆర్ కాలనీ వద్ద కనకదుర్గమ్మ ఆలయంలో నిర్వహించనున్న దుర్గాదేవి శరన్నవరాత్రుల పూజ రాటోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు ఉమామహేశ్వరరావు వేదమంత్రాలతో పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో 25వ వార్డు టీడీపీ ప్రధాన కార్యదర్శి పాలేపు ధనాజీ, పాలవలస అప్పలనాయుడు, విశాఖ జిల్లా ఆటో కార్మిక సంఘం వైస్ ప్రెసిడెంట్ వులవల బాబ్జీరావు, అలజంగి జగన్, జి.సన్యాసిరావు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కంచరపాలెం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఈపీడీసీఎల్ రెండోజోన్ కంచరపాలెం సబ్‌స్టేషన్ పరిధిలో ఈ నెల 20న మరమ్మతులు చేపడుతున్నందున విద్యుత్ సరఫరా ఉండదని జోన్-2 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలియజేశారు. సుభాష్‌నగర్ ఫీడర్ పరిధిలో గల సుభాష్ నగర్, ఐటీఐ జంక్షన్, తుమ్మడి పాలెం, దుర్గానగర్ తదితర ప్రాంతాల్లో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

టీడీపీ నేత మృతికి ఎంపీ సంతాపం



ఇసరపు అప్పారావు కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎంపీ శ్రీభరత్

సీతంపేట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): సీతంపేటలో నివాసం ఉంటున్న సీనియర్ టీడీపీ నాయకుడు ఇసరపు అప్పారావు ఈ నెల 13న మృతి చెందారు. ఆయన కుమారుడు 25వ వార్డు టీడీపీ అధ్యక్షుడు ఇసరపు వాసు, కుటుంబ సభ్యులను ఎంపీ శ్రీభరత్, విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ టీడీపీ అధ్యక్షుడు గండి బాబ్జీ, ఇతర నాయకులు గురువారం పరామర్శించారు. ఇసరపు అప్పారావు చిత్రపటానికి నేతలు పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు ఎండీ నజీర్, లొడగల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డ్రైవర్ల సంఘం నూతన అడ్‌హక్ కమిటీ నియామకం



నూతన కమిటీ సభ్యులతో సంఘ నాయకులు

మహారాణిపేట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఏపీ ప్రభుత్వ డ్రైవర్ల సంఘం జిల్లా అడ్‌హక్ కమిటీ గురువారం ఏర్పాటైంది. జిల్లా అధ్యక్షుడు దాసరి వెంకట్రావు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో తమ సమస్యల తక్షణ పరిష్కారానికి కృషిచేసేందుకు డి.వెంకట రామారావు, ఎండీ ఉమర్ జాన్, డి.శేషసాయి రాజు, వి.జగదీశ్వరరావు, పిల్లి నాయుడు, కె.రామారావు, రాజు, ప్రకాష్, బాబూరావు, వై.సత్యనారాయణ తదితరులతో కూడిన కమిటీని నియమించినట్లు తెలిపారు. రెండు, మూడు నెలల్లో అధ్యక్ష, కార్యదర్శులను ఎన్నుకుంటామన్నారు. నూతన కార్యవర్గాన్ని సంఘం జాతీయ అధ్యక్షుడు వై.నాగేశ్వరరావు, కార్యదర్శి ఎస్‌వీకే వర్మ, తాతారావు, ప్రసాద్ తదితరులు అభినందించారు.

చెత్త వేస్తే జరిమానా



మహిళలకు అవగాహన కల్పిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

సీతమ్మధార, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): చైతన్యనగర్ నుంచి మద్దిలపాలెం వైపు వెళ్తున్న రహదారిలో జీకాన్ భవనం వద్ద రోడ్డుపై స్థానికులు చెత్త పెద్ద ఎత్తున వేస్తున్నారు. దీంతో ఆ ప్రాంతాన్ని శానటరీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తన సిబ్బందితో కలిసి గురువారం శుభ్రం చేశారు. ఆ ప్రాంతంలో ముగ్గులు వేసి, అక్కడ చిన్న వినాయకుడి బొమ్మ పెట్టారు. అక్కడ చెత్త వేయరాదంటూ స్థానికులకు అవగాహన కల్పించారు. నిర్లక్ష్యంతో ఎవరైనా చెత్త వేస్తే జరిమానా విధిస్తామని, ఇంటింటా చెత్త సేకరణకు వాహనం వచ్చేటప్పుడు తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ సెక్రటరీ, పబ్లిక్ హెల్త్ సిబ్బంది, జీవీఎంసీ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

రహదారులపై ఆక్రమణల తొలగింపు



నరసింహనగర్‌లో క్రేన్‌తో బడ్డీ తొలగిస్తున్న కార్మికులు



చెరుకు రసం బండిని తొలగిస్తున్న దృశ్యం



సీతంపేట ప్రధాన రహదారిపై తొలగిస్తున్న ఆక్రమణలు

అక్కయ్యపాలెం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ సిటీలో భాగంగా జీవీఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు జోన్-5 జోనల్ కమిషనర్ రాము ఆధ్వర్యంలో గ్రేటర్ 45వ వార్డు నరసింహనగర్‌లోని చిల్లర వర్తకుల తోపుడు బళ్లను గురువారం జీవీఎంసీ సిబ్బంది క్రేన్ సాయంతో తొలగించారు. వివిధ సచివాలయాల అడ్మిన్లు, సెక్రటరీలు విచ్చేసి ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన టిఫిన్, కొబ్బరికాయలు, అరటిపళ్లు, చెరుకు రసం విక్రయించే చిరు దుకాణాలు, బడ్డీలను దగ్గరుండి తొలగించారు. రోడ్డుపై ఆక్రమణల తొలగింపుతో విశాలంగా కనిపిస్తోంది.

సీతంపేటలో..

సీతంపేట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): సీతంపేట ప్రధాన రహదారులను ఆక్రమించి ఏర్పాటు చేసిన తోపుడు బండ్లను, ఫుట్‌పాత్‌లపై అక్రమంగా ప్రదర్శించిన బోర్డులు, వ్యాపార నిర్మాణాలను జీవీఎంసీ అధికారులు గురువారం తొలగించారు. జీవీఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు జోన్-3 ఏసీపీ మధుసూదనరావు పర్యవేక్షణలో సీతంపేట ప్రధాన రహదారిలో గురుద్వార కూడలి నుంచి కాంప్లెక్సు వరకు గల ఆక్రమణలను తొలగించారు. దీంతో పాటు శంకరమఠం రోడ్డులో కూడా అక్రమంగా ఏర్పాటు చేసిన బడ్డీలు, తోపుడు బండ్లను తొలగించారు. ద్వారకా పోలీసు స్టేషన్, నాలుగో పట్టణ పోలీసు స్టేషన్ పోలీసు సిబ్బంది సమక్షంలో ఆక్రమణలను తొలగించారు. ఈ కార్యక్రమంలో టీపీఓ ప్రమీల, సచివాలయం ప్లానింగ్ సెక్రటరీలు, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

వీధి విక్రయదారుల చట్టం అమలుకు చిరువ్యాపారుల డిమాండ్

అక్కయ్యపాలెం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 45వ వార్డు నరసింహనగర్ రోడ్డులో వ్యాపారాలు సాగిస్తున్న తమకు వీధి విక్రయదారుల చట్టాన్ని-2014 వెంటనే అమలు చేయాలని చిల్లర వర్తకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ ప్రాంతంలో ఏర్పాటు చేసిన తోపుడు బళ్లను జీవీఎంసీ అధికారులు తొలగించడంపై వర్తకులు గురువారం నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ అనుమతులు లేకుండా కోట్లాది రూపాయల దోపిడీకి పాల్పడుతూ భవనాలు నిర్మించుకుంటున్న బడా బాబుల జోలికి పోలేని జీవీఎంసీ అధికారులు, చిల్లర వర్తకులు, తోపుడు బళ్ల కార్మికులపై తమ ప్రతాపం చూపడం దుర్మార్గమన్నారు. తోపుడు బళ్లవారు, చిల్లర వర్తకుల కడుపులు కొట్టిన జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగాలు రాక స్వయం ఉపాధి పథకం కింద అప్పులు చేసి తోపుడు బళ్లు రోడ్డు పక్కన పెట్టుకుని వ్యాపారాలు చేసుకుని కుటుంబాన్ని పోషించుకుంటూ ఉన్న చిల్లర వర్తక కార్మికుల కడుపు కొట్టే విధంగా, ముందస్తు సమాచారం ఇవ్వకుండా జేసీబీని తీసుకొచ్చి తోపుడు బళ్లు, బడ్డీలను తొలగించడం దుర్మార్గమని మండిపడ్డారు. తమ బడ్డీలు తొలగిస్తున్నారనే ఆవేదనతో సంతోష్ అనే చికెన్ దుకాణం యజమాని బ్లేడుతో ఒంటిని కోసుకున్నాడు. అతన్ని ఆసుపత్రికి తీసుకొని వెళ్లారు.



నిరసన తెలుపుతున్న చిల్లర వర్తకులు

ఉత్సాహంగా విద్యార్థుల స్వాగత కార్యక్రమం



వేడుకలు ప్రారంభిస్తున్న ప్రసన్నకుమార్, ప్రిన్సిపాల్ డా.కె.రత్నకుమార్

కంచరపాలెం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో చదువుతున్న సివిల్ బ్రాంచ్ మొదటి ఏడాది విద్యార్థుల స్వాగత కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. సీనియర్ విద్యార్థులంతా కొత్తవారికి ఘనస్వాగతం పలికారు. సాధించిన ఉత్తమ ఫలితాల అనుభవాలను వారితో పంచుకున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.రత్నకుమార్, సివిల్ విభాగాధిపతి సంధ్యారాణిల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి కళాశాల పూర్వ విద్యార్థి, టిడ్కో మాజీ ఛైర్మన్ జె.ప్రసన్న కుమార్ హాజరై మాట్లాడారు. డిప్లొమా విద్యార్థులు క్రమ శిక్షణ, పట్టుదలతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. ముఖ్య వక్తలు సివిల్ ఇంజినీరింగ్ ప్రాధాన్యతను వివరించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. విద్యార్థుల సలహాదారు ఎస్.వి.రమణ, విభాగాధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిభను సరిగా వినియోగించుకోవాలి: ఎంపీ



సెయింట్ జోసెఫ్ కళాశాలలో మాట్లాడుతున్న ఎంపీ భరత్

జ్ఞానాపురం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ సాధనకు మాత్రమే చదవకుండా, వ్యక్తిత్వ వికాసానికి, సామాజిక మార్పునకు దోహదపడేలా జ్ఞానాన్ని సముపార్జించాలని విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ విద్యార్థినులకు హితవు పలికారు. గురువారం జ్ఞానాపురంలోని సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలను సందర్శించి అక్కడి విద్యార్థినులతో ముచ్చటించారు. రానున్న రోజుల్లో ఉద్యోగ కల్పన, మహిళల రక్షణ వంటి అంశాలపై విద్యార్థినులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చారు. నేటి యువత తమ ప్రతిభను, శక్తిని సక్రమ దిశగా వినియోగించుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్ డా.సిస్టర్ షైజీ, అధ్యాపకులు పాల్గొన్నారు.

రేపటి నుంచి సంగీత చిత్ర గీతాష్టమి



అక్కినేని సినీ సంగీత చిత్ర గీతాష్టమి పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దెందేటి భూపతిరావు తదితరులు

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): సినీ రంగానికి అక్కినేని నాగేశ్వరరావు అందించిన సేవలు ఎనలేనివని పలువురు కళా రంగ ప్రముఖులు కొనియాడారు. దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత పద్మభూషణ్ అక్కినేని నాగేశ్వరరావు 101వ జయంతి పురస్కరించుకుని ఆల్ ఫ్రెండ్స్ మ్యూజిక్ అసోసియేషన్ సారథ్యంలో 'అక్కినేని సినీ సంగీత చిత్ర గీతాష్టమి 2025' కార్యక్రమాన్ని ఈ నెల 20 నుంచి 27 వరకు నిర్వహిస్తున్నట్టు కార్యక్రమం కన్వీనర్ దెందేటి భూపతిరావు తెలిపారు. గురువారం డాబాగార్డెన్స్‌లో గోడపత్రికను భూపతిరావు, ప్రేమ సమాజం కోశాధికారి ఎంవీవీకే గుప్త ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భూపతిరావు మాట్లాడుతూ ఏడు రోజుల పాటు అక్కినేని పాటలను వివిధ సాంస్కృతిక సంస్థలైన మెలోడీ క్రియేటర్స్, శృతిలయ, రసరాగ మాధురి, కళాంజలి, భూషన్‌బ్రదర్స్‌స్వరమాధుర్యం, స్వరార్చన, స్వరాంజలి, వెంకీ రిథమ్స్, పల్లవి మ్యూజిక్, రాగమయి, స్వర్ణ మెలోడిస్, నటరత్న కల్చరల్ ఆధ్వర్యంలో ఘనంగా చేపడుతున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫణిభూషణ్, కృష్ణంరాజు, ఎంవీఆర్ నాగేశ్వరరావు, కడలి, మెలోడీ సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌ను తరిమికొడదాం



ప్లకార్డులు చూపుతున్న మహిళా వాకర్స్ క్లబ్ సభ్యులు

మురళీనగర్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉత్తరంలోని 50వవార్డులో గురువారం మహిళా వాకర్స్‌క్లబ్ సభ్యులు ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ విశాఖను హరిత నగరంగా మార్చేందుకు ప్లాస్టిక్ విడనాడాలని పిలుపునిచ్చారు. మురళీనగర్ నివాసిత ప్రాంతంలో గ్రీన్ క్లైమేట్ సంస్థ ఎన్‌జీఓ సంస్థతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ అనర్థాల్ని గుర్తించి ప్రజలంతా స్వచ్ఛందంగా పాలిథిన్ వినియోగాన్ని అరికట్టే విధంగా అలవాట్లు మార్చుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మురళీనగర్ మహిళా వాకర్స్ క్లబ్ ప్రతినిధులు మాధవి, గ్రీన్ క్లైమేట్ ఎన్‌జీఓ ఆర్గనైజేషన్ ప్రతినిధి సరిత, సంస్థ ప్రతినిధులు, మురళీనగర్ ప్రాంత మహిళలు పాల్గొన్నారు. గుడ్డసంచుల్ని ర్యాలీలో ప్రదర్శించి వాటి ప్రయోజనాల్ని తెలియజెప్పారు.

విశాఖలోనే ఈఎస్ఐ వైద్య కళాశాల ఏర్పాటు చేయాలి

» సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు డిమాండ్

మహారాణిపేట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఈఎస్ఐ వైద్య కళాశాల విశాఖలో కాకుండా అమరావతిలో ఏర్పాటు చేయాలనుకోవడం సరైన విధానం కాదని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు అన్నారు. గురువారం విశాఖలోని సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సంస్థలన్నీ అమరావతిలోనే ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఒత్తిడి తేవడంతో కేంద్రం తలొగ్గి అమరావతిలో ఈఎస్ఐ వైద్య కళాశాల ఏర్పాటు చేయాలని నిర్ణయించిందన్నారు. ఈఎస్ఐ ఆసుపత్రి నిర్మించిన దగ్గరే వైద్య కళాశాల ఉండాలని, కానీ దానికి భిన్నంగా అమరావతికి బదలాయించటం రాజకీయ నిర్ణయమని తప్పుబట్టారు. ఉత్తరాంధ్రలో 14 లక్షల మంది ఈఎస్ఐ సభ్యులు ఉన్నారని, విశాఖలో షీలానగర్ వద్ద ఈఎస్ఐ ఆసుపత్రి నిర్మాణం ముగింపు దశలో ఉందని నర్సింగరావు గుర్తుచేశారు. కార్మికులు సైతం అత్యధికంగా ఉన్న విశాఖలో కాకుండా అమరావతిలో ఏర్పాటు చేయడం తగదన్నారు. ఆంధ్రప్రదేశ్ అంటే అమరావతి మాత్రమే కాదని, ఉత్తరాంధ్రను నిర్లక్ష్యం చేస్తే ఉద్యమించాల్సి వస్తుందని హెచ్చరించారు. సమావేశంలో సీఐటీయూ నాయకుడు ఆర్‌కేఎస్‌వీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ ప్రధాన కార్యదర్శి నర్సింగరావు

రేపటి నుంచి స్విగ్గీ, జొమాటో రైడర్ల సమ్మె

మహారాణిపేట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 20 నుంచి చేపట్టనున్న సమ్మెను విజయవంతం చేయాలని స్విగ్గీ, జొమాటో రైడర్ల సంఘం నాయకుడు బి.జగన్ పిలుపునిచ్చారు. గురువారం సీఐటీయూ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సమస్యలు పరిష్కారమయ్యేంతవరకు సమ్మె కొనసాగుతుందన్నారు. జిల్లాలో ఏడేళ్లుగా సుమారు 40 వేల మంది గిగ్ వర్కర్లు పనిచేస్తున్నా ఎటువంటి ఉద్యోగ, సామాజిక భద్రత లేదన్నారు. తొలగించిన రైడర్ల ఐడీలను పునరుద్ధరించాలని, కనీస వేతనం, ఒకే రకమైన ఇన్సెంటివ్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైడర్ల సమస్యల పరిష్కారానికి కంపెనీ బాధ్యులుగా ఉండాలని జగన్ కోరారు.

ఆరోగ్య సమాజం కోసం మహిళలకు ముందస్తు చికిత్సలు: డీఆర్ఎం

విశాఖపట్నం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు రైల్వే ఆసుపత్రి వద్ద 'ఆరోగ్యవంతమైన మహిళ.. శక్తివంతమైన కుటుంబం' (స్వస్థనారి సశక్త్ పరివార్) అభియాన్ గురువారం ప్రారంభమైంది. ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ సంయుక్తంగా చేపట్టిన ఈ ప్రచార కార్యక్రమంలో వాల్తేరు రైల్వే కూడా భాగస్వామ్యమైంది. ప్రజారోగ్యం, సామాజిక సాధికారతపై అవగాహన కల్పించడంలో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి డీఆర్ఎం లలిత్ బొహ్రా, వాల్తేరు రైల్వే మహిళా సంక్షేమ సంఘం (ఈకార్వో) అధ్యక్షురాలు జ్యోత్స్న బొహ్రా ముఖ్య అతిథులుగా హాజరై 'ఆరోగ్యవంతమైన మహిళ.. శక్తివంతమైన కుటుంబం' ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారు. రక్తహీనత, అధిక రక్తపోటు, మధుమేహం వంటి వ్యాధులకు పరీక్షలు నిర్వహించి, ముందస్తు చికిత్స అందించడంపై దృష్టి పెడుతున్నామన్నారు. మహిళలు, బాలికలు, పిల్లల ఆరోగ్య సంరక్షణ, పౌష్టికాహారం సేవలను బలోపేతం చేయడంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్ఎంలు మనోజ్‌కుమార్ సాహు, ఈ.శాంతారామ్, సీఎంఎస్ డాక్టర్ చారుమతి, డాక్టర్ లక్ష్మణరావు, ఈకార్వో ప్రతినిధులు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు. వాల్తేరు డివిజన్ నిర్వహిస్తున్న స్వచ్ఛతా హీ సేవా ప్రచారంలో భాగంగా పరిశుభ్రతను ప్రోత్సహించే కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. అక్టోబరు 2 వరకు వీటిని నిర్వహించనున్నట్లు పునరుద్ఘాటించారు.



మాట్లాడుతున్న డీఆర్ఎం లలిత్ బొహ్రా, చిత్రంలో ఈకార్వో అధ్యక్షురాలు జ్యోత్స్న బొహ్రా, ఏడీఆర్ఎంలు

రబీ సీజన్‌లో రూ.340 కోట్ల రుణాలు

... 5వ పేజీ తరువాయి

వివరించారు. పాయకరావుపేట ప్రాంతంలో తమలపాకు సాగుచేసే రైతులకు ఎకరాకు రూ.లక్ష రుణం అందజేస్తున్నామని వెల్లడించారు. కేవలం నాలుగు శాతం వడ్డీతో ఇచ్చే పంట రుణాలను సకాలంలో చెల్లిస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మొత్తం వడ్డీ మాఫీ చేస్తున్నాయని పేర్కొన్నారు. రైతులకు వ్యవసాయం, సొంత అవసరాల కోసం ఇచ్చే స్వల్పకాలిక రుణాల పరిమితి రూ.ఐదు లక్షల నుంచి రూ.ఆరు లక్షలకు పెంచామన్నారు. దీనిని రూ.10 లక్షలకు పెంచాలని ప్రతిపాదించామని తాతారావు చెప్పారు.

బ్యాంకు వ్యాపార అభివృద్ధిలో భాగంగా బంగారంపై ఇచ్చే రుణాలకు ఆదరణ లభిస్తున్నదన్నారు. తొమ్మిది శాతం వడ్డీకి గ్రాము బంగారంపై రూ.6,500 రుణం మంజూరుచేస్తున్నామన్నారు. బ్యాంకు బ్రాంచిలతోపాటు దాదాపు పది సొసైటీలు బంగారంపై రుణాలు మంజూరుచేస్తున్నాయన్నారు. సొసైటీల్లో మౌలిక వసతుల కల్పనకు రూ.కోటి మంజూరుచేశామని తాతారావు తెలిపారు. జిల్లాలో సొసైటీలకు సొంత భవనాలు లేని గ్రామాల్లో రైతుసేవా కేంద్రాలు కేటాయించాలని కలెక్టర్లను కోరామన్నారు. రైతు సేవా కేంద్రాలు లేనిచోట సొంత భవనాలు నిర్మించేందుకు డీసీసీబీ సాయం చేస్తుందన్నారు.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.మూడు వేల కోట్ల వ్యాపార లక్ష్యం కాగా ఇంతవరకూ రూ.2,700 కోట్లు చేశామన్నారు. స్వయంశక్తి సంఘాలకు రుణాలు ఇవ్వడానికి బ్యాంకు సిద్ధంగా ఉందన్నారు. వాణిజ్య బ్యాంకుల కంటే తక్కువకు అంటే ఏడు శాతం వడ్డీకి డీసీసీబీ రుణాలు అందజేస్తోందన్నారు. ఇంకా రుణానికి సంబంధించి ప్రాసెసింగ్ ఫీజు రూ.4,000 చెల్లించనవసరం లేదన్నారు. అలాగే ఇళ్ల రుణాల పరిమితి పెంచామని, నిర్మాణ వ్యాపారాలకు రుణాలు ఇస్తామన్నారు. రైతులకు ప్రమాద బీమా మొత్తాన్ని పెంచాలనే ప్రతిపాదన బ్యాంకు పరిశీలిస్తోందన్నారు. ప్రస్తుతం ప్రమాదవశాత్తూ రైతు మరణిస్తే రూ.రెండు లక్షలు, సహజ మరణానికి 58 ఏళ్ల కంటే తక్కువ ఉంటే రూ.30 వేలు, పైబడితే రూ.15 వేలు సాయం ఇస్తున్నామన్నారు. అయితే ఏళ్ల తరబడి సొసైటీతో కలిసి ప్రయాణించే రైతు మరణిస్తే తగిన సాయం అందించాలన్న యోచనతో రైతు, సొసైటీ, బ్యాంకు, ఆప్కాబ్ కలిసి ప్రీమియం చెల్లించేలా ఒక ప్రతిపాదన రూపొందించామని తాతారావు చెప్పారు.

టీటీడీ లోకల్ అడ్వయిజరీ కమిటీ అధ్యక్షునిగా పట్టాభి

... 5వ పేజీ తరువాయి

గుర్తుచేశారు. అలాగే కైలాసగిరిపై వెంకటేశ్వరస్వామి దేవాలయం నిర్మించాలని సీఎం చంద్రబాబునాయుడును అప్పట్లో కోరగా, రుషికొండలో దేవాలయం నిర్మాణానికిభూమి కేటాయించారన్నారు. తనకు లోకల్ అడ్వైజరీ విశాఖపట్నం అధ్యక్షునిగా నియమించిన సీఎంకు పట్టాభి ధన్యవాదాలు తెలిపారు. ఆయన గతంలో జీవీఎంసీ కార్పొరేటర్‌గా, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా సేవలు అందించారు.

ప్రైవేటు సేవలో క్లాప్ వాహనాలు

... 5వ పేజీ తరువాయి

అక్కడకు వెళ్లారు. సిబ్బందిని పిలిచి ఏ వార్డు సచివాలయ పరిధిలో తిరిగే వాహనమని ప్రశ్నించారు. ఇళ్లకు వెళ్లి చెత్త సేకరించడం మానేసి, ప్రైవేటు ఫంక్షన్‌లో చెత్తను తరలించాల్సిన అవసరం ఏమొచ్చిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. క్లాప్ వాహనాల సిబ్బంది కొందరు ఇలా చేస్తున్నారని ఆయన వెంట ఉన్న అధికారి ఒకరు చెప్పడంతో ఇకపై పర్యవేక్షించే బాధ్యతను వార్డు శానిటేషన్ కార్యదర్శులకు అప్పగించాలని అధికారులను ఆదేశించారు.

శానిటేషన్ సెక్రటరీలకు వాహనాల పర్యవేక్షణ బాధ్యత

కొందరు క్లాప్ వాహనాల సిబ్బంది సరిగా విధులు నిర్వర్తించకపోవడంతో పర్యవేక్షణ బాధ్యతను వార్డు శానిటేషన్ కార్యదర్శులకు అప్పగించాం. ప్రతీరోజూ ఉదయం ఆరు గంటలకు వార్డు సచివాలయానికి వెళ్లి కార్యదర్శులు హాజరువేసుకోవాలి. తర్వాత ఏదో ఒక వాహనం వెంట వెళ్లి ఇంటింటికీ చెత్త సేకరణ ఎలా జరుగుతుందనేని స్వయంగా పరిశీలించాలి. దీనికి సంబంధించిన ఫొటోలను కూడా అధికారుల గ్రూపులో అప్‌లోడ్ చేయాలని ఆదేశించాం. దీనివల్ల నగరంలో క్లాప్ వాహనాలు పక్కాగా చెత్త సేకరణ జరుపుతాయి. తద్వారా నగరంలో పారిశుధ్యం మెరుగుపడుతుంది. జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్

ఆక్రమణలకు అడ్డుకట్ట

... 5వ పేజీ తరువాయి

జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ క్షేత్రస్థాయి పర్యటనలకు వెళ్లినప్పుడు గమనించారు. నగరంలో ఎక్కడికక్కడ వెండింగ్ జోన్స్ ఏర్పాటుచేసి, వ్యాపారులను అక్కడకు తరలించడం వల్ల సమస్యను పరిష్కరించవచ్చునని గుర్తించారు. నగరంలో రోడ్లు, ఫుట్‌పాత్‌లు ఆక్రమించి వ్యాపారాలు చేసుకుంటున్న వారిని గుర్తించే బాధ్యతను టౌన్‌ప్లానింగ్ విభాగంలో పనిచేసే వార్డు ప్లానింగ్ సెక్రటరీలకు అప్పగించారు. సర్వే దాదాపు చివరి దశకు చేరుకున్నట్టు సమాచారం. ఆక్రమణలను తొలగించినా వారి జీవనోపాధికి ఇబ్బంది లేకుండా ఉండేందుకు వెండింగ్‌జోన్‌లు ఏర్పాటుకు అనువైన స్థలాలను గుర్తించే పనిలో జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు ఉన్నారు. ప్రస్తుతానికి 98 వార్డుల పరిధిలో 112 చోట్ల వెండింగ్ జోన్‌ల ఏర్పాటుకు స్థలాలను గుర్తించారు. ఆయా చోట్లకు ఆక్రమణదారులను తరలిస్తే రోడ్లన్నీ విశాలంగా మారి వాహనాల రాకపోకలు సజావుగా సాగడంతోపాటు ప్రమాదాలకు అడ్డుకట్టపడుతుందన్నది కమిషనర్ భావన. దీనికోసం పోలీస్ అధికారులతో పలుమార్లు సమావేశమై ఆక్రమణల తొలగింపునకు సహకరించాలని కోరడంతో సీపీ బాగ్చి అంగీకరించారు.

ఆక్రమణల తొలగింపునకు శ్రీకారం

నగరంలో రోడ్లు, ఫుట్‌పాత్‌ల ఆక్రమణలపై జీవీఎంసీ అధికారులు 'ఆపరేషన్ లంగ్స్' పేరుతో గురువారం స్పెషల్‌డ్రైవ్ నిర్వహించారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)తో పాటు ప్రతి శుక్రవారం నిర్వహించే టౌన్‌ప్లానింగ్ గ్రీవెన్స్ కార్యక్రమానికి రోడ్లు, ఫుట్‌పాత్‌లు, పార్కుల ఆక్రమణలకు సంబంధించిన ఫిర్యాదులు అధికంగా వస్తుండడంతో వాటిపై చర్యలకు కమిషనర్ కేతన్‌గార్గ్ టౌన్‌ప్లానింగ్ అధికారులకు ఆదేశాలు జారీచేశారు. ఇకపై నిరంతరం ఆక్రమణల తొలగింపు కొనసాగేలా కార్యాచరణ రూపొందించి గురువారం నుంచి అమలు చేయాలని ఆదేశించారు. అందులో భాగంగా పోలీసుల సహకారంతో జీవీఎంసీ పరిధిలోని ఎనిమిది జోన్లలో రోడ్లు, ఫుట్‌పాత్‌లు, పార్కుల్లో 524 ఆక్రమణలను తొలగించారు. తగరపువలస మెయిన్‌రోడ్డులో 20, తగరపువలస-భీమిలి రోడ్డులో 20, మధురవాడ వుడా మిథిలాపురి కాలనీలో 52, గురుద్వారా జంక్షన్‌లో 42, డైమండ్ పార్క్ నుంచి శాంతిపురం జంక్షన్‌కు వెళ్లే రహదారిలో 42, సిరిపురం జంక్షన్ నుంచి జగదాంబ జంక్షన్‌కు వెళ్లే మార్గంలో 60, నరసింహనగర్ జంక్షన్ నుంచి డీఎల్‌బీ గ్రౌండ్ వరకు 46, పాతగాజువాక మెయిన్‌రోడ్డులో 53, ఎన్ఏడీ కొత్తరోడ్డు నుంచి గోపాలపట్నం పెట్రోల్‌బంకు వరకు 45, విమాన్‌నగర్ జంక్షన్‌లో 22, అనకాపల్లి నెహ్రూచౌక్ వద్ద 42, వంటిల్లు జంక్షన్‌లో 33 ఆక్రమణలను తొలగించారు.

పేదల ఆకలి తీరుస్తున్న అన్న క్యాంటీన్లు

... 5వ పేజీ తరువాయి


ప్రాంతీయ కంటి ఆస్పత్రి, టర్నర్‌చౌల్ట్రీ, కేజీహెచ్ ఓపీ గేటు పక్కన, వన్‌టౌన్‌లోని జనతాబజార్, తాటిచెట్లపాలెం వైఎస్ఆర్ నగర్, మర్రిపాలెం, నక్కవానిపాలెం ఆర్టీసీ డిపో, శ్రీహరిపురం కోరమాండల్ గేట్, ఆటోనగర్, గాజువాక వంటిల్లు జంక్షన్, నమ్మిదొడ్డి, అనకాపల్లి ఎన్‌టీఆర్ ఆస్పత్రి, భీమునిగుమ్మం రైల్వేస్టేషన్, బాజీ జంక్షన్, పెందుర్తి, వేపగుంట, గోపాలపట్నం రైతుబజార్ ప్రాంతాల్లో అన్న క్యాంటీన్లను ప్రారంభించారు. క్యాంటీన్‌లకు ఆహారం తయారు చేయడంతోపాటు సరఫరాచేసే బాధ్యతను అక్షయపాత్రకు అప్పగించింది. కంచరపాలెంలోని హరేకృష్ణ మూవ్‌మెంట్ ఛారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అక్షయపాత్ర సెంట్రల్ కిచెన్‌లో వంటకాలను తయారుచేసి వాహనాల్లో అన్న క్యాంటీన్లకు సరఫరా చేస్తున్నారు. మంచి రుచి, నాణ్యత కలిగి వుండడంతో నిరుపేదలు, కూలీలే కాకుండా ఆటోడ్రైవర్లు, చిరువ్యాపారులు కూడా భోజనం కోసం వీటినే ఆశ్రయిస్తున్నారు. దీంతో క్యాంటీన్లకు రోజురోజుకీ ఆదరణ పెరుగుతోంది.

అల్పాహారం కింద ప్రతిరోజూ మూడు ఇడ్లీలు, 150 మిల్లీలీటర్ల సాంబార్, 150 గ్రాములు చట్నీ ఇస్తున్నారు. ప్రత్యామ్నాయంగా సోమవారం, గురువారాల్లో మూడు పూరీ, వంద గ్రాముల కర్రీ, మంగళ, శుక్రవారాల్లో 250 గ్రాముల ఉప్మా, మిక్చర్, సాంబార్, బుధ, శనివారాల్లో హాట్ పొంగల్, సాంబార్, మిక్చర్‌ను అందుబాటులో ఉంచుతున్నారు. మధ్యాహ్నం, రాత్రిపూట భోజనం కింద సోమవారం నుంచి శనివారం వరకూ 400 గ్రాముల అన్నం, 120 గ్రాముల పప్పు లేదా సాంబార్, 100 గ్రాముల కూర, 75 గ్రాముల పెరుగు, పచ్చడి అందజేస్తున్నారు. అన్న క్యాంటీన్‌లకు ఆదివారం సెలవు. మిగిలిన రోజుల్లో ఉదయం ఏడున్నర నుంచి పది గంటల వరకూ అల్పాహారం, మధ్యాహ్నం 12.30 నుంచి మూడు గంటల వరకూ భోజనం, రాత్రి ఏడున్నర నుంచి తొమ్మిది గంటల వరకూ భోజనం అందుబాటులో ఉంచుతున్నారు. గత ఏడాదికాలంలో ప్రతీరోజూ సగటున 23,843 మంది చొప్పున ఏడాదిలో మొత్తం 74,62,824 మంది అన్న క్యాంటీన్‌లలో ఆకలి తీర్చుకున్నారు. 28,76,030 మంది అల్పాహారం, 29,22,631 మంది మధ్యాహ్న భోజనం, 16,64,163 మంది రాత్రివేళ భోజనం చేసినట్టు యూసీడీ పీడీ సత్యవేణి తెలిపారు.

సచివాలయాల్లో కానరాని సిబ్బంది

» సర్వేల పేరుతో విధులకు డుమ్మా » అందని పౌర సేవలు » సక్రమంగా సేవలు అందక ప్రజల అసంతృప్తి

మద్దిలపాలెం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు అన్ని రకాల పౌర సేవలు అందించాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన సచివాలయాల వ్యవస్థ పనితీరు మరుగున పడుతోంది. సేవలు మాట అటుంచితే అసలు ఉద్యోగులే విధులకు హాజరు కావడం లేదు. సేవలకు వచ్చే ప్రజలకు ఖాళీ కుర్చీలే దర్శనమిస్తున్నాయి. స్థానిక 22, 23 వార్డుల్లో సచివాలయాల పరిస్థితిది. ఆయా వార్డుల్లో సచివాలయాల్లో సిబ్బంది కనిపించడమే గగనమైంది. ఉదయం 9 గంటలకు తెరవాల్సిన సచివాలయాలు 10 గంటలు దాటిన తెరుచుకోవడం లేదు. సాయంత్రం 5గంటల వరకు సేవలందించాల్సిన ఉద్యోగులు మధ్యాహ్నం తర్వాత కానరావడం లేదు. ఫలితంగా స్థానికులకు ప్రభుత్వ పరమైన సేవలు అందడంలో ఆలస్యమవుతోంది.



సిబ్బంది లేక ఖాళీగా ఉన్న సచివాలయం

సర్వేల పేరుతో డుమ్మా...

ప్రస్తుతం ప్రభుత్వం అనేక సర్వేలు నిర్వహిస్తోంది. ఈ సర్వేల పేరుతో సచివాలయాల విధులకు డుమ్మా కొడుతున్నారు. ఉదయం డ్యూటీ రిజిస్టర్‌లో సంతకం చేసి బయటకు వెళ్లిపోతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పిఠాపురం కాలనీలో ఒకే ఇంటిలో మూడు సచివాలయాలు ఉన్నాయి. అక్కడ ఒకరిద్దరు సిబ్బంది మాత్రమే అందుబాటులో ఉంటున్నారు. వివిధ పనుల నిమిత్తం సచివాలయాలకు వచ్చే స్థానికులకు సిబ్బంది ఫీల్డ్ వర్క్‌కు వెళ్లిపోయారని సమాధానం చెబుతున్నారు. దీంతో ప్రజలు అసహనానికి గురవుతున్నారు. కాగా ప్రభుత్వం దసరాకు వాహనమిత్ర పథకం అమలు చేసింది. అర్హులైన ఆటో, క్యాబ్ డ్రైవర్లు దరఖాస్తులు చేసుకోవడానికి సచివాలయాలకు వెళ్తున్నారు. సచివాయాల్లో సిబ్బంది లేకపోవడంతో వారికి ఏం చేయాలో తెలియడం లేదు. అంతేకాకుండా స్మార్ట్ రేషన్‌కార్డులు అందని వారు సచివాలయాల్లో తనిఖీ చేయించుకోవడం వెళ్లి సిబ్బందిలేక నిరాశతో వెనుదిరుగుతున్నారు. ముఖ్యంగా సచివాలయాలపై పర్యవేక్షణ కొరవడడంతో సిబ్బంది ఇష్టారాజ్యంగా విధులు నిర్వహిస్తున్నారు. ఇలా అయితే తమ సమస్యలు ఏ విధంగా పరిష్కారమతాయని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి మెరుగైన సేవలందేలాచర్యలుతీసుకోవాలనికోరుతున్నారు.



పైపు వేసిన చోట పాడైన యూజీడీ

నాణ్యత లేని యూజీడీ పనులు

ఆరిలోవ సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 11, 12, 13 వార్డుల్లో సుమారు రెండు కిలో మీటర్ల మేర నాలుగు కోట్ల రూపాయలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను రెండేళ్ల క్రితం చేపట్టారు. ఇందుకోసం తవ్వకాలు చేపట్టి అవసరమైన చోట పైపులను వేశారు. వాటిని క్రషర్ బూడిద వేసి సిమెంట్ కాంక్రీట్‌తో కప్పివేశారు. అయితే నాణ్యతాలోపం కారణంగా అవి విరిగిపోతున్నాయి.దీంతో పైపులుపైకి కనిపిస్తున్నాయి.

ప్రధానంగా పెదగదిలి శివాలయం నుంచి పెదగదిలి జంక్షన్ వైపు వెళ్లే మార్గంలో అక్కడక్కడ సిమెంట్ కాంక్రీట్ వేసి చోట పగిలి పోయి పెద్ద గోతులుగా ఏర్పడ్డాయి. దీనివల్ల వాహన చోదకులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. కార్ల టైర్లు ఈ గోతుల్లో దిగపడి పోతుండడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతోంది. కాబట్టి ఈ పైపులను కనిపించకుండా పూడ్చాలని వాహనదారులు కోరుతున్నారు.

రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ కాలనీ, వెంకోజీపాలెం తదితర ప్రాంతాల్లో శనివారం విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలగనుంది. ఈ విషయాన్ని ఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పోలాకి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. చెట్ల కొమ్మలు తొలగించడం, 33 కేవీ ఎంవీపీ ఫీడర్ నిర్వహణ కారణంగా ఆ రోజు ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు. ఎంవీపీ కాలనీ 1, 2, 3 సెక్టర్లలో కొన్ని ప్రాంతాలు, వెంకోజీపాలెం పెట్రోలు బంకు నుంచి కేఎఫ్‌సీ వరకూ, కరాచీ బేకరీ నుంచి మహాత్మాగాంధీ క్యాన్సర్ ఆస్పత్రి వరకూ ఉన్న ప్రాంతాల్లో సరఫరా నిలిపివేయనున్నామని, వినియోగదారులు సహకరించాలని ఈఈ కోరారు.

నేడు చలో పాడేరు మెడికల్ కాలేజీ



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న కేకే రాజు, వైసీపీ ఇతర నేతలు

మద్దిలపాలెం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ శుక్రవారం నిర్వహించనున్న చలో పాడేరు మెడికల్ కాలేజి కార్యక్రమం విజయవంతం చేయాలని వైసీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు పిలుపునిచ్చారు. మద్దిలపాలెం వైసీపీ కార్యాలయంలో గురువారం ఆయన ఈ కార్యక్రమానికి సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా 17 మెడికల్ కళాశాలలతో పాటు జనరల్ ఆస్పత్రుల్లో వైద్యం, విద్య అందుబాటులోకి తీసుకుని వచ్చారన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించేందుకు కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేస్తోందని ఆరోపించారు. మెడికల్ కాలేజీల స్థలాలు కొట్టేసే కుట్రలో భాగంగానే పీపీపీ పద్ధతి ద్వారా బడా సంస్థలకు అప్పగిస్తున్నారని ఆరోపించారు. వైసీపీ ఈ ప్రైవేటీకరణను అడ్డుకుంటుందని చెప్పారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు మొల్లి అప్పారావు, రాజబాబు, అంబటి శైలేష్, పేడాడ రమణకుమారి తదితరులు పాల్గొన్నారు.

తీరు మార్చుకోకుంటే చర్యలు తప్పవు

» పిఠాపురం కాలనీ యూపీహెచ్‌సీ సిబ్బందిపై డీఎంహెచ్‌వో ఆగ్రహం

మద్దిలపాలెం,సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : సిబ్బంది తీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవని జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారి జగదీశ్వరరావు హెచ్చరించారు. స్వస్థ్య నారీ సశక్త్ పరివార్ అభియాన్ వైద్య శిబిరాల పరిశీలనలో భాగంగా గురువారం ఆయన పిఠాపురం కాలనీ యూపీహెచ్‌సీని సందర్శించారు. ఆ సమయంలో యూపీహెచ్‌సీలో సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి రోజూ తప్పనిసరిగా విధులకు హాజరు కావాలని, లేదంటే చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. ప్రజలకు ముఖ్యంగా మహిళలకు క్యాన్సర్, ఎన్‌సీడీ 4.0 స్క్రీనింగ్, వ్యాధి నిరోధక టీకాలు, సికిల్ సెల్ అనీమియా, పోషణ గురించి అవగాహన కల్పించాలని సూచించారు. వచ్చే నెల 2వ వరకు ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించడమే కాకుండా మాతా శిశు, గర్భిణీ సేవలు అందరికీ అందుబాటులో ఉండాలన్నారు. ఈ క్యాంపుల్లో అభ (రోగి) ఐడీగుర్తించి, ఈహెచ్‌ఆర్ కూడా నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా నోడల్ అధికారి డాక్టర్ బి.ఉమాపతి, ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.



యూపీహెచ్‌సీ పరిశీలిస్తున్న జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారి జగదీశ్వరరావు

'మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి'



ఆదర్శనగర్ పీహెచ్‌సిలో స్వస్థ్ నారి సశక్తి కార్యక్రమం ప్రారంభిస్తున్న వెంకటేశ్వరరావు

ఆరిలోవ, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మహిళ లు ఆరోగ్యంగా ఉంటే కుటుంబమంతా ఆనందంగా ఉంటుందని విశాఖపట్నం మెడికల్ సెల్ కన్వీనర్ కె.వెంకటేశ్వరావు అన్నారు. ఆయన గురువారం 10 వ వార్డులో గల ఆదర్శ నగర్ పీహెచ్‌సీలో స్వస్థ్ నారీ సశక్తి పరివార్ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మహిళలు ఆరోగ్య విషయంలో శ్రద్ధ కనబరచాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ రాజా మురళీమోహన్, బీజేపీ సీనియర్ నాయకులు కేవీ రమణ. బీజేపీ మండల అధ్యక్షుడు పొదిలాపు శ్రీనివాసరావు, నేతలు దొంతలరమణ, సువ్వాడ అప్పలనాయుడు, మండల అప్పారావు. చింతలపూడి సన్యాసిరావు. బలివాడ శ్రీనివాస్, పలువురు టీడీపీ, జనసేన నాయకులు పేర్కొన్నారు.

హిడెన్‌స్ప్రౌట్స్ పాఠశాలకు నిత్యావసర సరుకుల వితరణ

పెదవాల్తేరు సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : పెదవాల్తేరులోని హిడెన్‌స్ప్రౌట్స్ మానసిక దివ్యాంగుల పాఠశాలకు గురువారం ఆంధ్ర యూనివర్శిటీ ఇంజనీరింగ్ కళాశాలలో 1969-74 సంవత్సరం బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు నిత్యావసర సరుకులు అందజేశారు. సమాజ సేవలో భాగంగా మానసిక విద్యార్థులకు అండగా ఉండడం తమకు ఆనందకరమని చెరుకు శ్రీరామమూర్తి, ఎం.శ్రీరామచంద్రమూర్తి, పీఎల్‌ఎన్ శర్మ, బీ వీఎస్ రావు పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల నిర్వాహకులు కండిపిల్లి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



నిత్యావసర సరకులు అందజేస్తున్న ఏయూ ఇంజనీరింగ్ కళాశాలలో 1969-74 బ్యాచ్ విద్యార్థులు

సినిమా గైడ్

- **మిరాయి** : జగదాంబ, మెలోడి, శరత్, కామేశ్వరి, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం) అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **కిష్కిందపురి** : లీలామహల్, సంగం, శ్రీరామా, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), మినీ మోహిని (గాజువాక),
- **అర్జున్ చక్రవర్తి** : రమాదేవి,
- **మదరాసి** : శ్రీకన్య
- **ఘాటీ** : కిన్నెర, వెంకటేశ్వర-2, గోకుల్, ముక్తాస్, మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక) లిఖిత (శ్రీహరిపురం)
- **పరదా** : , శ్రీకన్య-2 (గాజువాక)
- **కూలీ** :వెంకటేశ్వర-1, అరుణ (పెదగంట్యాడ),
- **మహావతార్ నరసింహ** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా),

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 12, టమాటా 25, వంకాయలు (తెలుపు) 38, వంకాయలు (నలుపు) 42, బెండకాయలు 24, పచ్చిమిర్చి 38, కాకరకాయలు 34, బీరకాయలు 36, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 18, క్యారెట్ 44, దొండకాయలు 34, బంగాళ దుంపలు 19, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 40, అల్లం (పాతది) 70, బరబాటి 32, ముల్లంగి 36, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 50, దోస కాయలు 26, వెల్లుల్లి (పెద్దవి) 70, కొబ్బరికాయ (పెద్దది) 35, బీన్స్ (పెన్సిల్) 54, కీరదోస 32, కాప్సికమ్ 58, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 30, చిలగడదుంపలు 34, కంద 40, దేముడు చిక్కుడు 66, గోరు చిక్కుడు 30, కూర పెండలం 26, బ్రకోలి 45, పనస పొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాలకూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 80, బూడిద గుమ్మడి కాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్)	(వంద - రూ.లలో)
విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	130
లైవ్ ధర	150
విత్ స్కిన్	270
స్కిన్‌లెస్	280

కాలువపై ప్రమాదకర స్థితిలో పలకలు



కాలువపై విరిగిపోయి ఉన్న పలకలు

ఆరిలోవ, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఆరిలోవ హెల్త్‌సిటీలో గల ప్రధాన కాలువలపై ఉన్న పలకలు కొన్ని విరిగిపోయి ఉన్నాయి. దీంతో ఆస్పత్రికి వస్తున్న రోగులు ఇది గుర్తించకుండా దానిపై కాలు వేసి పడిపోతున్నారు. పలువురు గాయాలకు గురవుతున్నారు. ఈ సమస్య ఎప్పటి నుంచో ఉన్నప్పటికీ పరిష్కారానికి నోచుకోవడం లేదని రోగులతో వచ్చే వారు, స్థానికులు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలువలపై కొత్త పలకలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

డీఎస్సీకి ఎంపికైన అభ్యర్థుల గుంటూరు పర్యటన వాయిదా

» ఇంటి ముఖం పట్టిన అభ్యర్థులు

గాజువాక, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల కారణంగా గుంటూరులో శుక్రవారం జరగవలసిన మెగా డీఎస్సీ నియామక పత్రాల పంపిణీ కార్యక్రమం వాయిదా పడింది. డీఎస్సీకి ఎంపికైన ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన అభ్యర్థులందరూ గురువారం ఉదయం స్టీల్ ప్లాంట్ వీవీపీ స్కూల్‌కు చేరుకున్నారు. ఉదయం ఆరు గంటల నుంచే ఇక్కడ రిజిస్ట్రేషన్ ప్రక్రియను అధికారులు ప్రారంభించారు. అభ్యర్థులతో పాటు వారి సహాయకులు ఇక్కడకు రావడంతో సందడి వాతావరణం నెలకొంది. వీరిని గుంటూరు తీసుకువెళ్లేందుకు 75 ఆర్టీసీ బస్సులను కూడా సిద్ధం చేశారు. అయితే ఉదయం 11 గంటల సమయంలో గుంటూరులో భారీ వర్షాలు కురుస్తున్నందున డీఎస్సీ అభ్యర్థులకు పట్టాల పంపిణీని వాయిదా వేసినట్టు సమాచారం అందింది. దీంతో అభ్యర్థులందరూ తమ ఇళ్లకు వెళ్లిపోయారు.



గుంటూరు వెళ్లేందుకు వీవీపీ స్కూల్‌కు చేరుకున్న డీఎస్సీకి ఎంపికైన అభ్యర్థులు

అసంపూర్తిగా కాలువల నిర్మాణం

» 15వ వార్డులో రహదారికి పైకి మురుగు నీరు

వెంకోజీపాలెం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 15వ వార్డులో కాలువలు లేకపోవడంతో పలు చోట్ల మురుగునీరు రోడ్డు పైకి వచ్చేస్తోంది. 15వ వార్డు చివరిలోనున్న ఉమానగర్ ప్రాంతంలో కాలువ నిర్మాణం చేపట్టలేదు. ఈ ప్రాంతమంతా నివాసులుండే చోట కాలువ ఉంది. అయితే ఆ కాలువ సగం వరకే ఉండడంతో అక్కడి వరకు వెళుతున్న మురుగునీరు ఆ తర్వాత రోడ్డుపైకి ప్రవహిస్తోంది. దీనివల్ల స్థానికులు, వాహన చోదకులు, ఈ పక్కనే ఉన్న జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలకు వెళ్లే విద్యార్థులు మురుగునీటిని దాటి వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. దీనిపై సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కంటితుడుపుగా కాలువ ఉన్న చోట పారిశుధ్య కార్మికులు చెత్తను తొలగిస్తున్నారు. తప్ప తమకు శాశ్వత పరిష్కారం మాత్రం లభించడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరుతున్నారు.



కాలువలు లేకపోవడంతో ఉమానగర్ ప్రాంతంలో రోడ్డుపైకి చేరుతున్న మురుగు నీరు

తెప్ప, వలల ధ్వంసంపై ఫిర్యాదు

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : చేపల వేటకు వినియోగించే తనకు చెందిన తెప్ప, వలను ధ్వంసం చేశారని ఎండాడకు చెందిన ఓ వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు విచారణ చేస్తున్నారు. ఎంవీపీ కాలనీకి చెందిన ఈదల రాము తన తెప్ప, వలను సముద్రంలో లంగరు వేసి ఉంచాడు. బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత పెదజాలారిపేటకు చెందిన కొందరు వ్యక్తులు తన బోటు, వలను ఊరి దగ్గర సముద్రంలోని రాళ్లలో వలను, తెప్పను ముక్కలుముక్కలుగా ధ్వంసం చేసి పాడు చేశారని ముగ్గురు వ్యక్తులపై అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.పోలీసులు కేసు నమోదు చేశారు.

ఉక్కు పోరాట కమిటీ కన్వీనర్ కేఎస్ఎన్ రావు రాజీనామా

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీల్ ప్లాంట్ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ కన్వీనర్ కెఎస్ఎన్.రావు తమ పదవికి గురువారం రాజీనామా చేశారు. ఈ మేరకు పోరాట కమిటీ చైర్మన్‌లకు లేఖ అందజేశారు. పోరాట కమిటీ ఏర్పడిన తరువాత కన్వీనర్‌గా గుర్తింపు యూనియన్ అధ్యక్షుడు కన్వీనర్‌గా వ్యవహరిస్తున్నారు. గతంలో సీఐటీయూ గుర్తింపు యూనియన్ ఉండగ అయోధ్యరాం కన్వీనర్‌గా బాధ్యతలు నిర్వహించారు. తరువాత ప్లాంట్‌లో జరిగిన గుర్తింపు యూనియన్ ఎన్నికల్లో ఏఐటీయూసీ విజయం సాధించడంతో ఆ యూనియన్ అధ్యక్షుడుగా ఉన్న కెఎస్ఎన్‌రావు కన్వీనర్‌గా వ్యవహరిస్తున్నారు. కొంతమంది ప్లాంటులో పదవీ విరమణ చేసిన సభ్యులు తమపై అవమానకర వాఖ్యలు చేయడం, సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిగత వ్యక్తిత్వాన్ని మసకబార్చే ప్రయత్నాలు చేస్తున్నారని, ఈ కారణంవల్లే పదవికి రాజీనామా చేస్తున్నానని ప్రకటించారు.

అంగీకార్-2025 బ్రోచర్ ఆవిష్కరణ



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్, ఏడీసీ ఎస్ఎస్ వర్మ, యూసీడీ ప్రాజెక్టు డైరెక్టర్ సత్యవేణి, అధికారులు

ఫోటో: 18ఎఎస్‌పీ01: వెంకోజీపాలెం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రధానమంత్రి ఆవాస్ యోజన-అర్బన్ 2.0 ప్రయోజనాలపై లబ్ధిదారులు అవగాహన కలిగి ఉండాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ పేర్కొన్నారు. గురువారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయం సమావేశ మందిరంలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన-అర్బన్ 2.0 ప్రచార అవగాహన బ్రోచర్‌ను జీవీఎంసీ అదనపు కమిషనర్ ఎస్ఎస్‌వర్మ, యూసీడీ ప్రాజెక్టు డైరెక్టర్ సత్యవేణితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జీవీఎంసీ కమిషనర్ మాట్లాడుతూ ప్రధానమంత్రి ఆవాస్ యోజన-అర్బన్ 2.0 పథకం ప్రారంభమై ఏడాది పూర్తి కావడంతో పీఎంఈవై ఆవాస్ దివస్‌నుఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. సెప్టెంబరు నుంచి అక్టోబరు 31 వరకు అంగీకార్-2025 కార్యక్రమం జరుగుతుందని, పీఎంఏవై 2.0 పథకం వివరాలను లబ్ధిదారులకు తెలియజేయడం, పీఎంఏవై 2.0 పతకంలో సొంత స్థలం కలిగి ఉండి ఇల్లు నిర్మించుకునే లబ్దిదారులకు కేంద్రం రూ.1.50 లక్షలు రాష్ట్ర ప్రభుత్వం రూ.లక్ష కలిపి మొత్తం రూ.2.50 లక్షలు ఉచితంగా ఇవ్వడం జరుగుతుందన్నారు ఇల్లు నిర్మించుకున్న లబ్దిదారులకు పీఎం సూర్య ఘర్ ముఫ్తి మలియోగ ఉచిత విద్యుత్ పథకం, కేంద్ర ప్రభుత్వం అమలు చేసే ఇతర పథకాలు లబ్దిదారులకు అందుతాయన్నారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించేలా కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో హౌసింగ్ కార్పొరేషన్ ప్రాజెక్టు డైరెక్టర్ కె.సూరిబాబు, టిడ్కో పర్యవేక్షక ఇంజనీరు డి.నరసింహమూర్తి, టిడ్కో కార్యనిర్వాహక ఇంజనీర్ సుధాకర్, హౌసింగ్ కార్పొరేషన్ కార్యనిర్వాహక ఇంజనీరు సుబ్రహ్మణ్యం, జీవీఎంసీ యూసీడీ సిబ్బంది, ఏహెచ్‌పీ అండ్ బీ ఎల్ సీ, సీఎల్‌టీసీలు తదితరులు పాల్గొన్నారు.

లాడ్జి యజమానులతో పోలీసుల సమావేశం



లాడ్జి యజమానులకు సూచనలిస్తున్న సీఐ ప్రసాద్

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు లాడ్జీలు, హోటళ్ల నిర్వాహకులతో సీఐ ప్రసాద్ గురువారం స్టేషన్ ఆవరణలోనే సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. గదులు అద్దెకిచ్చేటప్పుడు నిబంధనలు పాటించాలని, గుర్తింపు కార్డు లేకుండా ఎవరికీ గదులు ఇవ్వకూడదని స్పష్టం చేశారు. ఎలాంటి అనుమానస్పద పరిస్థితులు ఉన్నా తమకు సమాచారంఅందించాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలు చేసేవారికి గదులు అద్దెకిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

బ్యాంకు ఖాతాల మార్పును వ్యతిరేకించండి

జీవీఎంసీ కార్మికులకు సీఐటీయూ గౌరవాధ్యక్షుడు పి.వెంకటరెడ్డి పిలుపు

విశాఖపట్నం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ వివిధ విభాగాల్లో పని చేస్తున్న శాశ్వత, అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు కార్మికుల జీతాల బ్యాంకు ఖాతాను ప్రైవేటు బ్యాంక్‌కు మార్చడాన్ని కార్మికులంతా వ్యతిరేకించాలని సీఐటీయూ గౌరవ అధ్యక్షుడు పి.వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. కార్మికుల బ్యాంక్ ఖాతాలు మార్పు కోసం జీవీఎంసీ అధికారులు అన్ని యూనియన్ల నేతలతో గురువారం సమావేశం నిర్వహించారని వెంకటరెడ్డి తెలిపారు. ప్రస్తుతం కార్మికులకు జాతీయ ప్రభుత్వ రంగ సంస్థ అయిన స్టేట్‌బ్యాంక్‌లో ఉండగా, ఇప్పుడు ప్రైవేటు రంగంలోని యాక్సిస్ బ్యాంక్‌కు మార్చాలని అధికారులు ప్రయత్నిస్తున్నారన్నారు. దీనివల్ల కార్మికుల భవిష్యత్తులో ఇబ్బందులు ఎదురవడంతో పాటు హక్కులు, ప్రయోజనాలను కోల్పోవాల్సి ఉంటుందని, కాబట్టి దీన్ని కార్మికులంతా వ్యతిరేకించాలని కోరారు.

ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏయూ వీసీ రాజశేఖర్, తదితరులు

విశాఖపట్నం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రా యూనివర్సిటీ ఫార్మసీ కళాశాల, ఇండియన్ ఫార్మాస్యూటికల్ అసోసియేషన్ విశాఖ శాఖ ఆధ్వర్యంలో నవంబరు 28న ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ జరగనున్నది. ఇన్నోవేటివ్, ఇంటిగ్రేట్, ఇండివిడ్యువలైజ్ క్లినికల్ ఫార్మకాలజీ అండ్ క్లినికల్ ఫార్మసీ ఫర్ నెక్స్ట్ జనరేషన్ అనే అంశంపై ఈ కాన్ఫరెన్స్‌ను నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను గురువారం ఏయూ వీసీ ఆచార్య జీపీ రాజశేఖర్ తన కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య గిరిజాశంకర్, ఆచార్య ఈశ్వర్‌కుమార్, ఆచార్య వి.గిరిజాశాస్త్రి, తదితరులు పాల్గొన్నారు.

ఏయూ శతాబ్ది ఉత్సవాలపై వెబ్‌నార్

ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాల సందర్భంగా హ్యూమన్ జెనిటిక్స్ విభాగంలో ఇంపార్టెన్స్ ఆఫ్ మైటోకాండ్రియా ఇన్ హెల్త్ అండ్ డిసీజ్ అనే అంశంపై జాతీయ వెబ్‌నార్ జరిగింది. భట్నాగర్ గౌరవఫెలోషిప్ గ్రహీత, సెంటర్ ఫర్ డీఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్ అండ్ డయాగ్నోస్టిక్స్ మాజీ డైరెక్టర్ డాక్టర్ మంగరాజ్, చీఫ్ డేటా ఆఫీసర్ డాక్టర్ వినోద్ స్కారియా, మీనాక్షి అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చి డాక్టర్ పవిత్ర అమృతకుమార్, వీసీ జీపీ రాజశేఖర్, హ్యూమన్ జెనిటిక్స్ విభాగాధిపతి ఆచార్య వి.లక్ష్మి తదితరులు మాట్లాడారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ మాసోత్సవాలు

భీమునిపట్నం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : భీమిలి మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు పరిధిలో ఉన్న అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈనెల 17 నుంచి అక్టోబరు 16 వరకూ పోషణ్ అభియాన్-మిషన్ పోషణ్ 2.0-8వ రాష్ట్రీయ పోషణ మాసోత్సవాలు- 2025 కార్యక్రమం నిర్వహించనున్నట్టు భీమిలి ఐసీడీఎస్ సీడీపీవో ఎం.శ్రీదేవి తెలిపారు. ఈ మేరకు పత్రికా ప్రకటన విడుదల చేశారు. అన్ని శాఖల సమన్వయంతో నిర్వహించే ఈ కార్యక్రమంలో ప్రధానంగా పోషకాహార ఫలితాలను మెరుగుపరచడానికి సోషియల్, బిహేవియర్ చేంజ్ కమ్యూనికేషన్, కమ్యూనిటీ మొబిలైజేషన్‌పై ఎక్కువ దృష్టి సారించడం జరుగుతుందన్నారు. ప్రతి ఏడాది నిర్వహించే పోషణ మాసోత్సవాలు, పోషణ్ పక్వాడా అవగాహన కల్పనలో ప్రాధాన్యం ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో ప్రధానంగా అధిక బరువు నివారణకు చక్కెర, నూనె వినియోగం తగ్గించడ., బాల్య సంరక్షణ, విద్య (పోషణ్ బీ పడాయి బీ), పర్యావరణ స్థిరత్వం, పోషకాహార తోటల పెంపకం, ఒకే షెడ్ మా కే నామ్, శిశు, చిన్నారుల ఆహారపు పద్ధతులు, పోషణ, సంరక్షణలో పురుషుల పాలు పంచుకోవడం తదితర అంశాలపై నిర్వహిస్తారన్నారు.

22 నుంచి శరన్నవరాత్రి మహోత్సవాలు

అక్కయ్యపాలెం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మధుసూదన్‌నగర్‌లో వేంచేసిన లక్ష్మీగణపతి సహిత కనకదుర్గ అమ్మవారి ఆలయంలో శరన్నవరాత్రి మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు మధుసూదన్‌నగర్ గ్రామ అధ్యక్షుడు కలిమిరెడ్డి అప్పారావు, ఆలయ కమిటీ చైర్మన్ శ్రీరంశెట్టి శంకర్ తెలిపారు. ఈ నెల 22 నుంచి అక్టోబరు 2 వరకు వేడుకలు జరుగుతాయన్నారు. అమ్మవారు 11 రోజులు 11 దివ్య అలంకారాల్లో దర్శనం ఇస్తారన్నారు.

కనకదుర్గమ్మ ఆలయం వద్ద రాటోత్సవం

సీతంపేట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): సీతంపేట రాజేంద్రనగర్ బీటీఆర్ కాలనీ వద్ద కనకదుర్గమ్మ ఆలయంలో నిర్వహించనున్న దుర్గాదేవి శరన్నవరాత్రుల పూజ రాటోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు ఉమామహేశ్వరరావు వేదమంత్రాలతో పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో 25వ వార్డు టీడీపీ ప్రధాన కార్యదర్శి పాలేపు ధనాజీ, పాలవలస అప్పలనాయుడు, విశాఖ జిల్లా ఆటో కార్మిక సంఘం వైస్ ప్రెసిడెంట్ వులవల బాబ్జీరావు, అలజంగి జగన్, జి.సన్యాసిరావు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కంచరపాలెం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఈపీడీసీఎల్ రెండోజోన్ కంచరపాలెం సబ్‌స్టేషన్ పరిధిలో ఈ నెల 20న మరమ్మతులు చేపడుతున్నందున విద్యుత్ సరఫరా ఉండదని జోన్-2 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలియజేశారు. సుభాష్‌నగర్ ఫీడర్ పరిధిలో గల సుభాష్ నగర్, ఐటీఐ జంక్షన్, తుమ్మడి పాలెం, దుర్గానగర్ తదితర ప్రాంతాల్లో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

టీడీపీ నేత మృతికి ఎంపీ సంతాపం



ఇసరపు అప్పారావు కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎంపీ శ్రీభరత్

సీతంపేట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): సీతంపేటలో నివాసం ఉంటున్న సీనియర్ టీడీపీ నాయకుడు ఇసరపు అప్పారావు ఈ నెల 13న మృతి చెందారు. ఆయన కుమారుడు 25వ వార్డు టీడీపీ అధ్యక్షుడు ఇసరపు వాసు, కుటుంబ సభ్యులను ఎంపీ శ్రీభరత్, విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ టీడీపీ అధ్యక్షుడు గండి బాబ్జీ, ఇతర నాయకులు గురువారం పరామర్శించారు. ఇసరపు అప్పారావు చిత్రపటానికి నేతలు పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు ఎండీ నజీర్, లొడగల కష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డ్రైవర్ల సంఘం నూతన అడ్‌హక్ కమిటీ నియామకం



నూతన కమిటీ సభ్యులతో సంఘ నాయకులు

మహారాణిపేట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఏపీ ప్రభుత్వ డ్రైవర్ల సంఘం జిల్లా అడ్‌హక్ కమిటీ గురువారం ఏర్పాటైంది. జిల్లా అధ్యక్షుడు దాసరి వెంకట్రావు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో తమ సమస్యల తక్షణ పరిష్కారానికి కృషిచేసేందుకు డి.వెంకట రామారావు, ఎండీ ఉమర్ జాన్, డి.శేషసాయి రాజు, వి.జగదీశ్వరరావు, పిల్లి నాయుడు, కె.రామారావు, రాజు, ప్రకాష్, బాబూరావు, వై.సత్యనారాయణ తదితరులతో కూడిన కమిటీని నియమించినట్లు తెలిపారు. రెండు, మూడు నెలల్లో అధ్యక్ష, కార్యదర్శులను ఎన్నుకుంటామన్నారు. నూతన కార్యవర్గాన్ని సంఘం జాతీయ అధ్యక్షుడు వై.నాగేశ్వరరావు, కార్యదర్శి ఎస్‌వీకే వర్మ, తాతారావు, ప్రసాద్ తదితరులు అభినందించారు.

చెత్త వేస్తే జరిమానా



మహిళలకు అవగాహన కల్పిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

సీతమ్మధార, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): చైతన్యనగర్ నుంచి మద్దిలపాలెం వైపు వెళ్తున్న రహదారిలో జీకాన్ భవనం వద్ద రోడ్డుపై స్థానికులు చెత్త పెద్ద ఎత్తున వేస్తున్నారు. దీంతో ఆ ప్రాంతాన్ని శానటరీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తన సిబ్బందితో కలిసి గురువారం శుభ్రం చేశారు. ఆ ప్రాంతంలో ముగ్గులు వేసి, అక్కడ చిన్న వినాయకుడి బొమ్మ పెట్టారు. అక్కడ చెత్త వేయరాదంటూ స్థానికులకు అవగాహన కల్పించారు. నిర్లక్ష్యంతో ఎవరైనా చెత్త వేస్తే జరిమానా విధిస్తామని, ఇంటింటా చెత్త సేకరణకు వాహనం వచ్చేటప్పుడు తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ సెక్రటరీ, పబ్లిక్ హెల్త్ సిబ్బంది, జీవీఎంసీ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

రహదారులపై ఆక్రమణల తొలగింపు



నరసింహనగర్‌లో క్రేన్‌తో బడ్డీ తొలగిస్తున్న కార్మికులు



చెరుకు రసం బండిని తొలగిస్తున్న దృశ్యం



సీతంపేట ప్రధాన రహదారిపై తొలగిస్తున్న ఆక్రమణలు

అక్కయ్యపాలెం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ సిటీలో భాగంగా జీవీఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు జోన్-5 జోనల్ కమిషనర్ రాము ఆధ్వర్యంలో గ్రేటర్ 45వ వార్డు నరసింహనగర్‌లోని చిల్లర వర్తకుల తోపుడు బళ్లను గురువారం జీవీఎంసీ సిబ్బంది క్రేన్ సాయంతో తొలగించారు. వివిధ సచివాలయాల అడ్మిన్లు, సెక్రటరీలు విచ్చేసి ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన టిఫిన్, కొబ్బరికాయలు, అరటిపళ్లు, చెరుకు రసం విక్రయించే చిరు దుకాణాలు, బడ్డీలను దగ్గరుండి తొలగించారు. రోడ్డుపై ఆక్రమణల తొలగింపుతో విశాలంగా కనిపిస్తోంది.

సీతంపేటలో..

సీతంపేట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): సీతంపేట ప్రధాన రహదారులను ఆక్రమించి ఏర్పాటు చేసిన తోపుడు బండ్లను, ఫుట్‌పాత్‌లపై అక్రమంగా ప్రదర్శించిన బోర్డులు, వ్యాపార నిర్మాణాలను జీవీఎంసీ అధికారులు గురువారం తొలగించారు. జీవీఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు జోన్-3 ఏసీపీ మధుసూదనరావు పర్యవేక్షణలో సీతంపేట ప్రధాన రహదారిలో గురుద్వార కూడలి నుంచి కాంప్లెక్సు వరకు గల ఆక్రమణలను తొలగించారు. దీంతో పాటు శంకరమఠం రోడ్డులో కూడా అక్రమంగా ఏర్పాటు చేసిన బడ్డీలు, తోపుడు బండ్లను తొలగించారు. ద్వారకా పోలీసు స్టేషన్, నాలుగో పట్టణ పోలీసు స్టేషన్ పోలీసు సిబ్బంది సమక్షంలో ఆక్రమణలను తొలగించారు. ఈ కార్యక్రమంలో టీపీఓ ప్రమీల, సచివాలయం ప్లానింగ్ సెక్రటరీలు, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

వీధి విక్రయదారుల చట్టం అమలుకు చిరువ్యాపారుల డిమాండ్

అక్కయ్యపాలెం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 45వ వార్డు నరసింహనగర్ రోడ్డులో వ్యాపారాలు సాగిస్తున్న తమకు వీధి విక్రయదారుల చట్టాన్ని-2014 వెంటనే అమలు చేయాలని చిల్లర వర్తకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ ప్రాంతంలో ఏర్పాటు చేసిన తోపుడు బళ్లను జీవీఎంసీ అధికారులు తొలగించడంపై వర్తకులు గురువారం నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ అనుమతులు లేకుండా కోట్లాది రూపాయల దోపిడీకి పాల్పడుతూ భవనాలు నిర్మించుకుంటున్న బడా బాబుల జోలికి పోలేని జీవీఎంసీ అధికారులు, చిల్లర వర్తకులు, తోపుడు బళ్ల కార్మికులపై తమ ప్రతాపం చూపడం దుర్మార్గమన్నారు. తోపుడు బళ్లవారు, చిల్లర వర్తకుల కడుపులు కొట్టిన జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగాలు రాక స్వయం ఉపాధి పథకం కింద అప్పులు చేసి తోపుడు బళ్లు రోడ్డు పక్కన పెట్టుకుని వ్యాపారాలు చేసుకుని కుటుంబాన్ని పోషించుకుంటూ ఉన్న చిల్లర వర్తక కార్మికుల కడుపు కొట్టే విధంగా, ముందస్తు సమాచారం ఇవ్వకుండా జేసీబీని తీసుకొచ్చి తోపుడు బళ్లు, బడ్డీలను తొలగించడం దుర్మార్గమని మండిపడ్డారు. తమ బడ్డీలు తొలగిస్తున్నారనే ఆవేదనతో సంతోష్ అనే చికెన్ దుకాణం యజమాని బ్లేడుతో ఒంటిని కోసుకున్నాడు. అతన్ని ఆసుపత్రికి తీసుకొని వెళ్లారు.



నిరసన తెలుపుతున్న చిల్లర వర్తకులు

ఉత్సాహంగా విద్యార్థుల స్వాగత కార్యక్రమం



వేడుకలు ప్రారంభిస్తున్న ప్రసన్నకుమార్, ప్రిన్సిపాల్ డా.కె.రత్నకుమార్

కంచరపాలెం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో చదువుతున్న సివిల్ బ్రాంచ్ మొదటి ఏడాది విద్యార్థుల స్వాగత కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. సీనియర్ విద్యార్థులంతా కొత్తవారికి ఘనస్వాగతం పలికారు. సాధించిన ఉత్తమ ఫలితాల అనుభవాలను వారితో పంచుకున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.రత్నకుమార్, సివిల్ విభాగాధిపతి సంధ్యారాణిల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి కళాశాల పూర్వ విద్యార్థి, టిడ్కో మాజీ చైర్మన్ జె.ప్రసన్న కుమార్ హాజరై మాట్లాడారు. డిప్లొమా విద్యార్థులు క్రమ శిక్షణ, పట్టుదలతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. ముఖ్య వక్తలు సివిల్ ఇంజినీరింగ్ ప్రాధాన్యతను వివరించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. విద్యార్థుల సలహాదారు ఎస్.వి.రమణ, విభాగాధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి సంగీత చిత్ర గీతాష్టమి



అక్కినేని సినీ సంగీత చిత్ర గీతాష్టమి పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దెందేటి భూపతిరావు తదితరులు

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): సినీ రంగానికి అక్కినేని నాగేశ్వరరావు అందించిన సేవలు ఎనలేనివని పలువురు కళా రంగ ప్రముఖులు కొనియాడారు. దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత పద్మభూషణ్ అక్కినేని నాగేశ్వరరావు 101వ జయంతి పురస్కరించుకుని ఆల్ ఫ్రెండ్స్ మ్యూజిక్ అసోసియేషన్ సారథ్యంలో 'అక్కినేని సినీ సంగీత చిత్ర గీతాష్టమి 2025' కార్యక్రమాన్ని ఈ నెల 20 నుంచి 27 వరకు నిర్వహిస్తున్నట్టు కార్యక్రమం కన్వీనర్ దెందేటి భూపతిరావు తెలిపారు. గురువారం డాబాగార్డెన్స్‌లో గోడపత్రికను భూపతిరావు, ప్రేమ సమాజం కోశాధికారి ఎంవీవీకే గుప్త ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భూపతిరావు మాట్లాడుతూ ఏడు రోజుల పాటు అక్కినేని పాటలను వివిధ సాంస్కృతిక సంస్థలైన మెలోడి క్రియేటర్స్, శృతిలయ, రసరాగ మాధురి, కళాంజలి, భూషన్‌బ్రదర్స్‌స్వరమాధుర్యం, స్వరార్చన, స్వరాంజలి, వెంకీ రిథమ్స్, పల్లవి మ్యూజిక్, రాగమయి, స్వర్ణ మెలోడిస్, నటరత్న కల్చరల్ ఆధ్వర్యంలో ఘనంగా చేపడుతున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫణిభూషణ్, కృష్ణంరాజు, ఎంవీఆర్ నాగేశ్వరరావు, కడలి, మెలోడీ సత్యనారాయణ పాల్గొన్నారు.

విశాఖలోనే ఈఎస్‌ఐ వైద్య కళాశాల ఏర్పాటు చేయాలి

» సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు డిమాండ్

మహారాణిపేట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఈఎస్‌ఐ వైద్య కళాశాల విశాఖలో కాకుండా అమరావతిలో ఏర్పాటు చేయాలనుకోవడం సరైన విధానం కాదని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు అన్నారు. గురువారం విశాఖలోని సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సంస్థలన్నీ అమరావతిలోనే ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఒత్తిడి తేవడంతో కేంద్రం తలొగ్గి అమరావతిలో ఈఎస్‌ఐ వైద్య కళాశాల ఏర్పాటు చేయాలని నిర్ణయించిందన్నారు. ఈఎస్‌ఐ ఆసుపత్రి నిర్మించిన దగ్గరే వైద్య కళాశాల ఉండాలని, కానీ దానికి భిన్నంగా అమరావతికి బదలాయించటం రాజకీయ నిర్ణయమని తప్పుబట్టారు. ఉత్తరాంధ్రలో 14 లక్షల మంది ఈఎస్‌ఐ సభ్యులు ఉన్నారని, విశాఖలో షీలానగర్ వద్ద ఈఎస్‌ఐ ఆసుపత్రి నిర్మాణం ముగింపు దశలో ఉందని నర్సింగరావు గుర్తుచేశారు. కార్మికులు సైతం అత్యధికంగా ఉన్న విశాఖలో కాకుండా అమరావతిలో ఏర్పాటు చేయడం తగదన్నారు. ఆంధ్రప్రదేశ్ అంటే అమరావతి మాత్రమే కాదని, ఉత్తరాంధ్రను నిర్లక్ష్యం చేస్తే ఉద్యమించాల్సి వస్తుందని హెచ్చరించారు. సమావేశంలో సీఐటీయూ నాయకుడు ఆర్‌కేఎస్‌వీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ ప్రధాన కార్యదర్శి నర్సింగరావు

ప్రతిభను సరిగా వినియోగించుకోవాలి: ఎంపీ



సెయింట్ జోసెఫ్ కళాశాలలో మాట్లాడుతున్న ఎంపీ భరత్

జ్ఞానాపురం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ సాధనకు మాత్రమే చదవకుండా, వ్యక్తిత్వ వికాసానికి, సామాజిక మార్పునకు దోహదపడేలా జ్ఞానాన్ని సముపార్జించాలని విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ విద్యార్థినులకు హితవు పలికారు. గురువారం జ్ఞానాపురంలోని సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలను సందర్శించి అక్కడి విద్యార్థినులతో ముచ్చటించారు. రానున్న రోజుల్లో ఉద్యోగ కల్పన, మహిళల రక్షణ వంటి అంశాలపై విద్యార్థినులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చారు. నేటి యువత తమ ప్రతిభను, శక్తిని సక్రమ దిశగా వినియోగించుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్ డా.సిస్టర్ షైజీ, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌ను తరిమికొడదాం



ప్లకార్డులు చూపుతున్న మహిళా వాకర్స్ క్లబ్ సభ్యులు

మురళీనగర్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉత్తరంలోని 50వవార్డులో గురువారం మహిళా వాకర్స్‌క్లబ్ సభ్యులు ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ విశాఖను హరిత నగరంగా మార్చేందుకు ప్లాస్టిక్ విడనాడాలని పిలుపునిచ్చారు. మురళీనగర్ నివాసిత ప్రాంతంలో గ్రీన్ క్లైమేట్ సంస్థ ఎన్‌జీఓ సంస్థతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ అనర్థాల్ని గుర్తించి ప్రజలంతా స్వచ్ఛందంగా పాలిథిన్ వినియోగాన్ని అరికట్టే విధంగా అలవాట్లు మార్చుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మురళీనగర్ మహిళా వాకర్స్ క్లబ్ ప్రతినిధులు మాధవి, గ్రీన్ క్లైమేట్ ఎన్‌జీఓ ఆర్గనైజేషన్ ప్రతినిధి సరిత, సంస్థ ప్రతినిధులు, మురళీనగర్ ప్రాంత మహిళలు పాల్గొన్నారు. గుడ్డసంచుల్ని ర్యాలీలో ప్రదర్శించి వాటి ప్రయోజనాల్ని తెలియజెప్పారు.

రేపటి నుంచి స్విగ్గీ, జొమాటో రైడర్ల సమ్మె

మహారాణిపేట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 20 నుంచి చేపట్టనున్న సమ్మెను విజయవంతం చేయాలని స్విగ్గీ, జొమాటో రైడర్ల సంఘం నాయకుడు బి.జగన్ పిలుపునిచ్చారు. గురువారం సీఐటీయూ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సమస్యలు పరిష్కారమయ్యేంతవరకు సమ్మె కొనసాగుతుందన్నారు. జిల్లాలో ఏడేళ్లుగా సుమారు 40 వేల మంది గిగ్ వర్కర్లు పనిచేస్తున్నా ఎటువంటి ఉద్యోగ, సామాజిక భద్రత లేదన్నారు. తొలగించిన రైడర్ల ఐడీలను పునరుద్ధరించాలని, కనీస వేతనం, ఒకే రకమైన ఇన్సెంటివ్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైడర్ల సమస్యల పరిష్కారానికి కంపెనీ బాధ్యులుగా ఉండాలని జగన్ కోరారు.

ఆరోగ్య సమాజం కోసం మహిళలకు ముందస్తు చికిత్సలు: డీఆర్ఎం

విశాఖపట్నం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు రైల్వే ఆసుపత్రి వద్ద 'ఆరోగ్యవంతమైన మహిళ.. శక్తివంతమైన కుటుంబం' (స్వస్థ్‌నారి సశక్త్ పరివార్) అభియాన్ గురువారం ప్రారంభమైంది. ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ సంయుక్తంగా చేపట్టిన ఈ ప్రచార కార్యక్రమంలో వాల్తేరు రైల్వే కూడా భాగస్వామ్యమైంది. ప్రజారోగ్యం, సామాజిక సాధికారతపై అవగాహన కల్పించడంలో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి డీఆర్ఎం లలిత్ బొహ్రా, వాల్తేరు రైల్వే మహిళా సంక్షేమ సంఘం (ఈకార్వో) అధ్యక్షురాలు జ్యోత్స్న బొహ్రా ముఖ్య అతిథులుగా హాజరై 'ఆరోగ్యవంతమైన మహిళ.. శక్తివంతమైన కుటుంబం' ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారు. రక్తహీనత, అధిక రక్తపోటు, మధుమేహం వంటి వ్యాధులకు పరీక్షలు నిర్వహించి, ముందస్తు చికిత్స అందించడంపై దృష్టి పెడుతున్నామన్నారు. మహిళలు, బాలికలు, పిల్లల ఆరోగ్య సంరక్షణ, పౌష్టికాహారం సేవలను బలోపేతం చేయడంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్ఎంలు మనోజ్‌కుమార్ సాహు, ఈ.శాంతారామ్, సీఎంఎస్ డాక్టర్ చారుమతి, డాక్టర్ లక్ష్మణరావు, ఈకార్వో ప్రతినిధులు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు. వాల్తేరు డివిజన్ నిర్వహిస్తున్న స్వచ్ఛతా హీ సేవా ప్రచారంలో భాగంగా పరిశుభ్రతను ప్రోత్సహించే కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. అక్టోబరు 2 వరకు వీటిని నిర్వహించనున్నట్లు పునరుద్ఘాటించారు.



మాట్లాడుతున్న డీఆర్ఎం లలిత్ బొహ్రా, చిత్రంలో ఈకార్వో అధ్యక్షురాలు జ్యోత్స్న బొహ్రా, ఏడీఆర్ఎంలు

రబీ సీజన్‌లో రూ.340 కోట్ల రుణాలు

... 5వ పేజీ తరువాయి

వివరించారు. పాయకరావుపేట ప్రాంతంలో తమలపాకు సాగుచేసే రైతులకు ఎకరాకు రూ.లక్ష రుణం అందజేస్తున్నామని వెల్లడించారు. కేవలం నాలుగు శాతం వడ్డీతో ఇచ్చే పంట రుణాలను సకాలంలో చెల్లిస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మొత్తం వడ్డీ మాఫీ చేస్తున్నాయని పేర్కొన్నారు. రైతులకు వ్యవసాయం, సొంత అవసరాల కోసం ఇచ్చే స్వల్పకాలిక రుణాల పరిమితి రూ.ఐదు లక్షల నుంచి రూ.ఆరు లక్షలకు పెంచామన్నారు. దీనిని రూ.10 లక్షలకు పెంచాలని ప్రతిపాదించామని తాతారావు చెప్పారు.

బ్యాంకు వ్యాపార అభివృద్ధిలో భాగంగా బంగారంపై ఇచ్చే రుణాలకు ఆదరణ లభిస్తున్నదన్నారు. తొమ్మిది శాతం వడ్డీకి గ్రాము బంగారంపై రూ.6,500 రుణం మంజూరుచేస్తున్నామన్నారు. బ్యాంకు బ్రాంచిలతోపాటు దాదాపు పది సొసైటీలు బంగారంపై రుణాలు మంజూరుచేస్తున్నాయన్నారు. సొసైటీల్లో మౌలిక వసతుల కల్పనకు రూ.కోటి మంజూరుచేశామని తాతారావు తెలిపారు. జిల్లాలో సొసైటీలకు సొంత భవనాలు లేని గ్రామాల్లో రైతుసేవా కేంద్రాలు కేటాయించాలని కలెక్టర్లను కోరామన్నారు. రైతు సేవా కేంద్రాలు లేనిచోట సొంత భవనాలు నిర్మించేందుకు డీసీసీబీ సాయం చేస్తుందన్నారు.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.మూడు వేల కోట్ల వ్యాపార లక్ష్యం కాగా ఇంతవరకూ రూ.2,700 కోట్లు చేశామన్నారు. స్వయంశక్తి సంఘాలకు రుణాలు ఇవ్వడానికి బ్యాంకు సిద్ధంగా ఉందన్నారు. వాణిజ్య బ్యాంకుల కంటే తక్కువకు అంటే ఏడు శాతం వడ్డీకి డీసీసీబీ రుణాలు అందజేస్తోందన్నారు. ఇంకా రుణానికి సంబంధించి ప్రాసెసింగ్ ఫీజు రూ.4,000 చెల్లించనవసరం లేదన్నారు. అలాగే ఇళ్ల రుణాల పరిమితి పెంచామని, నిర్మాణ వ్యాపారాలకు రుణాలు ఇస్తామన్నారు. రైతులకు ప్రమాద బీమా మొత్తాన్ని పెంచాలనే ప్రతిపాదన బ్యాంకు పరిశీలిస్తోందన్నారు. ప్రస్తుతం ప్రమాదవశాత్తూ రైతు మరణిస్తే రూ.రెండు లక్షలు, సహజ మరణానికి 58 ఏళ్ల కంటే తక్కువ ఉంటే రూ.30 వేలు, పైబడితే రూ.15 వేలు సాయం ఇస్తున్నామన్నారు. అయితే ఏళ్ల తరబడి సొసైటీతో కలిసి ప్రయాణించే రైతు మరణిస్తే తగిన సాయం అందించాలన్న యోచనతో రైతు, సొసైటీ, బ్యాంకు, ఆప్కాబ్ కలిసి ప్రీమియం చెల్లించేలా ఒక ప్రతిపాదన రూపొందించామని తాతారావు చెప్పారు.

టీటీడీ లోకల్ అడ్వయిజరీ కమిటీ అధ్యక్షునిగా పట్టాభి

... 5వ పేజీ తరువాయి

గుర్తుచేశారు. అలాగే కైలాసగిరిపై వెంటేశ్వరస్వామి దేవాలయం నిర్మించాలని సీఎం చంద్రబాబునాయుడును అప్పట్లో కోరగా, రుషికొండలో దేవాలయం నిర్మాణానికిభూమి కేటాయించారన్నారు. తనకు లోకల్ అడ్వైజరీ విశాఖపట్నం అధ్యక్షునిగా నియమించిన సీఎంకు పట్టాభి ధన్యవాదాలు తెలిపారు. ఆయన గతంలో జీవీఎంసీ కార్పొరేటర్‌గా, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా సేవలు అందించారు.

ప్రైవేటు సేవలో క్లాప్ వాహనాలు

... 5వ పేజీ తరువాయి

అక్కడకు వెళ్లారు. సిబ్బందిని పిలిచి ఏ వార్డు సచివాలయ పరిధిలో తిరిగే వాహనమని ప్రశ్నించారు. ఇళ్లకు వెళ్లి చెత్త సేకరించడం మానేసి, ప్రైవేటు ఫంక్షన్‌లో చెత్తను తరలించాల్సిన అవసరం ఏమొచ్చిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. క్లాప్ వాహనాల సిబ్బంది కొందరు ఇలా చేస్తున్నారని ఆయన వెంట ఉన్న అధికారి ఒకరు చెప్పడంతో ఇకపై పర్యవేక్షించే బాధ్యతను వార్డు శానిటేషన్ కార్యదర్శులకు అప్పగించాలని అధికారులను ఆదేశించారు.

శానిటేషన్ సెక్రటరీలకు వాహనాల పర్యవేక్షణ బాధ్యత

కొందరు క్లాప్ వాహనాల సిబ్బంది సరిగా విధులు నిర్వర్తించకపోవడంతో పర్యవేక్షణ బాధ్యతను వార్డు శానిటేషన్ కార్యదర్శులకు అప్పగించాం. ప్రతీరోజూ ఉదయం ఆరు గంటలకు వార్డు సచివాలయానికి వెళ్లి కార్యదర్శులు హాజరువేసుకోవాలి. తర్వాత ఏదో ఒక వాహనం వెంట వెళ్లి ఇంటింటికీ చెత్త సేకరణ ఎలా జరుగుతుందనేని స్వయంగా పరిశీలించాలి. దీనికి సంబంధించిన ఫొటోలను కూడా అధికారుల గ్రూపులో అప్‌లోడ్ చేయాలని ఆదేశించాం. దీనివల్ల నగరంలో క్లాప్ వాహనాలు పక్కాగా చెత్త సేకరణ జరుపుతాయి. తద్వారా నగరంలో పారిశుధ్యం మెరుగుపడుతుంది. **జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్**

ఆక్రమణలకు అడ్డుకట్ట

... 5వ పేజీ తరువాయి

జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ క్షేత్రస్థాయి పర్యటనలకు వెళ్లినప్పుడు గమనించారు. నగరంలో ఎక్కడికక్కడ వెండింగ్ జోన్స్ ఏర్పాటుచేసి, వ్యాపారులను అక్కడకు తరలించడం వల్ల సమస్యను పరిష్కరించవచ్చునని గుర్తించారు. నగరంలో రోడ్లు, ఫుట్‌పాత్‌లు ఆక్రమించి వ్యాపారాలు చేసుకుంటున్న వారిని గుర్తించే బాధ్యతను టౌన్‌ప్లానింగ్ విభాగంలో పనిచేసే వార్డు ప్లానింగ్ సెక్రటరీలకు అప్పగించారు. సర్వే దాదాపు చివరి దశకు చేరుకున్నట్టు సమాచారం. ఆక్రమణలను తొలగించినా వారి జీవనోపాధికి ఇబ్బంది లేకుండా ఉండేందుకు వెండింగ్‌జోన్‌లు ఏర్పాటుకు అనువైన స్థలాలను గుర్తించే పనిలో జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు ఉన్నారు. ప్రస్తుతానికి 98 వార్డుల పరిధిలో 112 చోట్ల వెండింగ్ జోన్‌ల ఏర్పాటుకు స్థలాలను గుర్తించారు. ఆయా చోట్లకు ఆక్రమణదారులను తరలిస్తే రోడ్లన్నీ విశాలంగా మారి వాహనాల రాకపోకలు సజావుగా సాగడంతోపాటు ప్రమాదాలకు అడ్డుకట్టపడుతుందన్నది కమిషనర్ భావన. దీనికోసం పోలీస్ అధికారులతో పలుమార్లు సమావేశమై ఆక్రమణల తొలగింపునకు సహకరించాలని కోరడంతో సీపీ బాగ్చి అంగీకరించారు.

ఆక్రమణల తొలగింపునకు శ్రీకారం

నగరంలో రోడ్లు, ఫుట్‌పాత్‌ల ఆక్రమణలపై జీవీఎంసీ అధికారులు 'ఆపరేషన్ లంగ్స్' పేరుతో గురువారం స్పెషల్‌డ్రైవ్ నిర్వహించారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)తో పాటు ప్రతి శుక్రవారం నిర్వహించే టౌన్‌ప్లానింగ్ గ్రీవెన్స్ కార్యక్రమానికి రోడ్లు, ఫుట్‌పాత్‌లు, పార్కుల ఆక్రమణలకు సంబంధించిన ఫిర్యాదులు అధికంగా వస్తుండడంతో వాటిపై చర్యలకు కమిషనర్ కేతన్‌గార్గ్ టౌన్‌ప్లానింగ్ అధికారులకు ఆదేశాలు జారీచేశారు. ఇకపై నిరంతరం ఆక్రమణల తొలగింపు కొనసాగేలా కార్యాచరణ రూపొందించి గురువారం నుంచి అమలు చేయాలని ఆదేశించారు. అందులో భాగంగా పోలీసుల సహకారంతో జీవీఎంసీ పరిధిలోని ఎనిమిది జోన్లలో రోడ్లు, ఫుట్‌పాత్‌లు, పార్కుల్లో 524 ఆక్రమణలను తొలగించారు. తగరపువలస మెయిన్‌రోడ్డులో 20, తగరపువలస-భీమిలి రోడ్డులో 20, మధురవాడ వుడా మిథిలాపురి కాలనీలో 52, గురుద్వారా జంక్షన్‌లో 42, డైమండ్ పార్క్ నుంచి శాంతిపురం జంక్షన్‌కు వెళ్లే రహదారిలో 42, సిరిపురం జంక్షన్ నుంచి జగదాంబ జంక్షన్‌కు వెళ్లే మార్గంలో 60, నరసింహనగర్ జంక్షన్ నుంచి డీఎల్‌బీ గ్రౌండ్ వరకు 46, పాతగాజువాక మెయిన్‌రోడ్డులో 53, ఎన్‌ఏడీ కొత్తరోడ్డు నుంచి గోపాలపట్నం పెట్రోల్‌బంకు వరకు 45, విమాన్‌నగర్ జంక్షన్‌లో 22, అనకాపల్లి నెహ్రూచౌక్ వద్ద 42, వంటిల్లు జంక్షన్‌లో 33 ఆక్రమణలను తొలగించారు.

పేదల ఆకలి తీరుస్తున్న అన్న క్యాంటీన్లు

... 5వ పేజీ తరువాయి

ప్రాంతీయ కంటి ఆస్పత్రి, టర్నర్‌చౌల్ట్రీ, కేజీహెచ్ ఓపీ గేటు పక్కన, వన్‌టౌన్‌లోని జనతాబజార్, తాటిచెట్లపాలెం వైఎస్ఆర్ నగర్, మర్రిపాలెం, నక్కవానిపాలెం ఆర్టీసీ డిపో, శ్రీహరిపురం కోరమాండల్ గేట్, ఆటోనగర్, గాజువాక వంటిల్లు జంక్షన్, నమ్మిదొడ్డి, అనకాపల్లి ఎన్‌టీఆర్ ఆస్పత్రి, భీమునిగుమ్మం రైల్వేస్టేషన్, బాజీ జంక్షన్, పెందుర్తి, వేపగుంట, గోపాలపట్నం రైతుబజార్ పాంతాల్లో అన్న క్యాంటీన్లను ప్రారంభించారు. క్యాంటీన్‌లకు ఆహారం తయారు చేయడంతోపాటు సరఫరాచేసే బాధ్యతను అక్షయపాత్రకు అప్పగించింది. కంచరపాలెంలోని హరేకృష్ణ మూవ్‌మెంట్ ఛారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అక్షయపాత్ర సెంట్రల్ కిచెన్‌లో వంటకాలను తయారుచేసి వాహనాల్లో అన్న క్యాంటీన్లకు సరఫరా చేస్తున్నారు. మంచి రుచి, నాణ్యత కలిగి వుండడంతో నిరుపేదలు, కూలీలే కాకుండా ఆటోడ్రైవర్లు, చిరువ్యాపారులు కూడా భోజనం కోసం వీటినే ఆశ్రయిస్తున్నారు. దీంతో క్యాంటీన్లకు రోజురోజుకీ ఆదరణ పెరుగుతోంది.

అల్పాహారం కింద ప్రతిరోజూ మూడు ఇడ్లీలు, 150 మిల్లీలీటర్ల సాంబార్, 150 గ్రాములు చట్నీ ఇస్తున్నారు. ప్రత్యామ్నాయంగా సోమవారం, గురువారాల్లో మూడు పూరీ, వంద గ్రాముల కర్రీ, మంగళ, శుక్రవారాల్లో 250 గ్రాముల ఉప్మా, మిక్చర్, సాంబార్, బుధ, శనివారాల్లో హాట్ పొంగల్, సాంబార్, మిక్చర్‌ను అందుబాటులో ఉంచుతున్నారు. మధ్యాహ్నం, రాత్రిపూట భోజనం కింద సోమవారం నుంచి శనివారం వరకూ 400 గ్రాముల అన్నం, 120 గ్రాముల పప్పు లేదా సాంబార్, 100 గ్రాముల కూర, 75 గ్రాముల పెరుగు, పచ్చడి అందజేస్తున్నారు. అన్న క్యాంటీన్‌లకు ఆదివారం సెలవు. మిగిలిన రోజుల్లో ఉదయం ఏడున్నర నుంచి పది గంటల వరకూ అల్పాహారం, మధ్యాహ్నం 12.30 నుంచి మూడు గంటల వరకూ భోజనం, రాత్రి ఏడున్నర నుంచి తొమ్మిది గంటల వరకూ భోజనం అందుబాటులో ఉంచుతున్నారు. గత ఏడాదికాలంలో ప్రతీరోజూ సగటున 23,843 మంది చొప్పున ఏడాదిలో మొత్తం 74,62,824 మంది అన్న క్యాంటీన్‌లలో ఆకలి తీర్చుకున్నారు. 28,76,030 మంది అల్పాహారం, 29,22,631 మంది మధ్యాహ్న భోజనం, 16,64,163 మంది రాత్రివేళ భోజనం చేసినట్టు యూసీడీ పీడీ సత్యవేణి తెలిపారు.



ప్రసాదుల శ్రీనివాసరావును సత్కరించి మొక్కను అందజేస్తున్న టీడీపీ నాయకులు

ఏపీఐఐసీ డైరెక్టర్ శ్రీనివాసరావుకు సత్కారం

అక్కిరెడ్డిపాలెం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఏపీఐఐసీ డైరెక్టర్‌గా నియమితులైన టీడీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాసరావును గురువారం 68వ వార్డుకు చెందిన 'దేశం' నాయకులు, పంచవటి వుడాకాలనీ నాయకులు ఘనంగా సత్కరించారు. గాజువాకలోని టీడీపీ కార్యాలయంలో ఆయనను కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రసాదుల శ్రీనివాసరావు మాట్లాడుతూ పార్టీ అభివృద్ధితో పాటు ప్రజా సంక్షేమానికి కృషి చేసే ప్రతి కార్యకర్తకు టీడీపీలో తప్పనిసరిగా మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సర్వసిద్ధి అనంతలక్ష్మి, డొప్ప అప్పలరాజు, గండికోట తాతారావు, ఎస్.చంటి, పంచవటి కాలనీ ప్రతినిధులు ప్రగడ చిన్నారావు, మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

'విజ్ఞాన్'కు బెస్ట్ పెర్ఫార్మింగ్ ఇనిస్టిట్యూట్ అవార్డు



అవార్డు అందుకుంటున్న ప్రిన్సిపాల్ సుధాకర్

అగనంపూడి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): దువ్వాడ విజ్ఞాన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషనల్ టెక్నాలజీ కళాశాలకు ప్రతిష్ఠాత్మకమైన బెస్ట్ పెర్ఫార్మింగ్ ఇనిస్టిట్యూట్ అవార్డు లభించింది. సిమ్లాలో గురువారం జరిగిన నెక్స్ జెన్ కాంక్లేవ్-2025లో ఈ అవార్డును విజ్ఞాన్ ప్రిన్సిపాల్ సుధాకర్‌కు అందజేశారు. అలాగే ప్రిన్సిపాల్ ఎక్సలెన్స్ అవార్డు, డీన్ ఎక్సలెన్స్ అవార్డులు తమకు లభించాయని కళాశాల యాజమాన్యం తెలిపింది.

స్వచ్ఛోత్సవ ర్యాలీ

కూర్మన్నపాలెం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పరిశుభ్రత ఆరోగ్యానికి భద్రత-పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అంటూ 87వ వార్డు పరిధి కణితి, తిరుమలనగర్‌లలో గురువారం స్వచ్ఛతోత్సవ్ ర్యాలీ నిర్వహించారు. ఇళ్ల పరిసరాల్లో నీటి నిల్వలు ఉండకుండా చూసుకోవాలని, బహిరంగ ప్రదేశాల్లో, కాలువల్లో చెత్తా చెదారాలు వేయవద్దని, అందరూ మొక్కలు నాటాలని, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు బదులుగా స్టీల్ బాక్సులు, క్లాత్ సంచులను వాడాలని, భూగర్భ జలాల పెంపు కోసం ఇళ్ల వద్ద ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవాలని కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. కార్యక్రమంలో జీవీఎంసీ సిబ్బంది, దేముడు, మూర్తి, తిరుమలనగర్ కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు విశ్వేశ్వరరావు, పరమానందం, పరమేశ్వరరావు, సన్యాసిరావు, రాము, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **మిరాయి** : జగదాంబ, మెలోడి, శరత్, కామేశ్వరి, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం) అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **కిష్కింధపురి** : లీలామహల్, సంగం, శ్రీరామా, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), మినీ మోహిని (గాజువాక),
- **అర్జున్ చక్రవర్తి** : రమాదేవి,
- **మదరాసి** : శ్రీకన్య
- **ఘాటీ** : కిన్నెర, వెంకటేశ్వర-2, గోకుల్, ముక్తాస్, మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక) లిఖిత (శ్రీహరిపురం)
- **పరదా** : , శ్రీకన్య-2 (గాజువాక)
- **కూలీ** :వెంకటేశ్వర-1, అరుణ (పెదగంట్యాడ),
- **మహావతార్ నరసింహ** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా),

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 12, టమాటా 25, వంకాయలు (తెలుపు) 38, వంకాయలు (నలుపు) 42, బెండకాయలు 24, పచ్చిమిర్చి 38, కాకరకాయలు 34, బీరకాయలు 36, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 18, క్యారెట్ 44, దొండకాయలు 34, బంగాళ దుంపలు 19, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 40, అల్లం (పాతది) 70, బరబాటి 32, ముల్లంగి 36, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 50, దోస కాయలు 26, వెల్లుల్లి (పెద్దవి) 70, కొబ్బరికాయ (పెద్దది) 35, బీన్స్ (పెన్సిల్) 54, కీరదోస 32, కాప్సికమ్ 58, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 30, చిలగడదుంపలు 34, కంద 40, దేముడు చిక్కుడు 66, గోరు చిక్కుడు 30, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాల కూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 80, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్)
(వంద - రూ.లలో)

విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

చికెన్ ధరలు
బ్యాగ్

రైతు ధర	130
లైవ్ ధర	150
విత్ స్కిన్	270
స్కిన్‌లెస్	280



గాజువాకలోని ఓ తయారీ కేంద్రంలో రూపుదిద్దుకున్న దుర్గాదేవి ప్రతిమలు

దసరా ఉత్సవాలకు దుర్గమ్మలు సిద్ధం

గాజువాక, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక ప్రాంతంలో దసరా నవరాత్రి ఉత్సవాలను ఘనంగా జరిపేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు గాజువాకలో పలుచోట్ల కనకదుర్గమ్మ విగ్రహాలను జోరుగా తయారు చేస్తున్నారు. గత ఆరేడు నెలలుగా కోల్‌కతా, పశ్చిమ బెంగాల్ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు అమ్మవార్ల విగ్రహాల తయారీలో నిమగ్నమయ్యారు. విగ్రహాల తయారీకి వినియోగించే సామగ్రి ఖర్చు పెరిగినందున అమ్మవార్ల ప్రతిమల ధరలు కూడా పెరిగాయి. విగ్రహాల సైజును బట్టి ధరలను నిర్ణయిస్తున్నారు. దసరా ఉత్సవాలకు ముందు తొమ్మిది రోజులు, అలాగే దసరా పండుగ రోజు తరువాత నవరాత్రి ఉత్సవాలను నిర్వహించనున్నారు. ఇప్పటికే అనేక విగ్రహాలను పూజలకు సిద్ధం చేసినట్టు పలువురు తయారీదారులు పేర్కొంటున్నారు.

ఉక్కు పోరాట కమిటీ కన్వీనర్ కేఎస్ఎన్ రావు రాజీనామా

» పదవికే తప్పా

పోరాటాలకు కాదని స్పష్టీకరణ



కేఎస్ఎన్ రావు

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంట్ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ కన్వీనర్ కేఎస్ఎన్ రావు గురువారం తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు పోరాట కమిటీ చైర్మన్‌కు లేఖ అందజేశారు. పోరాట కమిటీ ఏర్పడ్డాక కేఎస్ఎన్ రావు కన్వీనర్‌గా వ్యవహరిస్తున్నారు. గతంలో సీఐటీయూ గుర్తింపు యూనియన్‌గా ఉన్నప్పుడు అయోధ్యరాం కన్వీనర్‌గా బాధ్యతలు నిర్వహించారు. కొంతమంది ప్లాంటులో పదవీ విరమణ చేసిన సభ్యులు తమపై అవమానకరమైన వాఖ్యలు చేస్తుండడం, సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిగత విమర్శలు చేస్తుండడంతో తన పదవికి రాజీనామా చేస్తున్నట్టు పేర్కొన్నారు. కేవలం పదవికి మాత్రమే రాజీనామా అని.. పోరాటాలకు కాదని, ప్లాంట్ పరిరక్షణ కోసం ఎలాంటి పోరాటాలకైనా తాను సిద్ధమని స్పష్టం చేశారు. ఇదిలావుండగా కేఎస్ఎన్ రావు కన్వీనర్ పదవికి రాజీనామా వెనక రాజకీయ కారణాలు ఏమైనా ఉన్నాయా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం పోరాట కమిటీలో చైర్మన్లుగా ఉన్న డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్‌లు స్టీల్ ప్లాంట్ పదవీ విరమణ ఉద్యోగులు కాగా సీహెచ్ నరసింగరావు సీఐటీయూ నేతగా ఉన్నారు.

స్టీల్ సిటీ ఆర్టీసీ డిపోను తరలించకుండా కూటమి నేతలు చూడాలి

» ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు

పలిశెట్టి దామోదరరావు



కార్యక్రమంలో మాట్లాడుతున్న పలిశెట్టి దామోదరరావు

కూర్మన్నపాలెం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కూర్మన్నపాలెంలోని స్టీల్ సిటీ ఆర్టీసీ డిపోను ఖాళీ చేయించకుండా కూటమి నేతలు చూడాలని ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు కోరారు. గురువారం స్టీల్ సిటీ డిపోలో నిర్వహించిన జిల్లా నిర్మాణ మహాసభలో ఆయన మాట్లాడుతూ కూర్మన్నపాలెం డిపోకు 33 ఏళ్ల లీజును పొడిగించేందుకు స్టీల్ ప్లాంట్ యాజమాన్యం రూ.133 కోట్లు డిపాజిట్ చేయాలని ఒత్తిడి చేస్తుందని, ఈ బాధ్యతను కూటమి నాయకులు తీసుకుని సమస్య పరిష్కారానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశామన్నారు. ఈయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవీ నరసయ్య మాట్లాడుతూ నగర బస్సు రవాణాకు స్టీల్ సిటీ డిపో ఎంతో కీలకమన్నారు. ఈ డిపో తరలించకుండా కేంద్ర ఉక్కుశాఖ మంత్రులు, సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో పాటు ఉత్తరాంధ్రకు చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఈయూ నాయకులు కె.శ్రీనివాసరావు, కేఎస్ఎన్ మూర్తి, పి.భానుమూర్తి, నందమూరి రామారావు, కేజే శుభాకర్, బి.కృష్ణమూర్తి, కేఎస్ ప్రకాశ్, బి.రాముస్వామి, కె.సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

ఆటోనగర్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వీఎస్ఈజడ్, రాజీవ్ నగర్, భరత్ నగర్, కూర్మన్నపాలెం సబ్ స్టేషన్ల పరిధిలో ఈ నెల 20వ తేదీన నిర్వహణ పనులు చేపడుతున్నందున ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని ఈపీడీసీఎల్ జోన్-2 ఈఈ బీకే నాయుడు తెలిపారు. ఈ కారణంగా రాజీవ్‌నగర్, రాసాలమ్మ కాలనీ, వుడా ఫేజ్-1,3,7, మాతృశ్రీనగర్, దువ్వాడ స్టేషన్ రోడ్డు, వీఎస్ఈజడ్ పరిశ్రమల ప్రాంతం, భరత్ నగర్, ముప్తపా జంక్షన్, శ్రీకృష్ణానగర్, ఐటీ రోడ్డు ఏరియాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. అలాగే చినగంట్యాడ సబ్ స్టేషన్ పరిధిలో నిర్వహణ పనులు చేపడుతున్నందున 20వ తేదీ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఆయన తెలిపారు. ఈ కారణంగా గాజువాక సీఎంఆర్ సెంట్రల్ ఏరియా, చైతన్య నగర్, ఎస్‌బీటీ హోటల్ ఏరియాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

అక్కిరెడ్డిపాలెం: బీహెచ్‌పీవీ సబ్ స్టేషన్ పరిధిలోని గుడివాడ అప్పన్న కాలనీ 11కేవీ ఫీడర్‌లో నిర్వహణ పనులు చేపట్టనున్నందున ఈ నెల 20వ తేదీ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు జోన్-2 ఈఈ బీకే నాయుడు తెలిపారు. ఈ కారణంగా గుడివాడ అప్పన్నకాలనీ, రామాలయం వీధి, షరాబ్ వీధి ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఈ విషయాన్ని ప్రజలందరూ గమనించి తమకు సహకరించవలసిందిగా కోరారు.

కాలుష్య కారక గొడౌన్ల ఏర్పాటును అడ్డుకోవాలి

అక్కిరెడ్డిపాలెం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 68వ వార్డు పరిధిలోని మింది, అక్కిరెడ్డిపాలెం కాలనీలకు ఆనుకుని ఉన్న పోర్టు స్థలంలో కాలుష్య కారక గొడౌన్ల ఏర్పాటును నిరోధించాలని కోరుతూ గురువారం నగరంలో ఎంపీ శ్రీభరత్‌కు జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు వినతిపత్రాన్ని అందజేశారు. అక్కిరెడ్డిపాలెం, పంచవటి కాలనీ, మింది కాలనీలకు ఆనుకుని ఉన్న పోర్టు స్థలాన్ని బీపీసీఎల్ వంటి కొన్ని కంపెనీల గొడౌన్లకు కేటాయించడం వల్ల తాము తీవ్ర కాలుష్య సమస్యతో అల్లాడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీని కలిసిన వారిలో కమిటీ సభ్యులు ప్రగడ చిన్నారావు, సర్వసిద్ధి అనంతలక్ష్మి, మురళీకృష్ణ, యువశ్రీ, శిరీష, తదితరులు ఉన్నారు.



ఎంపీ శ్రీభరత్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

పలు చోట్ల స్వస్థ్ నారీ సశక్త్ శిబిరాలు



మహిళలకు సూచనలిస్తున్న వైద్య సిబ్బంది

గోపాలపట్నం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రంలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా గైనకాలజీ, ఈఎన్‌టీ, డెంటల్, డెర్మటాలజీ, పిడియాట్రిక్, వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్య శిబిరంలో 270 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం వారికి మందులు పంపిణీ చేశారు.

స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ ప్రారంభం

పెందుర్తి రూరల్, (ఆంధ్రజ్యోతి): మహిళల సంపూర్ణ ఆరోగ్యం కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని గురువారం 95వ వార్డు పురుషోత్తపురం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా జనసేన సీనియర్ నాయకుడు, పెందుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఉరిటి లక్ష్మీగోవింద్ ముఖ్య అతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు సహకారంతో ఆస్పత్రిలో సౌకర్యాల మెరుగుపరచడానికి కృషి చేస్తానని అన్నారు. ప్రధాన వైద్యాధికారి అందించే వైద్య సేవల గురించి వివరించారు. అనంతరం మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత అధ్యక్షుడు శ్రీనుయాదవ్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ములగాడలో గంజాయి బ్యాచ్ హల్‌చల్

» ఒంటరిగా వెళ్లేవారి పై దాడులు



గ్రామస్థులతో మాట్లాడుతున్న గాజువాక సీఐ పార్థసారథి

మల్కాపురం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ములగాడ గ్రామంలో గంజాయి బ్యాచ్ హల్‌చల్ చేస్తోంది. ఏ క్షణం ఏం జరుగుతుందోనని గ్రామస్థులు భయ పడుతున్నారు. కొంత మంది గుర్తు తెలియని వ్యక్తులు గుంపులుగా చేరి మద్యం, గంజాయి సేవించి రోడ్డు మీద ఒంటరిగా వెళ్లేవారిపై దాడి చేస్తున్నారు. పోయిన నెలలో ఇలాగే డబ్బుల కోసం ఒకరిని హత్య చేశారు. ముఖ్యంగా ఈ గంజాయి బ్యాచ్‌కు ఇక్కడున్న టిడ్కో ఇళ్లు అడ్డాగా మారాయని స్థానికులు అంటున్నారు. గంజాయి బ్యాచ్ దాడుల గురించి గ్రామస్థులను ఓ స్వచ్ఛంద సంస్థ అప్రమత్తం చేసి నగర పోలీస్ కమిషనర్‌కు కూడా ఫిర్యాదు చేశారు.

పోలీసుల పర్యటన

ములగాడ గ్రామాన్ని గాజువాక స్టేషన్ సీఐ పార్థసారథి బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా గంజాయి బ్యాచ్ వివరాలు తెలిస్తే తమకు తెలియజేయాలని సూచించారు. గంజాయి బ్యాచ్ వివరాలు తెలిసిన అనంతరం తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ శాంతి భద్రతలను కాపాడడమే ధ్యేయంగా కృషి చేస్తున్నామని తెలిపారు.

రహదారులపై ఆక్రమణల తొలగింపు

» హాకర్స్ జోన్ ఏర్పాటు చేయాలని చిరు వర్తకుల డిమాండ్



గోపాలపట్నం బంక్ కూడలిలో ఆక్రమణలను తొలగిస్తున్న అధికారులు



ఎన్ఎస్‌టీఎల్ కూడలిలో ఆక్రమణలను తొలగిస్తున్న జడ్సీ హెచ్.శంకరరావు, టౌన్‌ప్లానింగ్ అధికారులు

గోపాలపట్నం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రధాన రహదారిలోని ఫుట్‌పాత్‌పై ఆక్రమణలను జీవీఎంసీ, ట్రాఫిక్ పోలీసులు సంయుక్తంగా తొలగింపు చర్యలు గురువారం చేపట్టారు. ముఖ్యంగా గోపాలపట్నం కూడలి నుంచి బంక్ కూడలి వరకూ ప్రధాన రహదారిలో ఫుట్‌పాత్‌లను ఆక్రమించి దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. ఈ దుకాణాలకు వచ్చే వినియోగదారులు తమ వాహనాలను రహదారిపై పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్ సమస్యలు పెరుగుతున్నాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో అయితే ట్రాఫిక్ సమస్య మరింతి ఎక్కువగా ఉంటోంది. దీంతో ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపుపై జీవీఎంసీ అధికారులు, పోలీసు అధికారులు దృష్టి సారించి స్పెషల్ డ్రైవ్ నిర్వహించి ఆక్రమణలను తొలగించారు.

హాకర్స్ జోన్ ఏర్పాటు చేయాలి

గోపాలపట్నం ప్రధాన రహదారిలో సుమారు 40 మంది చిరువర్తకులు వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. తమకోసం హాకర్స్ జోన్ ఏర్పాటు చేయాలంటూ రెండు దశాబ్దాలుగా వర్తకులు కోరుతున్నారు. కానీ అధికారులు, నేతలు పట్టించుకోవడం లేదని వారు వాపోయారు. అధికారులు ఇప్పటికైన స్పందించి ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న ప్రభుత్వ స్థలాలను పరిశీలించి హాకర్స్ జోన్ ఏర్పాటు చేయాలని చిరు వర్తకులు కోరుతున్నారు.

ఎన్ఎస్‌టీఎల్‌లో స్పెషల్ డ్రైవ్

ఎన్.ఎ.డి.జంక్షన్,(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 90వ వార్డు ఎన్ఏడీ, ఎన్ఎస్‌టీఎల్ పరిసరాల్లో ఫుట్‌పాత్‌లు ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్న దుకాణాలను గురువారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించి తొలగించారు. దీనిలో భాగంగా ఎన్ఎస్‌టీఎల్ నుంచి గోపాలపట్నం వెళ్లే డబల్ రోడ్డు, ఎన్ఏడీ జంక్షన్, బుచ్చిరాజుపాలెం పరిసరాల్లో తోపుడుబళ్లు, ఇతర వ్యాపారాలు చేసేవారికి హెచ్చరికలు జారీ చేసి అక్కడి నుంచి పంపించారు. కార్యక్రమంలో జడ్సీ హెచ్.శంకరరావు, ఏసీపీ రామలింగేశ్వరరెడ్డి, వెస్ట్ ట్రాఫిక్ సీఐ కె.సురేశ్, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

టీఎన్‌టీయూసీ బలోపేతానికి కృషి చేయండి

» కార్మిక సంఘం ప్రతినిధులు

మల్కాపురం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): షిప్‌యార్డులోని టీఎన్‌టీయూసీ కార్మిక సంఘం బలోపేతానికి ప్రతి ఒక్క కార్మికుడు కృషి చేయాలని టీఎన్‌టీయూసీ ప్రతినిధులు పిలుపునిచ్చారు. షిప్‌యార్డులోని గురువారం జరిగిన యూనియన్ సర్వసభ సమావేశంలో వారు మాట్లాడుతూ టీఎన్‌టీయూసీ కార్మికుల పక్షాన ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా ఎం.రాము (ప్లాంట్ నిర్వాహణ) ఎస్.శ్రీను, ఫరీద్ (కాలనీ నిర్వాహణ), వెంకట్రావు (ఎస్ఆర్‌పీ), బి.శివ, హరి (సెక్యూరిటీ అండ్ ఫైర్ సర్వీస్) లను టీఎన్‌టీయూసీ కండువా కప్పి యూనియన్‌లోకి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా యూనియన్ అభివృద్ధికి కృషి చేస్తామని వారు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

రెండు రోజులపాటు 'దస్తావేజు లేఖర్ల పెన్‌డౌన్'

పెందుర్తి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కార్డు ప్రైమ్ 2.0 వల్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఏర్పడుతున్న సాంకేతిక సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం, శనివారం 'దస్తావేజు లేఖర్ల పెన్‌డౌన్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు పెందుర్తి దస్తావేజు సంఘం అధ్యక్షుడు పితాని నాగరాజు, రాష్ట్ర దస్తావేజు సంఘం ఉపాధ్యక్షుడు, సంయుక్త కార్యదర్శి బలగ చిన్నారావు, పెంటకోట శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ కార్డు ప్రైమ్ 2.0 సాఫ్ట్‌వేర్‌లో సాంకేతిక సమస్యల వల్లే ఈ పెన్ డౌన్ కార్యక్రమాన్ని చేపట్టినట్టు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా దస్తావేజు లేఖర్లు వారి పరిధిలోని సబ్ రిజిస్ట్రేషన్ కార్యాయాల వద్ద ఈ కార్యక్రమాన్ని చేపట్టి జయప్రదం చేయాలని సంఘం రాష్ట్ర నేతలు బలగ చిన్నారావు, పెంటకోట శ్రీనివాసరావు కోరారు.



గుంటూరు వెళ్లేందుకు వీవీవీ స్కూల్‌కు చేరుకున్న డీఎస్సీకి ఎంపికైన అభ్యర్థులు

డీఎస్సీకి ఎంపికైన అభ్యర్థుల గుంటూరు పర్యటన వాయిదా

ఇంటి ముఖం పట్టిన అభ్యర్థులు

గాజువాక, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల కారణంగా గుంటూరులో శుక్రవారం జరగవలసిన మెగా డీఎస్సీ నియామక పత్రాల పంపిణీ కార్యక్రమం వాయిదా పడింది. డీఎస్సీకి ఎంపికైన ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన అభ్యర్థులందరూ గురువారం ఉదయం స్టీల్ ప్లాంట్ వీవీవీ స్కూల్‌కు చేరుకున్నారు. ఉదయం ఆరు గంటల నుంచే ఇక్కడ రిజిస్ట్రేషన్ ప్రక్రియను అధికారులు ప్రారంభించారు. అభ్యర్థులతో పాటు వారి సహాయకులు ఇక్కడకు రావడంతో సందడి వాతావరణం నెలకొంది. వీరిని గుంటూరు తీసుకువెళ్లేందుకు గాను 75 ఆర్టీసీ బస్సులను కూడా సిద్ధం చేశారు. అయితే ఉదయం 11 గంటల సమయంలో గుంటూరులో భారీ వర్షాలు కురుస్తున్నందున డీఎస్సీ అభ్యర్థులకు పత్రాల పంపిణీని వాయిదా వేసినట్టు సమాచారం అందింది. దీంతో అభ్యర్థులందరూ తమ ఇళ్లకు వెళ్లిపోయారు.

వైభవంగా కుంచుమాంబ, దుర్గమాంబ పండుగ

అక్కిరెడ్డిపాలెం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 68వ వార్డు పరిధిలోని అక్కిరెడ్డిపాలెం, పరిసర ప్రాంతాల ప్రజల ఆరాధ్య దేవతలైన కుంచుమాంబ, దుర్గమాంబ అమ్మవార్ల పండుగను గురువారం వైభవంగా నిర్వహించారు. ఇక్కడి హైస్కూల్ మైదానంలో ఉన్న ఆలయానికి ఉదయం నుంచే పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవార్లకు పసుపు కుంకుమలతో పాటు చీరలు, ఇతర మొక్కులు చెల్లించి పూజలు జరిపారు. సాయంత్రం మేళతాళాలు, వేషాలు, కోలాటాల నడుమ భక్తులు అమ్మవారి ఘటాలను పురవీధుల్లో ఊరేగించాక ఆలయం వద్ద ప్రతిష్ఠించి పూజలు చేశారు. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

శరన్నవరాత్రి ఉత్సవాలకు పందిరిరాట

అగనంపూడి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రి ఉత్సవాలను అండమాన్ కొండయ్యవలసలోని బంగారమ్మ గుడి వద్ద ఘనంగా నిర్వహించేందుకు గురువారం పందిరిరాట వేశారు. ఈ ఏడాది అత్యంత వైభవంగా ఉత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు కమిటీ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో ప్రతినిధులు వసంతరావు, గణేశ్, నరసింగరావు, రామకృష్ణ, రమణ, రాజు, నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

76వ వార్డులో..

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు పరిధి బీజేఆర్ కాలనీలో గణేశ్ దుర్గా యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు గురువారం పందిరిరాట వేశారు. బీజేపీ నాయకుడు కరణంరెడ్డి నరసింగరావు పందిరిరాట వేసి పూజలు చేశారు. ఈ నెల 22 నుంచి 11 రోజుల పాటు దుర్గాదేవి ఉత్సవాలను నిర్వహిస్తామని అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు.

భూ కేటాయింపులను రద్దు చేయాలని వినతి

పెదగంట్యాడ, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): అదానీ గంగవరం గ్రైడింగ్ సిమెంట్ యూనిట్‌కు భూ కేటాయింపులతో పాటు అనుమతులు రద్దు చేయాలని కోరుతూ సీపీఎం మండల నాయకులు గురువారం పెదగంట్యాడ తహశీల్దార్ అమలకు వినతిపత్రం అందజేశారు. సర్వే నంబర్ 97పీ, 98, 99పీ, 101పీలలో సుమారు 20 ఎకరాల భూమిని అదానీ మెస్సర్స్ అంబుజా సిమెంట్స్ లిమిటెడ్‌కు, గంగవరం సిమెంట్ గ్రైడింగ్ యూనిట్ ఏర్పాటుకు కేటాయించేందుకు ప్రభుత్వం సిద్ధపడుతుందని పేర్కొన్నారు. ఇలాంటి పరిశ్రమల ఏర్పాటు వల్ల పెదగంట్యాడ నిర్వాసిత కాలనీలతో పాటు గాజువాక కాలుష్యం కోరల్లో చిక్కుకుంటుందని, అందువల్ల భూ కేటాయింపులు, అనుమతులను రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు డి.వెంకటరావు, నమ్మి రమణ, కణితి అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌వో వాటర్ ప్లాంట్ ప్రారంభం



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ శ్రీభరత్ పక్కనే ఎమ్మెల్యే పి.గణబాబు

గోపాలపట్నం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): సామాజిక సేవా కార్యక్రమాల్లో ప్రైవేటు సంస్థలు భాగస్వాములు అవ్వాలని ఎంపీ శ్రీభరత్ పిలుపునిచ్చారు. వెంకటాపురం గ్రామంలో ఎల్జీ ఇండియా సీఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎల్జీ పాలిమర్స్ కంపెనీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఆర్‌వో వాటర్‌ప్లాంట్‌ను ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్జీ విషవాయువు ఘటన బాధితులకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోందని అన్నారు. గ్రామస్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించడం కోసం వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడానికి కృషి చేసిన ఎమ్మెల్యే పి.గణబాబును అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పి.గణబాబు, ఎల్జీ అధికార బృందం పాల్గొన్నారు.

విద్యార్థులు జాతీయ ప్రాజెక్టులు చేసేలా ఎదగాలి

» సమగ్ర శిక్ష జిల్లా అధికారి జె.చంద్రశేఖర్



ప్రాజెక్టును సమగ్ర శిక్ష జిల్లా అధికారి చంద్రశేఖర్‌కు వివరిస్తున్న విద్యార్థి

వేపగుంట, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ హైస్కూల్‌లో రెండు రోజులుగా జరుగుతున్న ఏటీఎల్ సైన్స్ వర్క్‌షాప్‌ను గురువారం సమగ్ర శిక్ష జిల్లా అధికారి జె. చంద్రశేఖర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులు ఆసక్తికరంగా ఉన్నాయన్నారు. అదే విధంగా ఆయా ప్రాజెక్టులపై పూర్తి అవగాహన విద్యార్థులకు కల్పించాలని, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే రీతిలో విద్యార్థులను తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ప్రతినిధి రమేశ్, జిల్లా సైన్స్ అధికారి పి.రాజారావు, హెచ్ఎం కమలకుమారీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

వేపగుంట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): దారపాలెం, గోశాల, వెంకటాపురం ఫీడర్ల పరిధిలోని విద్యుత్ నిర్వాహణ, చెట్ల కొమ్మల తొలగింపు పనుల్లో భాగంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నదని జోన్3 ఈఈ బి.సింహాచలం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కుమ్మరిదిబ్బ, పాత అడ వివరం జంక్షన్, దారపాలెం, ప్రహ్లాదపురం, శ్రీనివాసనగర్, బాలాజీనగర్, వెంకటాపురం, ఆర్.ఆర్.వెంకటాపురం, అజంతాపార్క్ ప్రాంతాల ప్రజలు సహకరించాలన్నారు.

మరింత చేరువగా రూఫ్ టాప్!



(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

ప్రధాన మంత్రి సూర్య ఘర్ పథకం కింద రూఫ్ టాప్ సోలార్‌ను ఏర్పాటు చేసుకోవడానికి విద్యుత్ పంపిణీ సంస్థలు నిబంధనలు సడలిస్తున్నాయి. తాజాగా డిస్కమ్ పరిధిలో ఎక్కడైనా ఏర్పాటు చేసుకుని ప్రయోజనం పొందేలా అవకాశం కల్పించారు. దీనిద్వారా వీలైనంత ఎక్కువ మందికి పథకం అందించేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు.

పీఎం సూర్య ఘర్‌లో మారిన నిబంధనలు

- ఎక్కడ సొంత ఇల్లు ఉన్నా అమర్చుకోవచ్చు
- నివసించే చోట విద్యుత్ వినియోగించుకునే వీలు
- ఈపీడీసీఎల్ పరిధిలో శ్రీకాకుళం నుంచి ఏలూరు వరకు అవకాశం

పథకం ప్రారంభంలో ఏడాదికి రూ.1.5 లక్షల లోపు ఆదాయం ఉన్న వారికి మాత్రమే రాయితీ లభిస్తుందని ప్రకటించారు. ఆ తరువాత ఈ పరిమితి ఎత్తేశారు. సొంత ఇల్లు ఉన్న వారు ఇంటి పై కప్పుపై దీనిని ఏర్పాటు చేయాలి. అయితే విశాఖ లాంటి నగరాల్లో ఎక్కువ సంఖ్యలో ఫ్లాట్లు, అపార్ట్‌మెంట్లపై వ్యక్తిగతంగా సోలార్ ప్లేట్లు ఏర్పాటుకు అసోసియేషన్లు అనుమతి ఇవ్వకపోవడంతో అధికారులు ప్రత్యామ్నాయ ఆలోచన చేశారు. ఫ్లాట్‌లో నివసించే వినియోగదారులకు జిల్లాలో ఎక్కడైనా సొంత ఇల్లు, స్థలం ఉంటే.. అక్కడ ఏర్పాటు చేసుకుని, దాని ద్వారా లభించే సోలార్ విద్యుత్‌ను ఫ్లాట్‌లో వాడుకునే వీలు కల్పించారు. దీనివల్ల కూడా పెద్దగా ప్రయోజనం కనిపించలేదు. ఎక్కడెక్కడి నుంచో ఉద్యోగ, ఉపాధి రీత్యా వచ్చి నగరంలో స్థిరపడిన వారికి లబ్ధి కలగాలంటే పరిధి విస్తృతం చేయాలని భావించారు. ఇందులో భాగంగా ఏపీ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఈపీడీసీఎల్) పరిధిలో అంటే శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం నుంచి పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరు వరకు ఎక్కడైనా సరే రూఫ్ టాప్ సోలార్ పెట్టుకుంటే, దానిని విశాఖలో నివాసం ఉండే ఫ్లాట్‌కు లింక్ చేసుకునే అవకాశం కల్పించారు. ఉదాహరణకు సీతమ్మధారలోని అపార్ట్‌మెంట్‌లో ఉండే వినియోగదారునికి శ్రీకాకుళం జిల్లా కవిటిలో సొంత స్థలం లేదా పొలం ఉండి, అక్కడ రూఫ్ టాప్ సోలార్ పెట్టుకుంటే.. అక్కడ ఉత్పత్తి అయ్యే సోలార్ పవర్‌ని విశాఖలో ఫ్లాట్‌కు లింక్ చేసి ఉపయోగించుకునే అవకాశం కల్పించారు. రెండు చోట్లా యజమాని ఒక్కరే కావడంతో దీని అమలుకు ఇబ్బందులు ఉండవని అధికారులు చెబుతున్నారు. దీనివల్ల రూఫ్‌టాప్ ఏర్పాటు చేసుకునే వారి సంఖ్య గణనీయంగా పెరుగుతుందని భావిస్తున్నారు.

ఎంత ప్రయోజనం అంటే...?

ఒక్కో వినియోగదారుడు మూడు కిలోవాట్ల సామర్థ్యం కలిగిన రూఫ్ టాప్ సోలార్ ఏర్పాటు చేసుకునే వీలుంది. ఒక కిలోవాట్ ద్వారా రోజుకు నాలుగు యూనిట్ల చొప్పున నెలకు 120 యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. దీనికి అయ్యే వ్యయం రూ.60వేలు. అందులో ప్రభుత్వం రూ.30వేలు రాయితీ ఇస్తుంది. రెండు కిలోవాట్లకు నెలకు 240 యూనిట్లు ఉత్పత్తి అవుతుంది. రూ.60వేలు రాయితీ వస్తుంది. మూడు కిలోవాట్లు పెట్టుకుంటే రూ.78వేలు రాయితీ లభిస్తుంది. నెలకు 360 యూనిట్ల సోలార్ విద్యుత్ వస్తుంది. సగటు వినియోగదారులకు ఈ పథకం సరిపోతుంది. ఇందుకు అయ్యే మొత్తం రుణంగా ఇచ్చేందుకు బ్యాంకులు కూడా ముందుకు వస్తున్నాయి. కేవలం రూ.వెయ్యి డౌన్ పేమెంట్‌తో మూడు కిలోవాట్ల పథకం పెట్టుకోవచ్చు. నెల నెలా కట్టే విద్యుత్ బిల్లును ఐదేళ్ల ఈఎంఐల కింద బ్యాంకుకు చెల్లిస్తే రుణం తీరిపోతుంది. రూఫ్‌టాప్ సోలార్ జీవిత కాలం 25 ఏళ్లు. ఐదేళ్లకు ఈఎంఐలు కడితే మిగిలిన 20 ఏళ్లకు వచ్చే విద్యుత్ ఉచితమే.

విస్తృత ప్రచారం చేస్తున్నాం



రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నియోజకవర్గంలో పదివేల మందికి పీఎం సూర్య ఘర్ పథకం అందించాలని లక్ష్యంగా నిర్దేశించింది. దీనిపై విస్తృత ప్రచారం చేస్తున్నాం. డిస్కమ్ పరిధిలో 1,16,364 మంది పేర్లు నమోదు చేసుకున్నారు. ఇప్పటివరకు 23,362 మందికి ఏర్పాటు చేశాం. మరో 574 గ్రౌండింగ్ దశలో ఉన్నాయి. 4,084 ఇనస్టాలేషన్‌కు వెయిటింగ్‌లో ఉన్నాయి. జిల్లాలో 11,897 మంది పేర్లు నమోదు చేసుకోగా 2,910 మందికి అమర్చాం. వీటి సంఖ్య పెంచడానికి విస్తృత ప్రచారం చేస్తున్నాం.

- పృథ్వీతేజ్, సీఎండీ, ఈపీడీసీఎల్

ఆప్కాబ్ రిటైర్డ్ ఎండీ రాజు మృతి



పద్మనాభం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి):ఆంధ్రప్రదేశ్ సహకార సంస్థ (ఆప్కాబ్) రిటైర్డ్ ఎండీ ఎస్వీఎస్ఎన్ రాజు (చిట్టిబాబు) (93) గురువారం మృతి చెందారు. మండలంలోని పాండ్రంగి పంచాయతీ కుర్రపల్లి గ్రామానికి చెందిన ఆయన సహకార శాఖలో వివిధ హోదాల్లో పని చేసి ఆప్కాబ్ ఎండీగా ఉద్యోగ విరమణ చేశారు. 1996లో అల్లూరి సీతారామరాజు శత జయంతి నిర్వహణ కమిటీ సభ్యుడిగా చురుకైన పాత్ర పోషించారు. అల్లూరి జీవిత విశేషాలు, పాండ్రంగితో ఆయనకు గల ఉన్న అనుబంధాన్ని నేటి తరానికి తెలియజేశారు. ఆయన మృతి పట్ల పలువురు నేతలు ప్రగాఢ సంతాపం తెలిపారు.

'డిజిటల్ మారథాన్‌లో యువతకు అవకాశం'

పెదవాల్తేరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): యువతను భాగస్థులను చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనున్న ఆంధ్రా యువ సంకల్ప్ 2కె25 అంబాసిడర్ డిజిటల్ మారథాన్‌లో పాల్గొనాలని వికలాంగుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు కొల్లి కవిత కోరారు. పాల్గొనదలచిన యువత 30లోగా www.andhrayuvasankalp.comలో పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. 18-35 సంవత్సరాల మధ్య వారు 120 సెకండ్ల నిడివి గల వీడియో/ షార్ట్‌ఫిలిమ్స్‌ను సొంత సోషల్ మీడియాలో మార్గదర్శకాల్లో చూపించిన అధికారిక ట్యాగ్‌లతో పోస్ట్ చేయాలన్నారు. జ్యూరీ విజేతలను ప్రకటిస్తుందన్నారు. మొదటి బహుమతి రూ.లక్ష, ద్వితీయ బహుమతి రూ.75 వేలు, తృతీయ బహుమతి రూ.50వేలు అందిస్తామన్నారు. తొమ్మిదిమంది విజేతలను యువసంకల్ప్ అంబాసిడర్‌గా సత్కరిస్తారన్నారు

కేజీహెచ్‌కు ఆధునిక పరికరాలు

మహారాణిపేట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): చర్మంపై ఏర్పడే మచ్చలను తొలగించటానికి సుమారు రూ.45 లక్షల వ్యయంతో అత్యాధునిక లేజర్ మిషన్లను కేజీహెచ్ చర్మ వ్యాధుల విభాగంలో ఏర్పాటు చేశారు. డెర్మటాలజీ పీజీ సీట్ల పెంపుదలలో భాగంగా వీడీఎల్ నిధులతో వీటిని ఏర్పాటు చేస్తున్నట్లు ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వాణి తెలిపారు. బొల్లి మచ్చలు, సొరియాసిస్‌కు అవసరమైన కాంతి చికిత్స అందుబాటులో ఉందని డెర్మటాలజీ విభాగాధిపతి డాక్టర్ టి.శాంతి తెలిపారు. ప్రజలు ఈ సేవలను ఉచితంగా వినియోగించుకోవాలని కోరారు.

ఈ-గవర్నెన్స్ సదస్సుకు పక్కా ఏర్పాట్లు: కలెక్టర్

మహారాణిపేట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): విశాఖ వేదికగా ఈనెల 22,23 తేదీలలో జరగనున్న ఈ-గవర్నెన్స్ సదస్సుకు పక్కా ఏర్పాట్లు చేయాలని అధికారులకు కలెక్టర్ ఎంఎన్. హరేంధిరప్రసాద్ ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశమందిరంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వికసిత్ భారత్, సివిల్ సర్వీసెస్, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ పేరిట రెండురోజులు నోవాటెల్ వేదికగా నిర్వహించే సదస్సులో ఆరు ప్లీనరీలు, ఆరు బ్రేక్ అవుట్ సదస్సులు జరుగుతాయన్నారు. దేశం నలుమూలల నుంచి 1000 మంది అతిథులు, ఐటీ రంగ నిపుణులు, సీఎం చంద్రబాబునాయుడు, కేంద్ర, రాష్ట్ర ఐటీ మంత్రులు సదస్సులో పాల్గొంటారన్నారు. సదస్సు విజయవంతం కోసం 13 ప్రధాన కమిటీలు, 10 ఉప కమిటీలు నియమించి, బాధ్యతలను గుర్తుచేశారు. నగర సుందరీకరణకు ప్రాధాన్యత ఇవ్వాలని, శానిటేషన్ పక్కాగా నిర్వహించాలని, హోర్డింగ్‌లు ఏర్పాటుచేయాలని, ప్రధానంగా ఎయిర్‌పోర్టు, రైల్వేస్టేషన్‌లో హోర్డింగులు పెట్టాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు, గాలా డిన్నర్ ఏర్పాటులో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సమీక్షలో జేసీ మయూర్ అశోక్, వీఎంఆర్‌డీఏ, జీవీఎంసీ కమిషనర్లు విశ్వనాథన్,కేతన్‌గార్గ్, డీఆర్వో భవానీ శంకర్, భీమిలి ఆర్డీవో సంగీత్ మాథుర్ ఇతర అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్

పోలీసు సేవలను వినియోగించుకోవాలి: సీపీ

విశాఖపట్నం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహన ప్రమాదాల్లో బాధితులు, కుటుంబ సభ్యులు ఆర్థిక ప్రయోజనాల కోసం పోలీస్‌సేవలను ఉపయోగించుకోవాలని సీపీ శంఖబ్రతబాగ్చి కోరారు. కమిషనరేట్‌లో గురువారం విలేకరులతో మాట్లాడుతూ గుర్తుతెలియని వాహనాల వల్ల జరిగిన రోడ్డుప్రమాదాలు (హిట్ అండ్ రన్) బాధితులు, వారికుటుంబసభ్యుల కోసం దేశంలోనే మొదటిసారిగా నగర పోలీస్ కమిషనరేట్‌లో 'రోడ్డు ట్రాఫిక్ యాక్సిడెంట్ విక్టిమ్ అసిస్టెన్స్ సెంటర్‌'ను ప్రారంభించామన్నారు. నగర పరిధిలో ఎవరైనా హిట్ అండ్ రన్ కారణంగా గాయపడినా, మృతిచెందినా బాధితులు బీమా కోసం పోలీస్‌స్టేషన్, సీపీ కార్యాలయం, కలెక్టరేట్, ఇన్సూరెన్స్ కార్యాలయాలు, కోర్టులు చుట్టూ తిరుగుతున్నారన్నారు. అలాంటివారికి ఒకేచోట బీమా అందుకునే ప్రక్రియను పూర్తిచేసేందుకు వీలుగా ప్రత్యేక సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ప్రత్యేకంగా కానిస్టేబుల్‌ను కేటాయించి, పోలీస్‌స్టేషన్ నుంచి ఎఫ్ఐఆర్, గాయాల సర్టిఫికెట్, పోస్టుమార్టం రిపోర్టు, శవపంచనామా తదితర డాక్యుమెంట్లను బాధితులకు అందిస్తామన్నారు. పరిహారం పొందడానికి సహాయపడుతున్నామన్నారు. ఈ కేంద్రాన్ని కమిషనరేట్‌లో 2022లో ప్రారంభించగా ఇప్పటివరకు 79 మంది బాధితులకు రూ.63.5 లక్షల పరిహారాన్ని ముంబైలోని జనరల్ ఇన్సూరెన్స్ కౌన్సిల్ ద్వారా అందజేశామన్నారు. ఈ సమావేశంలో ట్రాఫిక్ ఏసీపీ వాసుదేవ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ శంఖబ్రతబాగ్చి

రవాణా శాఖ మంత్రికి ఎన్ఎంయూఏ నేతల సత్కారం

ద్వారకాబస్‌స్టేషన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్త్రీశక్తి పథకం విజయవంతం కావడంలో రవాణాశాఖ కీలకభూమిక పోషించిందని ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ (ఎన్ఎంయూఏ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పీవీ రమణారెడ్డి, వైశ్రీనివాస రావు రవాణాశాఖా మంత్రి ఎం.రామ్‌ప్రసాద్‌రెడ్డికి వివరించారు. ఈ మేరకు గురువారం మంత్రిని సెక్రటేరియట్‌లో కలిసి సత్కరించారు. పథకం మరింత విజయవంతమయ్యేందుకు వీలుగా కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. పదోన్నతులకు సంబంధించిన ఫైలుకు ముఖ్యమంత్రి ఆమోదం తెలిపారని, జనరల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్‌లో జాప్యం జరుగుతోందన్నారు. ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. పెండింగ్ సమస్యల పరిష్కారానికి శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసరాజు, కోశాధికారి పీవీవీ మోహన్, సీసీఎస్ పాలకవర్గ సభ్యులు అనంతరాములు, వినోద్‌కుమార్, ఎన్టీఆర్ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు కేసీహెచ్ మోహన్ తదితరులున్నారు.



మంత్రిని సత్కరిస్తున్న ఎన్ఎంయూఏ నేతలు

స్వర్ణ కవచంతో సింహాచలేశుడి దర్శనం



సింహాచలం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామి గురువారం తన భక్తులకు స్వర్ణ నారసింహ కవచంతో దర్శనమిచ్చాడు. గత కొన్నేళ్లుగా ప్రతి గురువారం, ముక్కోటి ఏకాదశి పర్వదినం, వార్షిక తిరుకల్యాణోత్సవాలలో స్వామి స్వర్ణ నారసింహుడుగా భక్తులకు దర్శనమిస్తారు. ఈ ఏడాది ఏప్రిల్ 30నాటి నిజరూప దర్శనం సందర్భంగా చందనపు ఒలుపును పురస్కరించుకుని సుమా రు 20 రోజులుగా కవచాన్ని అలంకరించడం లేదు. భక్తుల అభ్యర్థన మేరకు గురువారం అలంకరించి దర్శనాలు కల్పించారు.

కొండవాలు ఆక్రమణలో హెచ్చరిక బోర్డు

ఆనందపురం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆనందపురం మండలం భీమన్నదొరపాలెంలో పాత సర్వే నంబరు 156లో ప్రభుత్వానికి చెందిన కొండ వాలులో కూటమి నేత ఆక్రమణలకు పాల్పడిన ప్రాంతంలో రెవెన్యూ అధికారులు గురువారం హెచ్చరిక బోర్డు ఏర్పాటుచేశారు. గురువారం ఉదయం మండల సర్వేయర్, వీఆర్వో, ఇతర సిబ్బంది కొండవాలుప్రాంతాన్ని సందర్శించి చదునుచేసే భూమిని పరిశీలించారు. వారంరోజులపాటు కొండవాలును చదునుచసిన వ్యక్తుల వివరాలు తెలిసినా కిందిస్థాయి అధికారులు మౌనం వహించడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

కరుణ కుమారికి కలెక్టర్ అభినందన



కరుణ కుమారిని సత్కరిస్తున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్

విశాఖపట్నం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): భారత్ వేదికగా నవంబరులో జరగనున్న అంధ మహిళల టీ-20 ప్రపంచకప్ జట్టుకు ఎంపికైన కరుణ కుమారిని కలెక్టర్ ఎంఎన్. హరేంధిరప్రసాద్ అభినందించారు. ప్రస్తుతం సాగన్‌నగర్‌లోని అంధ బాలికల పాఠశాలలో పదోతరగతి చదువుతున్న కుమారిని జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్, పాఠశాల నిర్వాహకులతో కలిసి గురువారం కలెక్టర్ చాంబర్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా ఆమెకు కలెక్టర్ సాలువా కప్పి సత్కరించి, స్వయంగా స్వీట్స్ తినిపించారు. ప్రాక్టీస్‌కు అనుగుణంగా ప్రత్యేకించి రెండు క్రికెట్ కిట్లు ఇవ్వాలని అధికారులకు ఆదేశించారు. కరుణ కుమారి స్వగ్రామం అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు మండలంలోని వంట్లమామిడి.

క్రైం... crime news

ఆటో బోల్తా పడి ఒకరి మృతి



గౌరినాయుడు (ఫైల్)

ఆనందపురం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆటో బోల్తాపడిన సంఘటనలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన మండలంలోని కుసులువాడ పంచాయతీ తీగలవాని చెరువు వద్ద గురువారం జరిగింది. సీఐ చింతా వాసునాయుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చందక పంచాయతీ నిమ్మలవారి కళ్లాలుకు చెందిన యర్ర గౌరినాయుడు (35) ఆటో నడుపుతూ జీవనోపాధి పొందుతున్నాడు. ఈ క్రమంలో గురువారం ఆటో నడుపుకుని, మధ్యాహ్న భోజనం చేసేందుకు ఇంటికి బయలుదేరాడు. తీగలవాని చెరువు వద్దకు వచ్చేసరికి అదుపుతప్పిన ఆటో ఒక్కసారిగా బోల్తా పడింది. గౌరినాయుడు దానికి కింద ఉండిపోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా ప్రాణాలు కోల్పోయాడు. ఇతడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

బీచ్‌రోడ్డులో కారు, ద్విచక్ర వాహనం ఢీ

- అపస్మారక స్థితిలో యువకుడు



అపస్మారకస్థితిలో రోడ్డుపై పడివున్న యువకుడు

సాగర్‌నగర్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రుషికొండ బీచ్‌రోడ్డులో గురువారం సాయంత్రం కారును ద్విచక్రవాహనం ఢీకొట్టిన ప్రమాదంలో ఓ యువకుడు అపస్మారక స్థితిలోకి చేరుకున్నాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. రుషికొండ సాయిప్రియా రిసార్ట్స్ వద్ద బీచ్‌రోడ్డులో యూటర్న్ తీసుకుంటున్న కారును ముగ్గురు యువకులు ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనం వేగంగా దూసుకు వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనం నడుపుతున్న యువకుడు రోడ్డుపై కుప్పకూలిపోయాడు. అపస్మారక స్థితికి చేరుకున్న అతడిని గీతం ఆస్పత్రికి తరలించారు. ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్టు తెలిసింది. పీఎం పాలెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న యువకుల వివరాలు తెలియరాలేదు.

షీలానగర్‌లో చైన్ స్నాచర్‌ల హల్‌చల్

- ఇద్దరు మహిళల నుంచి బంగారు గొలుసుల చోరీ

అక్కిరెడ్డిపాలెం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): షీలానగర్ ప్రాంతంలో బుధవారం రాత్రి చైన్ స్నాచర్‌లు రెచ్చిపోయారు. గాజువాక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... షీలానగర్‌కు చెందిన మహిళ డీ మార్ట్‌లో సరకులు కొనుగోలు చేసి నడిచి ఇంటికి వెళ్తుండగా వెనుక నుంచి ద్విచక్రవాహనంపై వచ్చిన ఇద్దరు యువకులు ఆమె మెడలో వున్న రెండు తులాల బంగారు పుస్తెల తాడును తెంచుకుని పరారయ్యారు. అదే ప్రాంతంలో కొద్దిసేపటి తరువాత విజయనగరానికి చెందిన అత్తా కోడళ్లు కిమ్స్ ఆస్పత్రి నుంచి నడిచి వస్తుండగా షాపింగ్‌మాల్ సమీపంలో వెనుక నుంచి ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు ఆగంతకులు కోడలు లక్ష్మి మెడలో వున్న రెండున్నర తులాల బంగారు గొలుసు తెంచుకుని పరారయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని బాధితుల నుంచి వివరాలు సేకరించారు. సమీపంలోని సీసీ టీవీ ఫుటేజిని పరిశీలిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

సీహార్స్ జంక్షన్ వద్ద...

మహారాణిపేట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో దుండగులు ఓ మహిళ మెడలో గొలుసు లాక్కుని ఉడాయించారు. బుధవారం రాత్రి సుమారు 7 గంటల సమయంలో ఈ సంఘటన జరిగింది. కస్టమ్స్ విభాగానికి చెందిన క్యాంటీన్‌లో విధులు నిర్వహిస్తున్న దాసరి రమా, మరో ఇద్దరు మహిళలతో కలసి పోర్టు రోడ్డు మీదుగా కొత్తరోడ్డు సమీపంలోని సీహార్స్ జంక్షన్ వద్దకు వచ్చేసరికి ద్విచక్ర వాహనంపై ఇద్దరు దుండగులు వెనుక నుంచి వచ్చి రమా మెడలో బంగారు పుస్తెల తాడును బలంగా లాగారు. దీనితో మెడలోని మంగళసూత్రం కిందపడిపోగా, తులం బంగారు గొలుసు చేజిక్కించుకుని కాన్వెంట్ జంక్షన్ మీదుగా మర్రిపాలెం వైపు పారిపోయారు. ఒక్కసారిగా తేరుకున్న మహిళలు వెంటనే కేకలు వేసినా ఫలితం లేకుండా పోయింది. వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే ఇదే దుండగులు మర్రిపాలెం తదితర ప్రాంతాల్లోనూ మరికొన్ని గొలుసు దొంగతనాలకు పాల్పడినట్లు సమాచారం.

గంజాయి తరలిస్తున్న ఇద్దరు మహిళల అరెస్టు

విశాఖపట్నం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రైల్లో గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు మహిళలను ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బంది పట్టుకుని వారి నుంచి రూ.95 వేల విలువ చేసే 19 కేజీల గంజాయి సంచులను స్వాధీనం చేసుకున్నారు. గురువారం ప్లాట్‌ఫామ్‌లపై తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో ఒడిశాకు చెందిన మాలతి సాహు (56), సుమిత సాహు (35)లు ముంబయికి గంజాయి తరలిస్తూ దొరికిపోయారు. వారిని అరెస్టు చేసి కోర్టుకు తరలించామని రైల్వే పోలీసులు తెలిపారు.

నేటి నుంచి మెడ్‌టెక్ జోన్‌లో ఏపీ క్లీన్ ఎనర్జీ ఎక్స్‌పో

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ క్లీన్ ఎనర్జీ ఎక్స్‌పో, ఇన్వెస్టర్స్ కాన్‌క్లేవ్ (ఏపీసీఏ క్స్‌పో)-2025 శుక్ర, శనివారాల్లో మెడ్‌టెక్ జోన్‌లోని కలాం కన్వెన్షన్ సెంటర్‌లో జరగనున్నది. న్యూ అండ్ రెన్యూవబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మద్దతుతో నేషనల్ సోలార్ ఎనర్జీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహిస్తోంది. పునరుత్పాదక శక్తి, స్టోరేజీ, గ్రీన్ హైడ్రోజన్, అనుబంధ రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించే అంశాలపై చర్చించనున్నారు. క్లీన్‌ఎనర్జీ సొల్యూషన్లు, ఇన్నోవేషన్లు, మోడల్స్ ప్రదర్శిస్తారు. వివిధ సంస్థల సీఈవోలు, పరిశ్రమల యజమానులు హాజరు కానున్నారు.

ఎన్‌ఈవైపీ పోటీలు రేపు

విశాఖపట్నం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): నేషనల్ ఎన్విరాన్‌మెంట్ యూత్ పార్లమెంట్ (ఎన్‌ఈవైపీ) లెవెల్-1 పోటీలు ఈ నెల 20వ తేదీ ఉదయం 9 గంటల నుంచి జరగనున్నాయని ఏయూ సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి ఆచార్య సీఎస్‌వీ సత్యనారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సివిల్ ఇంజనీరింగ్ విభాగంలోనే ఈ పోటీలు జరుగుతాయన్నారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు ఏయూ, అనుబంధ కళాశాలలకు చెందిన విద్యార్థులు అధికసంఖ్యలో తమ పేర్లను నమోదు చేసుకున్నారని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.